

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



నల్లచట్టాలకు దొడ్డిదారి... కొత్త మార్కెట్ సంస్కరణలు
మూసీ పునరుజ్జీవంలో అందరికీ న్యాయం చేస్తాం
శీతాకాల విడిదికి హైదరాబాద్‌కు రాష్ట్రపతి
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 22 | బుధవారం | 18-12-2024 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# లోక్‌సభలో... జమిలి బిల్లు



- బిల్లు ప్రవేశంపై అధికార ప్రతిపక్షాల మధ్య హోరాహోరీ వాగ్యుద్ధం
- బిల్లు ప్రవేశానికి సభలో ఓటింగ్ మద్దతు పలికిన 269 మంది ఎంపిలు
- 198 మంది వ్యతిరేకం
- జెపిసి ముందుకు 129వ రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఒకేసారి ఎన్నికల బిల్లులు

**న్యూఢిల్లీ :** 'ఒకేదేశం–ఒకే ఎన్నిక' కు సంబంధించిన రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీంతో ప్రతిపక్షాలు కన్నెర్రచేశాయి. దీనిని నియంతృత్వచర్యగా పేర్కొన్నాయి. అధికార ప్రతిపక్షాలమధ్య ఈ బిల్లులపై తొలుత హోరాహోరీ వాగ్యుద్ధం జరిగింది. 'ఒకేదేశం–ఒకే ఎన్నిక'కు సంబంధించిన బిల్లును సభలో ప్రవేశపెట్టేందుకు మొదట చర్చ జరిగింది. తర్వాత ఓటింగ్ జరిగింది. బిల్లును సభలో ప్రవేశపెట్టాలని కోరుతూ 269 మంది అనుకూలంగా ఓటు వేయగా, ఈ బిల్లును సభముందుకు తీసుకురావొద్దని వ్యతిరేకిస్తూ 198 మంది ఓటు వేశారు. రాజ్యాంగానికి 129వ సవరణ బిల్లుతోపాటు పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూ–కశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతాలలో కూడా లోక్‌సభతోపాటు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి ఉద్దేశించిన మరో బిల్లు కూడా సభ ముందుకు వచ్చింది. ''జెపిసిలో ఈ రెండు బిల్లులపై సవివరంగా చర్చలు జరుగుతాయి, తర్వాత జెపిసి నివేదికను కేంద్రమంత్రివర్గం ఆమోదిస్తుంది, ఆ తర్వాత మరోసారి ఈ రెండు బిల్లులపై పార్లమెంటులో చర్చ జరుగుతుంది, ఈ రెండు బిల్లులనూ సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) ముందుపెట్టి ప్రతిస్థాయిలోనూ చర్చలు జరిపేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంత్రివర్గ సమావేశంలో ఇప్పటికే సుముఖత వ్యక్తం చేశారు.'' అని అమిత్ షా వివరణ ఇచ్చారు. కేంద్ర న్యాయశాఖామంత్రి అర్జున్ రామ్ మేఘూవాల్ మొదట లోక్‌సభలో 129వ రాజ్యాంగ సవరణబిల్లును ప్రవేశపెట్టి చర్చలో పాల్గొని 90 నిమిషాలు ప్రసంగించారు. రాష్ట్రాలలో ప్రభుత్వాలు చలాయించే అధికారాలకు ఈ రెండు బిల్లులవల్ల ఎంత మాత్రం నష్టం వాటిల్లబోదని మంత్రి మేఘూవాల్ చర్చ తరువాయి 2లో

## రాజ్యాంగ విరుద్ధం

### సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకం : ప్రియాంక



జమిలి ఎన్నికల బిల్లు రాజ్యాంగ విరుద్ధం, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకమని కాంగ్రెస్‌పార్టీ తీవ్రంగా విమర్శించింది. జమిలి ఎన్నికల బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టే విషయంపై ఓటింగ్‌కు ముందుగా జరిగిన చర్చలో కాంగ్రెస్‌సభ్యులు పాల్గొన్నారు. బిల్లును సభలో ప్రవేశపెట్టాలా? వద్దా? అనే దశలోనే ఓటింగ్ చేపట్టడం చూస్తే అధికార బిజెపికి సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ లేదని స్పష్టం అవుతోందని కాంగ్రెస్‌పార్టీ విమర్శించింది. రాజ్యాంగ సవరణ బిల్లు, సాధారణ బిల్లు ఈ రెండింటినీ సభలో ప్రవేశపెట్టడం అంటే రాజ్యాంగ సమాఖ్య స్వరూపంపై తరువాయి 2లో



## 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' నియంతృత్వానికి దారి

### సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా

జమిలి ఎన్నికలకు తాము వ్యతిరేకమని లా కమిషన్, రామ్‌నాథ్ కోవింద్ కమిటీకి అభ్యంతరాలతో కూడిన నివేదిక సమర్పించినట్లు వెల్లడి

**విజయవాడ:** జమిలి ఎన్నికలకు భారత కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా స్పష్టం చేశారు. ఈ మేరకు లా కమిషన్‌కి, రామ్‌నాథ్ కోవింద్ కమిటీకి సిపిఐ అభ్యంతరాలతో కూడిన నివేదిక సమర్పించినట్లు తెలిపారు. స్థానిక దాసరి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజా మాట్లాడుతూ వాస్తవ పరిస్థితులకు జమిలి ఎన్నికలు ఆచరణ సాధ్యం కాదన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా స్వేచ్ఛగా, పారదర్శకంగా పని చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల సంఘానికి శాశ్వత కమిటీ, రాజ్యాంగబద్ధ నియమాలు ఉన్నాయని చెప్పారు. ఒకే దేశం–ఒకే ఎన్నిక అనేది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం అన్నారు. ఇది రానున్న రోజుల్లో నియంతృత్వ విధానానికి దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. పదేపదే ఎన్నికలు రావటంవల్ల డబ్బు అధికంగా ఖర్చు అవుతుందని చెపుతున్న బిజెపి ఎలక్ట్రోరల్ బాండ్స్ గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. జమిలి ఎన్నికలను కొన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారని, ఈ అంశంపై సిపిఐ కూడా పార్లమెంటు లోపలా, బయట పోరాడుతున్నదని చెప్పారు. రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలైన సందర్భంగా పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరుగుతోందన్నారు. భారతదేశంలో అన్ని వర్గాల ప్రజలు కలిసి జీవించాలంటే దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య విధానం ఉండాలంటూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచన చేసి రాజ్యాంగాన్ని అందించారని చెప్పారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతుందని ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ గత ప్రభుత్వానికి, అదానీతో జరిగిన ఒప్పందం గురించి తెలిసిన మోదీ ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం అదానీని అరెస్ట్ చేస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంతో సంపన్నులకు మరింత మేలు జరుగుతుందని, పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు దిగజారి గౌరవంగా జీవించలేని పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చుస్తుందనే ఆలోచనతో ప్రజలు బిజెపికి పూర్తి మెజార్టీ ఇవ్వకుండా తిరస్కరించారని చెప్పారు. అయినా రాజకీయ చతురతతో మూడవసారి మోదీ ప్రధాని అయ్యారని చెప్పారు. చంద్రబాబు, నితీష్‌కుమార్ ఇతర మిత్రపక్షాలతో ఎన్‌డిఎ ప్రభుత్వం పని చేస్తున్నదని, అది ఏ క్షణమైన కూలిపోవచ్చని జోస్యం చెప్పారు. ప్రజలు వద్దనుకున్న బిజెపికి తరువాయి 12లో



## ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో ఉత్కంఠ

### ఎసిబికి కేసు అప్పగింత?

ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేందుకు సిద్ధమవుతున్న దర్యాప్తు సంస్థ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఈ–కార్ రేస్ కేసుపై అందరి చూపు ఎసిబిపైనే ఉంది. ఈ కేసుపై ఎప్పుడు ఎఫ్‌ఐఆర్ చేస్తారు..? ఎవరెవరిని నిందితులుగా చేర్చుతారు.. ? ఎవరెవరికి ఎప్పుడు నోటీసులు రానున్నాయనేది సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ కేసులో టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో పాటు పురపాలక శాఖ అప్పటి స్పెషల్ సిఎస్ అధికారి అరవింద్ కుమార్‌లే ప్రధాన నిందితులు కావడంతో వీరిపై విచారణ జరిపేందుకు ప్రభుత్వానికి గవర్నర్ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఈ కేసును ఎసిబికి అప్పగిస్తున్నట్లు స్పష్టం చేయడంతో అందరి చూపు ఎసిబిపై నెలకొని ఉంది. ఈ కేసును దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం ఎసిబికి అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో బుధ, గురువారాల్లో ఎసిబి అధికారులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. ఫార్ములా ఈ–కార్ రేస్ కోసం అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించి రూ.55 కోట్లను అక్రమంగా దారి మళ్లించారనేది ప్రధాన అభియోగం. దీనికి అప్పటి పురపాలక శాఖ మంత్రి కెటిఆర్‌తో పాటు పురపాలక శాఖ అప్పటి స్పెషల్ సిఎస్ అధికారి అరవింద్ కుమార్‌లే ప్రధాన సూత్రధారులు అని ప్రభుత్వం అభియోగం మోపింది. ఈ అంశంపై అటు తరువాయి 2లో

## పారిశ్రామికంగా కొత్తగూడెం అభివృద్ధి

### కొత్తగూడెం, పాల్వంచను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలి

వెంటనే ఎన్నికలు జరపాలి

శాసనసభ జీరో అవర్‌లో సిపిఐ శాసనసభా పక్షనేత కూనంనేని సాంబశివ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్



కొత్తగూడెం, పాల్వంచను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని, వెంటనే అక్కడ ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుతాన్ని కోరారు. శాసనసభలో మంగళవారం జీరో అవర్‌లో ఈ విషయాన్ని కూనంనేని సాంబశివరావు ప్రస్తావిస్తూ కొత్తగూడెం, పాల్వంచ జంటనగరాలుగా ఉంటాయన్నారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ తర్వాత కొత్తగూడెమే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని, ఒక విధంగా చూస్తే ఈ ప్రాంతం రెండవ స్థానంలో ఉంటుందన్నారు. కానీ దురదుష్టవశాత్తు మన పాలకుల అశ్రద్ధ, నిర్లక్ష్యమో, జిఓలు సరిగ్గా చదవకపోవటమో, ఏ కారణమైనప్పటికీ గత తరువాయి 12లో

## రాష్ట్ర అప్పులపై చర్చకు సిద్ధం

- గత ప్రభుత్వ తరహాలో ఏదీ గోప్యంగా పెట్టడంలేదు
- అంతా పారదర్శకమే
- గ్యారెంటీలు లేకుండా రూ.10,990 కోట్లు అప్పులున్నాయ్
- ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క
- అప్పులపై బిఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య వాగ్వాదం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర అప్పుల విషయంలో గత ప్రభుత్వ తరహాలో తాము ఏదీ గోప్యంగా పెట్టడంలేదని, అన్నీ పారదర్శకంగానే ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ సభ్యులు హరీశ్‌రావు సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని, రాష్ట్ర అప్పులపై చర్చించేందుకు తాము సిద్ధమేనని డిప్యూటీ సిఎం ప్రకటించారు. శాసనసభ సమావేశాలలో ఏ సందర్భంలో చర్చకు వస్తారో బిఆర్‌ఎస్ సభ్యులు హరీశ్‌రావు స్పీకర్‌కు చెప్పాలని, స్పీకర్ అనుమతితో ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పారు. శాసనసభలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్ర అప్పులపై బిఆర్‌ఎస్ సభ్యులు హరీశ్‌రావు అడిగిన ప్రశ్నపై కాంగ్రెస్, బిఆర్‌ఎస్ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2023 డిసెంబర్ నుంచి, 20 24 నవంబర్ 30 వరకు ఎఫ్‌ఆర్‌బిఎం రుణాలు రూ.52,118 కోట్లను డ్రా చేశామని, 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ 30వ తేదీ వరకు కార్పొరేషన్లలో డ్రా చేసిన ఎఫ్‌పివిలు ఎఫ్‌ఆర్‌బిఎంయేతర రుణాలు రూ.61,991.14 కోట్లు అని వివరించారు. గ్యారంటీలు లేకుండా రూ.10,990 కోట్ల అప్పులు ఉన్నాయని చెప్పారు. హరీశ్ రావు చాలా ఏళ్ల నుంచి సభలో ఉన్నామని చెబుతున్నారని, ఆయనకు నిబంధనలన్నీ తెలుసునని, కానీ ప్రశ్నోత్తరాల సమయంలో కేవలం ప్రశ్నలు మాత్రమే అడుగుతారని, కానీ ఆయన స్వల్పకాలిక చర్చ తరహా ఉపన్యాసాలు ఇస్తున్నారని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో వారి పాత చరిత్ర చెప్పి తరువాయి 2లో



### శాసనసభ నిబంధనలు

## భట్టి X హరీశ్‌రావు

శాసనసభ నిబంధనలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ తన్నీరు హరీశ్‌రావుల మధ్య వాగ్వాదం జరిగింది. గతంలో రూపొందించిన శాసనసభ నిబంధనలు, బిఎసి సమావేశ నిర్వహణపై శాసనసభలో వారి మధ్య పరస్పర విమర్శలు చోటుచేసుకున్నాయి. శాసనసభలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్ర ప్రభుత్వ అప్పుల విషయంలో బిఆర్‌ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్‌రావు అడిగిన ప్రశ్న శాసనసభ నిబంధనలు, స్పీకర్ స్థానం, బిఎసి అంశాలపై చర్చకు దారితీసింది. అప్పుల విషయంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సమాధానం చెప్పగా, బిఆర్‌ఎస్ సభ్యులు హరీశ్‌రావు ప్రివిలేజ్ మోషన్‌ను ప్రస్తావించారు. ఇందుకు భట్టి విక్రమార్క స్పందిస్తూ బిఆర్‌ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు శాసనసభ బిఎసి తరువాయి 2లో

## లగచర్ల ఘటనపై బిఆర్‌ఎస్ రాద్ధాంతం

- ప్రతిపక్ష పార్టీ తీరుపై స్పీకర్, మంత్రులు ఆగ్రహం
- బిఆర్‌ఎస్, బిజెపి నిరసనల మధ్య మూడు బిల్లులు ఆమోదం
- రాష్ట్ర పర్యాటక విధానంపై చర్చ

ప్రజాపక్షం/హైదరాబాద్



బిఆర్‌ఎస్, బిజెపి నిరసనల మధ్యనే శాసనసభలో మూడు బిల్లులు ఆమోదం పొందాయి. ''తెలంగాణ యువ, భారత వ్యాయామ విద్య, క్రీడా విశ్వవిద్యాలయం బిల్లు –2024, తెలంగాణ విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు –2024, తెలంగాణ వస్తువుల,సేవల పన్ను సవరణ బిల్లు''లకు శాసనసభ మంగళవారం ఆమోదం తెలిపింది. పర్యాటక పాలసీ విధానంపైన సభలో స్వల్పకాలిక చర్చ అనంతరం సభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. లగచర్లపైన బిఆర్‌ఎస్ సభ్యులు, ఆరు గ్యారంటీల అమలు చట్టంపైన బిజెపి సభ్యులు చర్చకు పట్టుపబట్టారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్,బిజెపి సభ్యులు ప్లకార్డులను ప్రదర్శిస్తూ, స్పీకర్ పోడియం తరువాయి 2లో

## సాయుధ పోరాట యోధుడు దుర్గ్యా నాయక్ మృతి





ప్రజాపక్షం/దేవరుప్పుల/జనగామ

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోతు దుర్గ్యానాయక్ (107) మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం రాత్రి మృతిచెందగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులతో పాటు పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ఆయన భౌతికకాయానికి అరుణపతాకం కప్పి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**సిపిఐ రాష్ట్ర సమితి సంతాపం**

దుర్గ్యానాయక్ మతి పట్ల సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్యనాయక్ విప్లవ జోహార్లు అర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దుర్గానాయక్ మరణం నేటి తరానికి తీరని లోటు తరువాయి 12లో

## 'సంధ్య'కు నోటీసులు



పుష్ప–2 ప్రీమియర్ షో సందర్భంగా థియేటర్‌లో తొక్కిసలాటపై పోలీసుల చర్యలు

పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

అల్లు అర్జున్ నటించిన పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట కేసుకు సంబంధించి సంధ్య థియేటర్ యాజమాన్యానికి చిక్కడపల్లి పోలీసులు షోకాజ్ నోటీసులు మంగళవారం జారీ చేశారు. ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని పోలీసులు సూచించారు. ఈ కేసులో ఇప్పటికే సంధ్య థియేటర్ యజమానుల్లో ఒకరైన ఎం.సందీప్, సీనియర్ మేనేజర్ ఎం.నాగరాజు, లోయర్ బాల్కనీ ఇన్చార్జ్ గంధకం విజయ్ చందర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో అరెస్ట్ అయిన నటుడు అల్లు అర్జున్ ఆ తర్వాత మధ్యంతర బెయిల్‌పై బయటకు వచ్చారు. తాజాగా, ఈ కేసులో మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ప్రీమియర్ షో సందర్భంగా నటీనటులు థియేటర్‌కు వస్తున్న విషయాన్ని సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు వినతి పత్రం ద్వారా తెలియజేస్తూ అనుమతి కోరింది. అయితే, పోలీసులు ఈ విజ్ఞప్తిని తిరస్కరిస్తూ థియేటర్ యాజమాన్యానికి పంపిన లేఖ ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. థియేటర్‌కు రెండుపక్కలా రెస్టారెంట్లు ఉన్నాయని, నటులు వస్తే భద్రత కల్పించడం ఇబ్బంది తరువాయి 12లో

## ఇకపై ఎన్‌టిఎ పరీక్షలు నిర్వహించదు!

### కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటన

వచ్చే ఏడాది ఎన్‌టిఎ పునర్నిర్మాణం, కొత్త పోస్టులు సృష్టిస్తామని వెల్లడి



**న్యూఢిల్లీ :** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) 2025 నుంచి ఎలాంటి రిక్రూట్‌మెంట్ పరీక్షలను నిర్వహించబోదని, బదులుగా కేవలం ఉన్నత విద్య ప్రవేశ పరీక్షల పైనే దృష్టి సారిస్తుందని మంగళవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. వచ్చే ఏడాది ఎన్‌టిఎను పునర్నిర్మిస్తామని, కొత్త పోస్టులను సృష్టిస్తామని ఆయన ఇక్కడ విలేకరులకు తెలిపారు. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలో లీకులు, అనుమానాస్పద కారణాలు, కొన్ని చోట్ల వరుస రద్దుల నేపథ్యంలో,ఈ ఏడాది ప్రారంభంలో ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి ప్యానెల్ సిఫారసులను పరిగణనలోకి తీసుకుని, పరీక్ష సంస్కరణల్లో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. విద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్‌అండర్‌గ్రాడ్యుయేట్ (ఎన్‌ఇఇటియుజి)ను సాంప్రదాయ పెన్, పేపర్ మోడ్‌లో నిర్వహించాలా లేదా కంప్యూటర్ ఆధారిత తరువాయి 12లో

### ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు

## కన్వీనర్ల నియామకం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు(2025–26 విద్యా సంవత్సరానికి గాను) రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మంగళవారం కన్వీనర్లను నియమించింది. ఆయా విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్లను సంప్రదించి కన్వీనర్లను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా వీటికి సంబంధించిన షెడ్యూల్స్ త్వరలోనే ప్రకటిస్తామని టిజిసిహెచ్ తెలిపింది.

**సెట్ కన్వీనర్లు వీరే**

టిజి పిజిఈసెట్ కన్వీనర్ గా ప్రొఫెసర్ ఎ.అరుణ కుమారి (జెఎన్‌టియు హెచ్), టిజి ఐసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ అలువలరవి, (మహాత్మాగాంధీ యూనివర్సిటీ), తరువాయి 2లో

# మాస్కోలో ఉక్రేన్ స్కూటరు బాంబుదాడి

## రష్యా సీనియర్ జనరల్ మృతి



**కీవ్ :** స్కూటరు బాంబు దాడిలో రష్యాకు చెందిన సీనియర్ ఆర్మీ జనరల్ ఒకరు మరణించినట్లు ఉక్రేన్ ప్రకటించింది. మాస్కోలో జరిగిన స్కూటరు బాంబు దాడిలో రష్యా సీనియర్ సైనిక జనరల్ లెఫ్టినెంట్ ఇగోర్ కిరిల్లోవ్ మరణించారు. ఉక్రేనియన్ సెక్యూరిటీ సర్వీసెస్ (యుఎస్ఎస్) ఈ ఘటనకు కారణం. రీమోట్‌ను ఉపయోగించి ఈ స్కూటరును యుఎస్ఎస్ పేల్చివేసింది. ఈ పేలుడుతో స్కూటరు హ్యాండిల్ బార్స్ తునాతునకలైపోయాయి. తామే ఇందుకు బాధ్యులమని, ఆయనను అన్వేషించి దాడిచేశామని యుఎస్ఎస్ ప్రకటించింది. రసాయనిక ఆయుధాలను ఉపయోగించడం ద్వారా కిరిల్లోవ్ యుద్ధ నేరాలకు పాల్పడ్డాడని యుఎస్ఎస్ ప్రకటించింది. రష్యాకు చెందిన రేడియేషన్, బయలాజికల్, కెమికల్ వెపన్స్ గ్రూపునకు కిరిల్లోవ్ అధిపతిగా వ్యవహరిస్తున్నాడనీ, ఈ మొత్తం యంత్రాంగం ఆయన అధీనంలో ఆయన కనుసన్నల్లోనే పనిచేస్తుందని యుఎస్ఎస్ ప్రకటించింది. క్రెమ్లిన్ చేస్తున్న దుష్ప్రచారానికి ఆయనే రథసారధి అని పేర్కొంది. అత్యంత కిరాతకమైన పద్ధతులలో ఉక్రేన్‌లో రసాయనిక ఆయుధాలను మోహరించేందుకు ఆయన ఆదేశాలు జారీ చేశాడని బ్రిటన్‌కు విదేశాంగ కార్యాలయం పేర్కొంది. ఉక్రేన్ తూర్పు, పశ్చిమప్రాంత సరిహద్దుల్లో అత్యంత ప్రమాదకరమైన రసాయనిక ఆయుధాలను మోహరించడంలో కిరిల్లోవ్ కీలకపాత్ర వహించాడని ఎస్‌బియు తెలిపింది.ఈ దాడిలో కిరిల్లోవ్ సహాయకుడు కూడా మరణించారు. ఆగ్నేయ మాస్కోప్రాంతంలో అపార్ట్‌మెంటు వెలుపల మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది. భద్రతాసిబ్బంది వెంటనే ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ స్కూటరు బాంబుకోసం 300 కిలోగ్రాముల పేలుడు పదార్థాన్ని ఉపయోగించారని రష్యా మీడియా ప్రకటించింది. ఒక ఎలక్ట్రికల్ స్కూటరులో పెట్టిన బాంబు పేలిపోవడంతో ఆయన మరణించారని ఉక్రేన్ సైన్యం ప్రకటించింది. కిరిల్లోవ్‌పై ప్రత్యేకంగా ఉక్రేన్ సైన్యం గురిపెట్టిమరీ హతమార్చినట్లు ఉక్రేన్ భద్రతా దళాలు అంతర్జాతీయ మీడియాకు ప్రకటించాయి. నిషేధిత రసాయనిక ఆయుధాలను ఉక్రేన్‌పై కిరిల్లోవ్ ప్రయోగిస్తున్నారని సోమవారంనాడు ఉక్రేన్ ఆరోపించింది. ఆ మరునాడే కిరిల్లోవ్ స్కూటర్ బాంబుదాడిలో హతుడయ్యారు. రష్యాకు సంబంధించిన రసాయనిక ఆయుధాలను ఉక్రేన్‌లో ఉపయోగిస్తున్నారన్న విషయంలో కిరిల్లోవ్‌పై బ్రిటన్‌తోపాటు పలు రష్యా వ్యతిరేక యూరప్ దేశాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఆయనను నిషేధిత వ్యక్తిగా ప్రకటించి ఆయనపై గురిపెట్టి అన్వేషణ చేస్తున్నాయి. ఈ దశలో ఉక్రేన్ ప్రకటన చేసిన మరునాడే కిరిల్లోవ్ స్కూటర్ బాంబుదాడిలో హతుడు కావడం రష్యాకు దిగ్భ్రాంతి కలిగించింది.

**ఇది పశ్చిమదేశాల కుట్ర**
**ప్రతీకారం తీర్చుకుంటాం**

రష్యా సీనియర్ ఆర్మీ జనరల్ కిరిల్లోవ్ హత్య పశ్చిమ దేశాల కుట్రేనని రష్యా రక్షణమంత్రిత్వశాఖ విమర్శించింది. ఈ చర్యను తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఉన్నతస్థాయీ కమిటీ దీనిని ఉగ్రవాదచర్యగా పేర్కొంది. దీనికి తగిన ప్రతీకారం తీర్చుకుంటామని రష్యా దిగువసభ డ్యూమా డిఫెన్స్ కమిటీ ఛైర్మన్ ఆండ్రూ కర్తపొలోవ్ ప్రతిజ్ఞ చేశారు. కిరిల్లోవ్ హత్యకు బాధ్యులైనవారిని శిక్షించి తీరుతామని ఆయన అన్నారు. రష్యా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా కూడా ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. దీనిపై టెలిగ్రామ్‌లో ఆమె రాస్తూ, ఆంగ్లో సాగ్జోన్స్ నేరాలను బహిర్గతం చేసేందుకు కిరిల్లోవ్ అనేక సంవత్సరాలు కృషి చేశారని పేర్కొన్నారు.




# గాజాలో కాల్పుల విరమణ చర్చలు తుది దశకు..




## బతికున్న బందీలు 62 మందే!

**గాజా :** గాజాలో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకుంటున్నాయి! పాలస్తినాకు సంబంధించిన సంప్రదింపులకర్తలు అంతర్జాతీయ మీడియాకు ఈ విషయం లీక్ చేశారు. ఈ చర్చలు నిర్ణయాత్మకంగా ఉన్నాయనీ, తుది దశలో ఉన్నాయనీ ఈ సంప్రదింపుల్లో పరోక్ష పాత్ర వహిస్తున్న సీనియర్ పాలస్తినా అధికారి ఒకరు చెప్పారు. ఇజ్రాయెల్‌కు చెందిన రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ కూడా దీనిపై స్పందిస్తూ, గతంలో ఎన్నడూలేనంత సన్నిహితస్థాయికి చర్చలు చేరుకున్నాయని, కాల్పుల విరమణకు చర్చలు చేరువలో ఉన్నాయనీ అన్నారు. ఈ చర్చల సారాంశం ప్రకారం రెండో దశలో బందీల విడుదల, మూడోదశలో ఇజ్రాయెల్ సైన్యం గాజాను ఖాళీచేసి వెళ్ళిపోవడంగా ఉన్నాయి. ఇజ్రాయెల్‌కు చెందిన 96 మంది బందీలు ఇంకా గాజాలోనే ఉన్నారు. ఐతే వీరిలో కేవలం 62 మంది మాత్రమే సజీవులుగా ఉన్నారని ఇజ్రాయెల్ విశ్వసిస్తున్నది. అమెరికా, ఖతార్, ఈజిప్టు దేశాలకు చెందిన ప్రతినిధులు, ఇతర మధ్యవర్తులు ఇజ్రాయెల్ – హమాస్ మధ్య చర్చలను గతంకంటే భిన్నమైన పద్ధతుల్లో ఉద్ధృతం చేశారు. గడచిన 14 నెలల్లో ఎన్నడూలేని పద్ధతులలో ఈ చర్చలు జరుగుతున్నాయని, సానుకూలంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఖతార్ రాజధాని దోహాలో ఈ చర్చలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒప్పందం ఓ కొలిక్కి వస్తే మొదటి 45 రోజుల్లో పౌరులు, మహిళా సోల్జర్లను దశలవారీగా విడుదల చేయడం, బందీలను విడుదల చేయడాన్ని మూడు దశల్లో షరతులుగా పాలస్తినా అధికారులు ముందుకు తెస్తున్నారు. అదేసమయంలో ఇజ్రాయెల్ సైనికులు గాజా సిటీ సెంటర్‌ను ఖాళీ చేసి వెళ్ళిపోవాల్సి ఉంటుంది. నిరాశ్రయులైన గాజాపౌరులు తిరిగి ఉత్తర ప్రాంతానికి చేరుకోవడానికి ఒక యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయాలనేది చర్చల్లో ప్రధాన డిమాండ్‌గా ముందుకు వచ్చింది. తాను అధికారంలోకి వస్తే గాజాలో యుద్ధాన్ని ముగిస్తామని, ఉక్రేన్‌లో యుద్ధాన్ని కూడా విరమింపజేస్తామని డోనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ఎన్నికల ప్రచారంలో అమెరికా ప్రజలకు వాగ్దానాలు చేశారు. అందుకు అనుగుణంగా జో బైడెన్ కూడా ఈ చర్చలు ఒక క్రమపద్ధతిలో జరుగుతున్నాయని ప్రకటించారు. ఇక గాజా నుండి ఇజ్రాయెల్ ప్రజలపై ఉగ్రవాద దాడులకు ఆస్కారం ఇచ్చే ప్రసక్తే లేదని, అలాంటి ఆటలు సాగనివ్వబోమని ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్ అంటున్నారు. ఐతే కట్జ్ ఒక వివాదాస్పద ప్రకటన కూడా చేశారు. యుద్ధానంతరం కూడా గాజాపై ఇజ్రాయెల్ తన నియంత్రణ కొనసాగిస్తుందని అన్నారు.

## భట్టి X హరీశ్‌రావు (మొదటి పేజీ తరువాయి)

సమావేశం జరిగిన తీరును సభలో వివరించారు. బిఏసి సమావేశంలో అప్పటి సిఎం కెసిఆర్ లేదా ఆయన తరఫున అప్పటి మంత్రి హరీశ్‌రావు వచ్చేవారని, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి హయాంలో చర్చ జరిగేదని, ఈ చర్చలో ప్రతిపక్ష పార్టీగా తాము అంశాలను ప్రస్తావించగా, బిఆర్ఎస్ కూడా తాము ప్రస్తావించే అంశాలను కూడా స్పీకర్‌కు సమర్పిస్తామని, వాటిని పరిశీలించిన తర్వాత సభను ఎన్ని రోజులు నిర్వహించాలి, ఎన్ని అంశాలు నిర్వహించాలన్నది స్పీకర్ నిర్ణయిస్తారని వెళ్లిపోయేవారని, ఎన్ని రోజులు సభను నిర్వహిస్తారో స్పష్టం చేయాలని తాను ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదని గుర్తు చేశారు. పదేళ్లు ఇలాగే కొనసాగిందని, అదే సాంప్రదాయాన్ని తాము అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క వివరించారు. కానీ ప్రస్తుత బిఏసి సమావేశంలో హరీశ్‌రావు స్పీకర్ ప్రసాద్‌కుమార్ నిర్ణయం తీసుకోవడానికి వీలు లేదని, సమావేశంలోనే చెప్పాలని పట్టుపట్టారని, కాగితాలను పడేసి స్పీకర్‌ను అవమానించారని భట్టి విక్రమార్క తెలిపారు. గత పదేళ్లలో జరిగిన బిఏసి, ప్రస్తుతం జరుగుతున్న బిఏసి సమావేశంలో ఏమి మార్పు వచ్చిందని, స్పీకర్ స్థానం అదేనని, కాకపోతే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి బదులుగా గడ్డం ప్రసాద్ కుమార్ ఆ కుర్చీలో ఉన్నారని వివరించారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి హయంలో ఎటువంటి నిబంధనలు పాటించారో, అవే నిబంధనలు ఇప్పటి స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాటించాలి కదా? అని భట్టి విక్రమార్క బిఆర్ఎస్ హరీశ్‌రావును ప్రశ్నించారు. ఇదేనా సభాపతి స్థానానికి ఇచ్చే గౌరవం అని ఆయన మండిపడ్డారు. ప్రసాద్ కుమార్ స్పీకర్ కాదా?, ఏం మాట్లాడినా బిఆర్ఎస్ సభ్యులు సభాపతిపై దాడి చేసేందుకు ప్రయత్నించడం మంచిది కాదన్నారు. స్పీకర్ పదే పదే కోరినా, వినకుండా ప్లకార్డులను ప్రదర్శించారని, స్పీకర్ వద్దకు హరీశ్‌రావు ప్లకార్డులను తీసుకెళ్తున్నారని, ఇదెక్కడి న్యాయం అని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ఎవరైనా స్పీకర్‌ను గౌరవించాల్సిందేనని, నిబంధనలకు అతీతంగా రాచరిక వ్యవస్థలోకి పోతామంటే, తాము శాసించినట్టుగానే సభ నడవాలంటే, కుదరదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సభ రూల్స్ బుక్ ప్రకారమే సమావేశాలు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.

**బిఏసి కమిటీ ముందు బిల్లులు పెట్టాలి : హరీశ్‌రావు**

హరీశ్‌రావు స్పందిస్తూ సభ రూల్స్ ప్రకారం బిఏసి ముందు బిల్లులు పెట్టాలని నిబంధనలు ఉన్నాయని,బిఏసి సమావేశం అనుమతి లేకుండా సభలో రెండు బిల్లులు పెట్టారన్నారు. తాము ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్ వాస్తవ అప్పులు రూ.4.17 లక్షల కోట్లు అని, డిప్యూటీ సిఎం మాత్రం తప్పుడు లెక్కలు చెప్పారని తాము ప్రివిలేజ్ మోషన్ ఇచ్చామని తెలిపారు.

వికారాబాదే కాదు.. దేశం,ప్రపంచ ప్రజలు చూస్తున్నారు స్పీకర్

బిఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు మాట్లాడుతూ సభలో తమకూ అవకాశాలు ఇవ్వాలని,వికారాబాద్ ప్రజలు చూస్తున్నారని స్పీకర్‌ను ఉద్దేశించి అన్నారు.దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జోక్యం చేసుకుని మాట్లాడుతూ వికారాబాద్ ప్రజలు చూస్తున్నారని హరీశ్‌రావు అన్నారని,వికారాబాద్ ప్రజలే కాకుండా రాష్ట్ర,దేశ,ప్రపంచ ప్రజలంతా సమావేశాలను చూస్తున్నారని అన్నారు.

## ఉత్కంఠ (మొదటి పేజీ తరువాయి)

శాసన సభలో, ఇటు శాసన మండలిలో చర్చనీయాంశమైంది. ఈ కేసులో ఎ1గా కెటిఆర్, ఎ2గా అరవింద్‌కుమార్‌లను చేర్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుంది. ఈ విషయంలో ఇప్పటికే ఎసిబి అధికారులు స్పీడ్ పెంచబోతున్న నేపథ్యంలో ఈ క్రమంలోనే హైదరాబాద్లో ఉన్నతాధికారులు భేటీ కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. దీంతో ఏ క్షణంలో ఏం జరగబోతున్నదనే దానిపై ఇటు బిఆర్ఎస్ అటు పొలిటికల్ సర్కిల్‌లో ఉత్కంఠగా మారింది.

## కన్వీనర్ల నియామకం (మొదటి పేజీ తరువాయి)

టిజిఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్ (ఉస్మానియా యూనివర్సిటీ), టిజి లా సెట్, టిజి పిజి లాసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ బి. విజయ లక్ష్మి (ఉస్మానియ యూనివర్సిటీ), టిజి ఎడ్‌సెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ బి. వెంకటరాంరెడ్డి, (కాకతీయ యూనివర్సిటీ), టిజిపిఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎన్.ఎస్ దిలీప్( పాలమూరు యూనివర్సిటీ) నియమించారు.

## జమిలి బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా అన్నారు. దేశ సమాఖ్యవ్యవస్థ మౌలిక సిద్ధాంతంపై దాడిచేసేందుకు ఉద్దేశించిన ఎలాంటి ప్రతిపాదనలూ ఈ బిల్లుల్లో లేవని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రతిపక్షాలకు మంత్రి భరోసా ఇచ్చారు. న్యాయవ్యవస్థ సమీక్ష, దేశ రాజ్యాంగంలో ఉన్న సమాఖ్య స్వరూపం, అధికారాల వికేంద్రీకరణ, దేశ లౌకిక స్వరూప స్వభావాలు, రాజ్యాంగ ఆధిపత్యం వంటి మౌలిక సూత్రాలకు ఈ బిల్లులవల్ల ఎలాంటి భంగం కలగదని, ఐతే రాజకీయ ఉద్దేశాలతో మాత్రమే ప్రతిపక్షాలు ఈ బిల్లులకు అభ్యంతరాలు తెలియజేస్తున్నాయని మంత్రి విమర్శించారు. ఈ రెండు బిల్లులనూ సంయుక్త పార్లమెంటరీ కమిటీ ముందుకు తీసుకువెళ్ళేందుకు సభలో తాను ఒక తీర్మానం ప్రవేశపెడతానన్నారు. బిజెపి మిత్రపక్షం తెలుగుదేశంపార్టీ, శివసేన ఈ బిల్లులకు పూర్తి మద్దతు ప్రకటించాయి. బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టడాన్ని కాంగ్రెస్‌సభ్యుడు మనీశ్ తివారీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడమంటే రాజ్యాంగ మౌలిక సిద్ధాంతంపై దాడేనని, పార్లమెంటుకు ఉన్న సవరణ అధికారానికి అతీతమైన పద్ధతులలో ఈ బిల్లులోని ప్రతిపాదనలు షరతులు విధిస్తాయని మనీశ్ తివారీ విమర్శించారు.‘‘రాజ్యాంగంలో మనకు ఉన్న అత్యావశ్యకమైన లక్షణాలలో ఒకటి సమాఖ్య స్వరూపం కాగా, మరొకటి ప్రజాస్వామ్య వ్యవస్థ. ఈ బిల్లులు రెండూ రాజ్యాంగ మౌలిక స్వరూపంపై దాడి చేస్తాయి, సర్వోన్నత చట్టసభకు అతీతమైన అధికారాలు చలాయిస్తాయి, లోక్‌సభ శాసనాలకు ఉన్న చట్టబద్ధతకు అతీతంగా అధికారం చెలాయిస్తాయి’’ లని తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. సమాజ్‌వాదీపార్టీ సభ్యుడు ధర్మేంద్ర యాదవ్ చర్చలో పాల్గొంటూ, ‘ఒకే దేశం–ఒకేఎన్నిక’ను ప్రవేశపెట్టేందుకు బిజెపి ఎంచుకున్న ప్రామాణికతలు దేశంలో నియంతృత్వాన్ని తీసుకువచ్చే ప్రయత్నమేనని విమర్శించారు. రాష్ట్రాల శాసనసభల పదవీకాలాలను లోక్‌సభ పదవీకాలంతో ముడిపెడుతూ బిల్లులో ప్రతిపాదనలు చేయడం ప్రజలతీర్పును కించపరచడమేనని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికిగానీ, పార్లమెంటుకు గానీ రాష్ట్రాలలో శాసనసభలు తాబేదార్లు కాదని స్పష్టం చేశారు. ఈ రెండు బిల్లులూ రాష్ట్రాల అసెంబ్లీల స్వయంప్రతిపత్తిని హరిస్తాయని, ఇది ఎన్నికల సంస్కరణ కానేకాదనీ, ఒక వ్యక్తి కలలు సాకారం చేసేందుకే ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టారనీ విమర్శించారు.‘‘ఐదు సంవత్సరాల పదవీకాలానికిగాను ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు ఓటర్లకు ఉంది, జమిలి ఎన్నికల ద్వారా ఈ హక్కును ఎవరూ హరించలేరు’’ అని డిఎంకె ఎంపీ టి.ఆర్.బాలు విమర్శించారు. ఈ బిల్లుపై అధికారపక్ష సభ్యులు మాట్లాడాలని స్పీకర్‌స్థానంలో ఉన్న ఓంబిర్లా కోరడంతో సభలో చర్చ మరింత వేడెక్కింది. ఈ బిల్లులను ప్రవేశపెట్టే విషయంపై అన్ని పార్టీలకు చెందిన సభానాయకులనూ మాట్లాడేందుకు స్పీకర్ అనుమతించారని అందుకు ఒక రూలింగ్ ఇచ్చారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజుజు అన్నారు. ‘ఒకేదేశం–ఒకే ఎన్నిక’ వల్ల ఎన్నికల ఖర్చు గణనీయంగా తగ్గుతుందనీ, పనిసామర్థ్యం పెరుగుతుందని తెలుగుదేశంపార్టీ ఎంపి, కేంద్రమంత్రి చంద్రశేఖర్ పెమ్మసాని అన్నారు. శివసేన ఎంపి శ్రీకాంత్ షిండే ప్రతిపక్షాలపై విమర్శలు చేశారు. ప్రతిపక్షాలు దేశంలో ఎన్నికల సంస్కరణలకు వ్యతిరేకమని అన్నారు. బిల్లులను సభలో ప్రవేశపెట్టేందుకే నిర్ణయించుకుని సంయుక్త పార్లమెంటరీ కమిటీకి గనుక బిల్లులను పరిశీలకు పంపితే అందుకు మద్దతు ఇస్తామని డిఎంకె ఎంపి బాలు, ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి సుప్రియాసూలే అన్నారు. గరిష్టస్థాయిలో రాజకీయ ప్రయోజనాలు సాధించుకునేందుకే ఈ బిల్లును తీసుకువచ్చారని ఎఐఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు.

# ఉక్రేన్ యుద్ధంలో 30 మంది ఉ.కొరియా సైనికులు మృతి



**కీవ్ :** ఉక్రేన్–రష్యా మధ్య జరుగుతున్న యుద్ధంలో కనీసం 30 మంది ఉత్తర కొరియాకు చెందిన సైనికులు మరణించారు. వీరి మరణాల గురించి బయటకు వచ్చిన మొదటివార్త ఇదే. రష్యాకు సరిహద్దుల్లో కుర్స్క్ రీజియన్‌లో జరిగిన యుద్ధంలో ఉత్తర కొరియా సైనికులు మరణించారని అమెరికా మంగళవారంనాడు వెల్లడించింది. యుద్ధం వచ్చినప్పుడు రెండు దేశాలు పరస్పరం సైనికంగా సహాయం చేసుకోవాలని రెండు ప్రభుత్వాలమధ్య ఒప్పందం కుదిరిన తర్వాత గడచిన అక్టోబరునెలలో 10,000 మంది సైనికులను రష్యాకు ఉత్తర కొరియా పంపించింది. ఉక్రేన్ రక్షణశాఖ ఇంటిలిజన్స్ విభాగం డియుఆర్ కూడా ఒక ప్రకటన చేస్తూ వారాంతం నాటికి యుద్ధంలో 30 మంది సైనికులు మరణించారని, వీరిలో పలువురు గాయపడ్డారని పేర్కొంది. పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ మేజర్ జనరల్ పాట్ రైడర్ మంగళవారంనాడు పాత్రికేయులతో మాట్లాడుతూ, కుర్స్క్ ప్రాంతంలో రష్యా సైనికులతోపాటు పోరాడుతున్న ఉత్తర కొరియా సైనికులు కూడా మరణించారని చెప్పారు.2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన రష్యా సేనలు ఇటీవలి నెలల్లో తూర్పు ప్రాంతంలోపలికి దూసుకువెళుతుండగా ఈ నష్టం జరిగింది. పెద్దసంఖ్యలో ఉత్తర కొరియా సైనికులు చెట్లచాటున దాక్కుని నిలబడిన డ్రోన్ ద్వారా తీసిన దృశ్యాలను సోమవారంనాడు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ‘టెలిగ్రామ్’ లో పోస్టు చేశారు.

# సిరియా పునర్నిర్మాణమే లక్ష్యం

**డమాస్కస్ :** సిరియాదేశ పునర్నిర్మాణమే తన ప్రథమ కర్తవ్యమని దేశాధికారాన్ని స్వాధీనం చేసుకున్న తిరుగుబాటు నాయకుడు జౌలానీ అన్నారు. తొమ్మిదిమంది అంతర్జాతీయ జర్నలిస్టులతో మంగళవారంనాడు ఆయన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు. 2016లో ఆయన అల్‌ఖైదా సిరియా బ్రాంచ్ నాయకుడుగా చలామణీ అయ్యారు. ఇప్పుడు అల్‌ఖైదాతో తెగతెంపులు చేసుకున్నట్లు ఆయన చెబుతున్నారు. ఇస్లామిస్టు తిరుగుబాటు ఉగ్రవాద సంస్థ హయత్ తహ్రిర్ అల్ షామ్ (టిఎంఎస్) నాయకుడు అబూ మహ్మద్ అల్ జౌలానీ ఇతర తిరుగుబాటు గ్రూపులతోకలిసి ఈ నెల ఎనిమిదోతేదీన సిరియా అధికారాన్ని చేజిక్కించుకున్నారు.దేశాధ్యక్షుడు అల్ అస్సాద్ రష్యాకు కుటుంబంతోసహా పారిపోయారు. సిరియాను పునర్నిర్మిస్తామని, సిరియాపై ఉన్న అంతర్జాతీయ ఆంక్షలను తొలగించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇక సిరియాలో తిరుగుబాటుదారులుగా ఉన్నవారంతా ఇకమీదట సైన్యంలో చేరి సైనికులుగా చెలామణీ అవుతారని కూడా ఆయన చెప్పారు. అస్సాద్‌తోపాటు సిరియాలో నేరాలకు పాల్పడినవారిని శిక్షించేందుకు అంతర్జాతీయ సమాజం సహకరించాలని, సిరియా నుండి తరలించుకుపోయిన ప్రజల సొమ్మును స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పదవీచ్యుతుడైన అధ్యక్షుడు అస్సాద్ సిరియా సొమ్మును రష్యాకు తరలించుకుపోయాడని ఆయన ఆరోపించారు.

## రాజ్యాంగ విరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

దాడి చేయడమేనని ప్రతిపక్షాలు నిశితంగా విమర్శించాయి. ఈ విమర్శలను ప్రభుత్వం తిరస్కరించింది. సభ వెలుపల వయనాడ్ ఎంపి ప్రియాంకా గాంధీ మీడియాతో మాట్లాడారు. జమిలి ఎన్నికల బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొన్నారు. ఇది మన దేశ సమాఖ్యవ్యవస్థకు వ్యతిరేకమన్నారు. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ మాట్లాడుతూ, బిల్లును సభలో ప్రవేశపెట్టే దశలోనే ఓటింగ్ చేపట్టడం చూస్తే, సభలో అధికారపార్టీకి తగినబలం లేదని స్పష్టం అవుతోందని అన్నారు. ‘‘మేం (కాంగ్రెస్) ఒక్కరమే ఈ బిల్లును వ్యతిరేకించడంలేదు, యావత్ ప్రతిపక్షం వ్యతిరేకిస్తోంది, ఇందుకు ఎన్నో కారణాలున్నాయి, ఈ బిల్లులు రాజ్యాంగ సమాఖ్య స్వరూపా న్ని ఉల్లంఘిస్తున్నాయి, కేంద్ర ప్రభుత్వం గనుక మె జార్టీ కోల్పోయి కుప్పకూలిపోతే రాష్ట్రాలలో కూడా ప్రభుత్వాలు కుప్పకూలిపోవాలా? ఈ రెండింటికీ ఏమిటి సంబంధం? ’’ అని శశిథరూర్ పాత్రికేయు ల ఎదుట ప్రశ్నించారు. ఒక ప్రభుత్వం ప్రజాతీర్పు కు కట్టుబడి పరిపాలన చేస్తున్నప్పుడు అదేసమయంలో మరో ప్రభుత్వం అదే కాలావధికి ఎందుకు కట్టుబడి, దానికే పరిమితమై ఉండాలి? పార్లమెంటరీ వ్యవస్థలో ఇది అర్థరహితం, ప్రజాతీర్పుకు మీరు షరతులు, నిబంధనలు విధించలేరు, ఎందుకంటే ఈ విధమైన నిబంధనలన్నీ 1969లోనే అంతమయ్యాయి, మనదేశంలో పార్లమెంటరీ వ్యవస్థ ఉంది, వివిధ చట్టసభలున్నాయి, ప్రభుత్వాలకు వేరువేరు మెజారిటీలు ఉన్నాయి, వివిధ రకాల కూటములు అధికారాల్లో కొనసాగుతున్నాయి, ఈ కూటములు ఏ సమయంలోనైనా అధికారం పోగొట్టుకోవచ్చు, లేదా అధికారంలోకి రావచ్చు’’ అని శశిథరూర్ అన్నారు. ‘‘నా దృష్టిలో ఈ మొత్తం వ్యవహారమంతా మూర్ఖత్వం, అవివేకంతో కూడుకున్నదే.ఈరోజు బిజెపి తన ఓటును ప్రదర్శించవచ్చు, కానీ తర్వాత రాజ్యాంగ సవరణకు తగిన మెజారిటీ లేకపోవచ్చు’’ అన్నారు. కాంగ్రెస్ ఎంపి మాణిక్కం టాగోర్ మాట్లాడుతూ, ఈ బిల్లులు చివరకు తుస్సుమంటాయన్నారు.

**జమిలి ఎన్నికలతో ఆర్థికవృద్ధి**
**కొత్తజీవం: కోవింద్**

జమిలి ఎన్నికలవల్ల దేశంలో ఎన్నికల ప్రక్రియకు కొత్తజవసత్వాలు వస్తాయని, సమష్టితత్వంతో కూడిన నూతనోత్తేజం వస్తుందనీ మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయీ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న రామ్‌నాథ్ కోవింద్ మంగళవారంనాడు కోల్‌కతాలో జరిగిన గిరిజన సంస్థ కార్యక్రమంలో మాట్లాడుతూ, జమిలి ఎన్నికలవల్ల ఎన్నికల ప్రక్రియకు కొత్త జవసత్వాలు రావడంతోపాటు దేశ ఆర్థికవృద్ధికి కూడా దోహదం చేస్తాయని చెప్పారు. ప్రతి ఏడాదీ ఎన్నికలు రావడం, రాజకీయ నాయకులు ఓటర్లను కలుస్తూ ఓట్లు అర్థించడంవల్ల రాజకీయపార్టీలతో, అభ్యర్థులతో ఓటర్లు విసిగిపోయారన్నారు. తరచు ఎన్నికలు జరుగుతూ ఉండటంవల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఈ ప్రతిపాదన 2029–2030 లో పూర్తిగా అమలులోకి వస్తే లేదా ఆ తర్వాతైనా అమలులోకి వస్తే ఇక ఓటర్లు ప్రతి ఏడాదీ పోలింగ్ కేంద్రాలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదని అన్నారు. స్థూల జాతీయోత్పత్తి వృద్ధి కూడా ప్రస్తుతం ఉన్న 7.3 శాతం నుండి మరో 1.5 శాతం పెరుగుతుందన్నా రు. జిడిపిలో వృద్ధిగనుక 1.5 శాతం పెరిగితే ఇక మొత్తం జిడిపి 10 శాతానికి చేరుకోవడానికి ఎక్కువ సమయం పట్టదని అన్నారు. ఇలా జిడిపి 10 శాతం పెరిగితే ప్రపంచంలో ఆర్థికంగా సూపర్ పవర్‌స్థాయికి ఎదిగిన మూడు–నాలుగు దేశాల జాబితాలో భారతదేశం కూడా చేరుతుందని అన్నారు.

## చర్చకు సిద్ధం (మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నోత్తరాల సమయాన్ని వృథా చేయవద్దని భట్టి విక్రమార్క తెలిపారు. హరీశ్‌రావుకు అనుభవం లేకనా? లేదా కావాలనే సభను తప్పుదోవ పట్టిస్తున్నారా? అని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. అప్పులపై చర్చ జరగాలనే ఉద్దేశంతోనే తాము సభలో శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. మళ్లీ అప్పులపై చర్చ పెడదామంటే, తమకు ఎటువంటి అభ్యంతరమూ లేదని, సభకు, ప్రజలకు వాస్తవాలు తెలియాలని ఆయన స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సభ్యులు కుర్చీలో నుంచి లేస్తే సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారని, వాస్తవాలు మాట్లాడితే వారి తల పగిలిపోతుందనే శాపం ఏమైనా వారికి ఉన్నదా? అనే అనుమానం కలుగుతుందని భట్టి విక్రమార్క అన్నారు. అప్పుల విషయంలో తప్పులు చెప్పిందే బిఆర్ఎస్ అని, పది సంవత్సరాల పాలనలో తప్పులు చెప్పి, ఇప్పుడు ఆరు నెలలకోసారి మతి పోతుందని మండిపడ్డారు.

**భూమి లేని నిరుపేద కూలీలకు రూ.12 వేలు ఇస్తామని చెబితే ప్రివి-లేజ్ మోషన్ ఇసారా?**

భూమి లేని నిరుపేద కూలీలకు రూ.12 వేలు ఇస్తామని చెబితే తనపై ప్రివిలేజ్ మోషన్ సమర్పిస్తారా? అని భట్టి విక్రమార్క బిఆర్ఎస్ సభ్యులను ప్రశ్నించారు. నిరుపేద కూలీలకు రూ.12 వేలు ఇస్తే ఏమైనా ఇబ్బందా?, కులీలకు ఇవ్వకూడదా?, బిఆర్ఎస్ సభ్యుల భూస్వామ్య మనస్థత్వం ఏమిటని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు ఇస్తే ఏం వారికి ఇబ్బంది కలుగుతుందని ప్రశ్నించారు. రైతు కూలీలకు ఇస్తామంటే ప్రివిలేజ్ మోషనా?, ఇదేం ఉల్లంఘన ఇదెక్కడిది అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ ప్లకార్డులు, నినాదాలు చేయవద్దని, రూల్స్ బుక్‌లో పెట్టారని, సభలో అప్పటి సభానాయకుడు కెసిఆర్ చెప్పిన ఏ ఒక్క అంశాన్నైనా అమలు చేశారా?, సభలోని అంశాలను పూర్తిగా ఉల్లంఘించారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని చెప్పి ఇచ్చారా?, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని చెపి ఇచ్చారా?, ఉద్యోగాలన్నీ పూర్తి చేస్తామని చెప్పారు కదా చేశారా? అని భట్టి విక్రమార్క హరీశ్‌రావుపై ప్రశ్నల వర్షం కురిపించారు.

**ఆర్థిక విధ్వంసం చేసిన బిఆర్ఎస్ నేతలు నీతులు మాట్లాడడం ఏంటి?**

ఆర్థిక విధ్వంసం చేసిన బిఆర్ఎస్ నేతలు నీతులు మాట్లాడడం ఏంటి? అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. వివిధ శాఖల్లో పెండింగ్ బిల్లులు ఉన్నాయని, రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టిందే బిఆర్ఎస్ అన్నారు. ప్రతి గింజా తామే కొంటామని సివిల్ సప్లైలో రూ.18 వేల కోట్ల బకాయిలు పెట్టారన్నారు. హరీశ్‌రావుకు ఎప్పుడూ నిజాలు మాట్లాడే అలవాటు లేదని, హరీశ్‌రావు అబద్ధాలు చెబితే అలవాటులో పొరపాటు అనుకున్నామన్నారు. శాసనసభ వ్యవహారాల మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి కూడా అబద్ధాలు మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. పదేళ్ల పాటు బిఆర్ఎస్ చేసిన విధ్వంసాన్ని ఒకేసారి సరిచేయడం వీలు కాదని, గత ప్రభుత్వం హయాంలో అస్తవ్యస్తమైన రాష్ట్ర ఆర్థిక స్థితిని తిరిగి గాడిలో పెడుతున్నామని డిప్యూటీ సిఎం చెప్పారు.

**కాంగ్రెస్ పాలనలో రూ.1,27,208 కోట్ల అప్పు: హరీశ్‌రావు**

అంతకు ముందు బిఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.4,17,496 కోట్లు మాత్రమేనని, కానీ దీనిని కొండంతను గోరంతను చేసి చూపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఏడాది పాలనలో రూ.1,27,208 కోట్ల అప్పు చేసిందని వివరించారు. అప్పులపై అసెంబ్లీలో చర్చ పెడుతారా? లేదా ఆడిటర్ల, ఆర్థికశాఖను పిలుస్తారా?, దేనికైనా తాను చర్చకు సిద్ధమని, ప్రభుత్వం చెబుతున్న లెక్కలు తప్పు అని నిరూపిస్తానని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు హరీశ్‌రావు సవాల్ విసిరారు.

## బిఆర్ఎస్ రాద్ధాంతం

(మొదటి పేజీ తరువాయి)

వద్ద నిలబడి నినాదాలు చేశారు. సభను సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ పదే పదే బిఆర్ఎస్, బిజెపి సభ్యులకు సూచించినా వారు నిరసనను విరమించు కోలేదు. అలాగే శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క కూడా ముఖ్యమైన బిల్లులు, పర్యాటక విధానం పాలసీలపై చర్చలో పాల్గొనాలని, ప్రభుత్వానికి సహకరించాలని, మిగతా అంశాలపై మరో సందర్భంలో చర్చిస్తామని వారు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు తమ నిరసనను కొనసాగించడంతో స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ ఏజెండాలోని అంశాలను కొనసాగించారు.మంత్రులు మాట్లాడుతున్న సమయంలో కూడా బిఆర్ఎస్ సభ్యులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నినాదాల మధ్యనే మూడు బిల్లులను శాసనసభ ఆమోదించింది. ఆ తర్వాత ‘‘తెలంగాణ రాష్ట్ర పర్యాటక విధానం’’పైన స్వల్పకాలిక చర్చ కొనసాగింది. ఈ చర్చలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సభ్యులు రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ పాల్గొనగా, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమాధానమిచ్చారు. మంత్రి మాట్లాడే సమయంలో బిఆర్ఎస్, బిజెపి సభ్యులు నినాదాలు చేశారు. బిఆర్ఎస్ సభ్యులు పోడియం వద్ద నుంచి స్పీకర్ స్థానం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. మరో వైపు బిజెపి సభ్యులు పోడియం వద్ద కొద్దిసేపు బైఠాయించారు. అనంతరం స్పీకర్ స్థానం వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. ‘‘రైతులకుబేడీలా..?, నహి చలేగా..నహి చలేగా.. తానాషాహి..నహి చలేగా.’’ అంటూ బిఆర్ఎస్ సభ్యులు తన్నీరు హరీశ్ రావు, కెటి.రామారావుతో పాటు పలువురు నినాదాలు చేశారు. కొందరు తమ చేతిలో ఉన్న ప్లకార్డులను చింపి విసిరి వేశారు. చప్పట్లు కొడుతూ నినాదాలు చేయడంతో మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు స్పీకర్ ప్రసాద్ కుమార్ కూడా తీవ్ర అసహానం వ్యక్తం చేశారు. ‘మీరు (బిఆర్ఎస్) రూపొందించిన రూల్స్‌ను మీరే పాటించరా?’ అని ఆయన బిఆర్ఎస్ సభ్యులను ప్రశ్నించారు. బిఆర్ఎస్ సభ్యులు తమ తమ స్థానాల్లో కూర్చుంటే మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తామని హరీశ్ రావుకు స్పీకర్ సూచించారు.అయినా వారు పోడియం వద్దనే నిరసనను కొనసాగించారు. కాగా బిఆర్ఎస్‌కు చెందిన ఒక ఎంఎల్‌ఎను మరో ఎంఎల్‌ఎను ఎత్తుకుని ఆ వెంటనే కిందకు దింపారు. ఇది గమనించిన మంత్రులు తీవ్ర అసహానం వ్యక్తం చేశారు.

**పోటా పోటీ ప్లకార్డులు ..**

బిఆర్ఎస్ సభ్యులు లగచర్ల ఘటనకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శించగా, అందుకు పోటీగా కాంగ్రెస్ సభ్యులు కూడా గత బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఖమ్మం రైతులకు బేడీలు వేసిన ఫోటోలతో ప్లకార్డులను ప్రదర్శించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ సభ్యులు పరస్పరం నినాదాలు చేసుకున్నారు.

**ఖమ్మం రైతులకు బేడీలు వేసినందుకు తప్పు చేశామని బిఆర్ఎస్ ఒప్పుకోవాలి : మంత్రి సీతక్క**

బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఖమ్మం రైతులకు బేడీలు వేశారని, ఆదిలాబాద్, గౌరారంలో గిరిజన రైతుల పైన లాఠీచార్జ్ చేయించారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క గుర్తు చేశారు. ఖమ్మం బేడీల విషయంలో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, లగచర్ల విషయం తమ దృష్టిగా రాగానే సిఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్నారని వివరించారు. ఖమ్మం రైతులకు బేడీలు వేసి, తాము తప్పు చేశామని బిఆర్ఎస్ సభ్యులు ముందుగా ఒప్పుకోవాలని మంత్రి సూచించారు. శాసనసభ నిబంధనలు రూపొందించిందే గత బిఆర్ఎస్ ప్రభుత్వమని, వారు అధికారంలో ఉన్నప్పుడు ఒకలాగ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలాగ వ్యవహరించడం మంచి పద్ధతి కాదని హితువుపలికారు.

**బిఆర్ఎస్‌ది లగచర్ల రాజకీయం : మంత్రి శ్రీధర్‌బాబు**

రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ సభ్యులకు లేదని శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. లగచర్ల విషయంలో బిఆర్ఎస్ రాజకీయం చేస్తుందని, సభ వ్యవహారాలను అడ్డుకుని మీడియాలో రావాలని బిఆర్ఎస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. లగచర్ల, గురుకుల అంశాలతో పాటు బిఆర్ఎస్ హయాంలో జరిగిన భూ నిర్వాసితుల సమస్యలపైన కూడా చర్చకు తాము సిద్ధమేనని, ప్రస్తుతం ముఖ్యమైన బిల్లులపై చర్చకు సహకరించాలని ఆయన బిఆర్ఎస్ సభ్యులను విజ్ఞప్తి చేశారు.

**పదేళ్లలో తెలంగాణ సంస్కృతిని ధ్వంసం చేసిన బిఆర్ఎస్ : మంత్రి జూపల్లి**

బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో తెలంగాణ సంస్కృతిని ధ్వంసం చేశారని,అందుకే ఆ పార్టీ సభ్యులు శాసనసభలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో పర్యాటక రంగాన్ని, ప్రజలను, నిరుద్యోగులను పట్టించుకోలేదని, కనీసం ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఇంగీత జ్ఞానం కూడా బిఆర్ఎస్‌కు లేదని ఆయన మండిపడ్డారు.

**ఇది అసెంబ్లీనా..పార్కు.. అనుకుంటున్నారా? ..**
**ఒక ఎంఎల్‌ఎ మరో ఎంఎల్‌ఎను ఎత్తుకోవడమేంటి .. : ఆది శ్రీనివాస్**

శాసనసభలో బిఆర్ఎస్ సభ్యులు సభ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ముఖ్యమైన బిల్లులకు సహకరించాల్సిన బిఆర్ఎస్ సభ్యులు పోడియం వద్ద ప్లకార్డులను ప్రదర్శిస్తూ , నినాదాలు చేయడం మంచి పద్ధతి కాదనిచెప్పారు. ఒక ఎంఎల్‌ఎ మరో ఎంఎల్‌ఎను ఎత్తుకుంటున్నారని, ఇదేమైనా అసెంబ్లీనా? లేదా పార్కునకు వెళ్లినట్టు వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. జన్‌ధన్ ఖాతాలో ప్రతి ఒక్కరికి రూ. 15లక్షల ఇస్తామని బిజెపి ఎన్నికల సందర్భంగా హామీనిచ్చిందని గుర్తు చేశారు.



## అసెంబ్లీ మీడియా పాయింట్

## ఫార్ములా ఈ-రేస్ మీద చర్చ పెట్టండి



ప్రజాపక్షం/హైదరాబాద్ : దమ్మంటే ఫార్ములా ఈ–రేస్ మీద చర్చపెట్టండి అంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి బిఆర్ఎస్ ఎంఎల్ఎ జగదీష్‌రెడ్డి సవాల్ చేశారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అసెంబ్లీని కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ప్రహసనంగా మార్చేసిందని మండిపడ్డారు. అన్ని వ్యవస్థలను సిఎం రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేశారని అన్నారు. శాసనసభ రూల్ బుక్ ప్రకారం నడవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయంలో చేసిన ప్రతీ పనిని చర్చిద్దామని అన్నారు. అసెంబ్లీలో బిఆర్ఎస్ నేతల గొంతును నొక్కుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీసు పాలన నడుస్తోందని అన్నారు.

**బాంబులేటి శ్రీనివాస్‌రెడ్డిగా మార్చుకోవాలి**

**బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెపి.వివేకానంద గౌడ్**

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పేరును బాంబులేటి శ్రీనివాస్ రెడ్డి గా మార్చుకోవాలని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కెపి వివేకానందగౌడ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కెటిఆర్ ను ఎట్లా అరెస్టు చేయాలని క్యాబినెట్ లో చర్చించారని తెలిపారు. కేటీఆర్ ను ఫార్ములా ఈ రేస్ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని, కాళేశ్వరం కూలిపోయిందని అసత్య ప్రచారం చేశారని, విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో ఇరికించే ప్రయత్నం కూడా చేశారని అన్నారు. కెటిఆర్ బామ్మర్ది ఇంట్లో డ్రగ్స్ ఉన్నాయని ఇరికించే ప్రయత్నం చేశారని,మహిళా మంత్రితో కేటీఆర్ పై వ్యక్తిగత ఆరోపణలు చేయించారని, లగచర్ల లో రైతులు తిరుగుబాటు చేస్తే కెటిఆర్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చారని అన్నారు.

టూరిజంపై చర్చకు తొందరేముంది: ఎంఎల్ఎ పల్లా రాజేశ్వర్‌రెడ్డి టూరిజంపై చర్చకు తొందరేముందని బిఆర్ఎస్ ఎంఎల్ఎ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. లగచర్ల ఘటనపై చర్చకు రెండు రోజులుగా పట్టుబడుతున్నా ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని అన్నారు. సభా నియమాలపై నీతులు చెబుతూ ప్రభుత్వమే ఉల్లంఘిస్తోందని విమర్శించారు. పాలక పక్షం ప్లకార్డులు లోనికి తెస్తే స్పీకర్ ఎలా అనుమతించారని ప్రశ్నించారు.

**ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదు**

**బిజెపి శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి**

ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి నేటికి ఏడాది పూర్తయిందని... ఇప్పటికీ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని బిజెపి శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు తగినంత బడ్జెట్ లేదని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వాస్తవాలు తెలిసినా అధికారం కోసం తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఆరు గ్యారెంటీలను అమలు చేయని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై చీటింగ్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

**బిఆర్ఎస్, బిజెపి మధ్య చీకటి ఒప్పందం : ఎంఎల్ఎ బీర్ల ఐలయ్య**

బిఆర్ఎస్, బిజెపిలు చీకటి ఒప్పందం చేసుకొని, సభ సజావుగా సాగకుండా అడ్డుకొంటున్నాయని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్ర యువత క్రీడా నైపుణ్యానికి, పర్యాటక అభివృద్ధి కోసం క్రీడా పాలసీ, టూరిజం బిల్లులు పెడితే బిఆర్ఎస్, బిజెపిలు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. బిఎసి నియమనిబంధనలు తుంగలో తొక్కి బిఆర్ఎస్, బిజెపి నేతలు స్పీకర్ పోడియం వద్దకు ప్లకార్డులు ప్రదర్శించారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనచూసి ప్రజల నుంచి ఆదరణ చూడలేక ఆ రెండు పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు. ప్రతి విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉన్నదన్నారు. రానున్న రోజుల్లో కూడా బిఆర్ఎస్, బిజెపిలకు ప్రజలు, యువత బుద్ధిచెప్పడం ఖాయమని పేర్కొన్నారు.

**టూరిజం పాలసీపై చర్చను అడ్డుకోవడం బాధాకరం :**

**ఎంఎల్ఎ రాంమోహన్‌రెడ్డి**

రాష్ట్రానికి లక్ష కోట్ల ఆదాయం తెచ్చేందుకు టూరిజం పాలసీ తెస్తే, దానిపై చర్చను బిజెపి, బిఆర్ఎస్ నేతలు అడ్డుకోవడం బాధాకరమని పరిగి ఎంఎల్ఎ రాంమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వాన్ని బద్నాం చేయడం పనిగా పెట్టుకొన్నారని మండిపడ్డారు. గత పదేండ్ల ప్రభుత్వ హయాంలో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పనులు చేపట్టలేదని ధ్వజమెత్తారు. ఏకకాలంలో రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆరుగ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని స్పష్టంచేశారు.

**రైతులపై దాడి చేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే**

**ఎంఎల్ఎ సిహెచ్ విజయ రమణారావు**

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు తీవ్ర అణచివేతకు గురయ్యారని పెద్దపల్లి ఎంఎల్ఎ సిహెచ్ విజయరమణారావు అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ జగిత్యాల, కరీంనగర్ రైతులపై దాడి చేసిన చరిత్ర గత ప్రభుత్వానిదేనని విమర్శించారు. అసెంబ్లీ ఆగదని, బిల్లులపై చర్చను బిజెపి, బిఆర్ఎస్ అడ్డుకోవడం ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి, ప్రతిపక్ష నేతగా వ్యవహరించాలని సవాల్ విసిరారు. సోషల్ మీడియాలో విషప్రచారం మానుకోవాలని సూచించారు.

**ఆ పార్టీల నేతల ప్రవర్తనతో సభ విధానాలకు భంగం**

**ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్**

అసెంబ్లీ సభ విధానాలకు భంగం కలిగిస్తూ, ఆ రెండు పార్టీల నేతలు వీధి కుక్కల ప్రవర్తిస్తున్నారని షాద్‌నగర్ ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్ విమర్శించారు.మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ అసభ్యపదజాలంతో స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లారని, ఈ ఘటనపై వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని పేర్కొన్నారు. బిఆర్ఎస్ హయాంలో ఖమ్మం మిర్చి రైతులకు బేడీలు వేసిన విషయాన్ని ప్రజలు మరువలేదని చెప్పారు. బిజెపి నేతలు తెలంగాణకు ఏం తీసుకొచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం రైతులకు ఏం ఒరగబెట్టిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఎ టీమ్, బి టీమ్‌గా బిజెపి, బిఆర్ఎస్‌లు ఒక్కటై బిల్లులను అడ్డుకొంటున్నాయని మండిపడ్డారు. బేడీలు వేసుకొంటూ అసెంబ్లీకి వచ్చిన వారికి ప్రజలు శాశ్వతంగా బేడీలు వేయటం ఖాయమని జోస్యం చెప్పారు.

# మూసీ పునరుజ్జీవనంలో అందరికీ న్యాయం చేస్తాం

మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్ : మూసీ పునరుజ్జీవనం ప్రక్రియతో ప్రభావితమయ్యే ప్రతి ఒక్కరికీ అన్ని రకాలుగా న్యాయం చేస్తామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రాజెక్టు వ్యయం రూ.1.50లక్షల కోట్లు అంటూ ప్రతిపక్షాలు పదేపదే ప్రస్తావించడంలో నిరాధారమైనవన్నారు. ప్రస్తుతం డిపిఆర్ సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోందని, ఆ తర్వాతే ఖర్చు ఎంతో తేలుతుందని మంత్రి వెల్లడించారు. శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో మూసీ పునరుజ్జీవనం అంశపై సభ్యులు టి.జీవన్‌రెడ్డి, సుంకరి రాజు, సిరికొండ మధుసూదనాచారి, అమీర్ ఆలీఖాన్ అడిగిన ప్రశ్నకు మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వం సంకల్పించిందని, ఇందుకు డిపిఆర్ సిద్ధమవుతోందని తెలిపారు. మూసీనది గర్భంలో ఉన్నవారికి న్యాయబద్ధమైన పరిహారం, బఫర్‌జోన్ పరిధిలోని ఆస్తుల సేకరణకు సంబంధించి 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం చెల్లించడంతో పాటు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని చెప్పారు. ఈ మూసీ పునరుజ్జీవనం పూర్తయితే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరడమే కాకుండా ఇక్కడి యువతకు పెద్దఎత్తున ఉపాధి లభించనుందనిమంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లోని బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపట్టాలని ప్రతిపాదించిన విషయం వాస్తమేనా అని సభ్యులు ఎం.ఎస్.ప్రభాకర్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ పవిత్రమైన స్థలంగా ఉండాల్సిన బాపూఘాట్ అభివృద్ధికి అమడ దూరంలో ఉండడంతో దీనిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు సంబంధించి డిపిఆర్ సిద్ధమవుతోందని మంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి సభ్యులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, టి.జీవన్‌రెడ్డి, ఎంఎస్. ప్రభాకర్‌రావులు అడిగిన మరో ప్రశ్నకు ఐటి మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం ఇస్తూ 30 ఏళ్ల నుంచి రాష్ట్రంలో ఐటి రంగం అభివృద్ధికి వివిధ ప్రభుత్వాలు తీసుకున్న అనేక చర్యల కారణంగా నేడు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు పొందిందని, దీనిని మరింత ముందుకు కొనసాగించేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతోందని చెప్పారు. ఐటి రంగంలో చట్టబద్ధంగా బిసి, ఎస్‌టి, ఎస్‌సిలకు రిజర్వేషన్లు లేకపోయినప్పటికీ ఉద్యోగాల కల్పనలో ఈ అణగారినవర్గాలకు అవకాశం ఇప్పించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సభ్యులు ఎంఎస్ ప్రభాకర్ కోరారు. ఇందుకు ఐటి రంగం మంత్రి శ్రీధర్ బాబు ప్రతిభ ఆధారంగా నడిచే వ్యవస్థ అని, ఇది సాధ్యం కాదని, మన తెలంగాణ యువతలో వృత్తి నైపుణ్యం పెంపొందించడం ద్వారా వారు అవకాశాలను అందుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

**ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలో మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది**

**మంత్రి దామోదర రాజ నరసింహ్మ**

ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలలో ఫుడ్ పాయిజన్ జరగడానికి పలు కారణాలు ఉన్నాయని, వీటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ్మ తెలిపారు. శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలతో అనేక మంది విద్యార్థులు అస్వస్థతకు గురువుతున్నారనే విషయం వాస్తమేనా అని బిఆర్ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్, ఎవిఎన్‌రెడ్డి ఎంఎస్ ప్రభాకర్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి దామోదర రాజనరసింహ్మ సమాధానమిస్తూ ఇది వాస్తమేనని, ఇలాంటి ఘటనలను నివారించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినప్పటికీ మరింత చేయాల్సి ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మూసివేసిన 6వేల పాఠశాలల్లో ఎన్ని పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి, వీటిలో చేరిన విద్యార్థుల సంఖ్య ఎంత అని సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అడిగిన మరో ప్రశ్నకు మంత్రి దామోదర రాజనరసింహ్మ సమాధానమిస్తూ 6వేల పాఠశాలలు మూసివేశారనేది అవాస్తమని, 2023–24 విద్యాసంవత్సరంలో 1745 పాఠశాలలో జీరో ఎన్‌రోల్‌మెంట్ కాగా, 2024–25 విద్యా సంవత్సరంలో 1913 పాఠశాలలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్నాయని వివరించారు. అయితే ఇందులో ఈ విద్యాసంవత్సరంలో 79 పాఠశాలలను పునర్ ప్రారంభించామని చెప్పారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టడానికి అనేక కారణాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి చెప్పారు.



# శీతాకాల విడిదికి హైదరాబాద్‌కు రాష్ట్రపతి

✻ ఈనెల 21వరకు రాష్ట్రపతి నిలయంలో ముర్ము బస

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : శీతాకాల విడిదికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరానికి మంగళవారం చేరుకొన్నారు. ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆ రాష్ట్రంలోని గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా తెలంగాణా రాష్ట్రంలోని మేడ్చల్ జిల్లా పరిధిలోని హకీంపేట విమానాశ్రయానికి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానంలో సాయంత్రం చేరుకొన్నారు. రాష్ట్రపతి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేణుగోపాల్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంత కుమారి, రాష్ట్ర డిజిపి జితేందర్, పొట్రు తదితర ఉన్నతాధికారులు రాష్ట్రపతికి సాదర స్వాగతం పలికారు. విమానాశ్రయంలో రాష్ట్రపతి పోలీసు వందనం స్వీకరించారు. అనంతరం హకీంపేట ఎయిర్‌పోర్టు నుండి రోడ్డు మార్గంలో సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఆమె చేరుకొన్నారు. శీతాకాల విడిదిలో భాగంగా ఈ నెల 21 వరకు రాష్ట్రపతి నిలయంలో ఆమె బస చేయనున్నారు.

# ప్రభుత్వ పరిశీలనలో ఆలేరు రెవెన్యూ డివిజన్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మక్తల్, ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ల విషయమై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని, త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. శాసనసభలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు బీర్ల ఐలయ్య, వాకిటి శ్రీహరి, బిఆర్ఎస్ సభ్యులు సునీతాలక్ష్మారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానమిస్తూ జిల్లాలు మారుస్తామని, తీసేస్తామనే గోబెల్ ప్రచారం జరిగిందని, ప్రభుత్వం ఏ జిల్లాను తీసేయబోదని, కొత్తగా జిల్లాను ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఏ ఒక్క జిల్లాను కూడా తాము తీసేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. 33 జిల్లాలలు 621 మండలాలు, 76 రెవెన్యూ డివిజన్లు యధావిధిగానే కొనసాగుతాయని స్పష్టం చేశారు. మండలం, రెవెన్యూ, జిల్లా మారుస్తామనే అపోహలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని సూచించారు.

**చేర్యాల డివిజన్ ఏర్పాటు 'మా బావ' చెప్పారు.. తప్పకుండా పరిశీలిస్తాం**

'మా బావ' (మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి) చెప్పారు.. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటును తప్పకుండా పరిశీలిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శాసనసభలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. చేర్యాల ఒకప్పుడు నియోజకవర్గం కేంద్రంగా ఉండేదని, ప్రస్తుతం పరిపాలనలో ఐదు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందిస్తూ గత ప్రభుత్వం చేర్యాలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు.



రాష్ట్రంలో రెవెన్యూ డివిజన్‌లను ముక్కలు, చెక్కలు చేశారన్నారు. చేర్యాలలో రెవెన్యూ డివిజన్ అవసరమని, దానిని అమలు చేయాలని రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డిని ఆయన కోరారు. నాలుగు మండలాలకు ఒక జిల్లా ఉందని, ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యంలో న్యాయం జరుగుతుందన్నారు. 10 మండలాలు ఉన్న బోధన్ను రెవెన్యూ డివిజన్ చేయాలని అనిల్ జాదవ్ కోరారు. సభ్యులు నాగరాజు, సంజీవ్ రెడ్డి, మురళీధర్, అద్లూరి లక్ష్మణ్ కుమార్, అనిరుధ్ రెడ్డి తమ నియోజకవర్గాలలో రెవెన్యూ డివిజన్‌లు, కొత్త మండలాలు ఏర్పాటు చేయాలని కోరారు. సభ్యుల విజ్ఞప్తిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ ఆనాటి ప్రభుత్వం రెవెన్యూ డివిజన్‌లను చెల్లాచెదురుగా చేసిందన్నారు.

# డిసెంబర్ 2023 నాటికి 40వేల మంది ఉద్యోగులు ఉన్నారు

**రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రం ఏర్పాటు అయినప్పుడు 55 వేలమంది ఆర్‌టిసిలో ఉద్యోగులు ఉంటే, డిసెంబర్ 2023 నాటికి 40 వేల మంది ఉద్యోగులు ఉన్నారని రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు జి.వివేక్, బిజెపి సభ్యులు ఆది శ్రీనివాస్, పాల్వాయి హరీశ్ బాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి స్పందిస్తూ ఆర్‌టిసిలో కొత్తగా 3,039 కొలువులు భర్తీ చేస్తామని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈ నియమకాలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలకు లింకు రోడ్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్‌టిసిలో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారని, దీంతో బస్సులకు డిమాండ్ పెరిగిందన్నారు. కొత్తబస్ రూట్లు పెంచుతామన్నారు. 15 ఏండ్లు దాటిన బస్సులను స్క్రాప్‌కి పంపిస్తున్నామని, కొత్త బస్సులు కొంటున్నామని చెప్పారు. గతంలో 50 శాతం దాటుతుందన్నారు. వేములవాడ, ధర్మపురి, కొండగట్టు ఆలయాలను కలుపుతూ బస్సులు లింకింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్‌టిసి ఏరియర్ బండ్స్ 280 కోట్లు చెల్లించామన్నారు. 21 శాతం పిఆర్‌సి ఇచ్చామన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టామన్నారు. చెన్నూరు బస్ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్నారు. రూ.కోట్లు మంజూరు చేశామని, మొదటి విడతగా కోటి 20లక్షలు చెల్లించామన్నారు. కోర్టు స్టే ఎత్తివేసిన తరువాత డిపో ఏర్పాటు చేస్తామన్నారు

# గత ప్రభుత్వ హయంలో కాళేశ్వరం 19–ఎ ప్యాకేజీ నిర్లక్ష్యానికి గురైంది

**నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాళేశ్వరం 19ఎ ప్యాకేజీ గత ప్రభుత్వ హయంలో నిర్లక్ష్యానికి గురైందని నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యుడు పటోళ్ల సంజీవ రెడ్డి, ఆది నారాయణ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ కాళేశ్వరం 19ఎ, 18 ప్యాకేజీ పనులను పూర్తి చేస్తామన్నారు. పెద్ద వాగు, నారాయణ‌ఖేడ్, జహీరాబాద్‌లలో గత ప్రభుత్వ హయంలో ప్రాజెక్టుల పనులు కాలేదన్నారు. సింగూరు, బసవేశ్వర, సంఘమేశ్వర ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తామని సభ్యులకు ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీనిచ్చారు.

# కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

సిఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం



ప్రజాపక్షం / హైదరాబాద్ : కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారి కల్యాణోత్సవానికి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. అసెంబ్లీలోని సిఎం ఛాంబర్‌లో ముఖ్యమంత్రిని మంత్రి కొండా సురేఖ కలిసి ఆహ్వానాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి శేష వస్త్రాలను, తీర్థప్రసాదాలను, చిత్రపటాన్ని అందించారు. ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని ఆలయ నిర్వాహకులు మల్లన్న కల్యాణోత్సవానికి ఆహ్వానించారు. అంతకుముందు ఆలయ అధికారులు మంత్రి సురేఖ హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో కలిసి, కొమురవెల్లి మల్లన్న కల్యాణానికి ఆహ్వానించారు. మంత్రి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను, శేష వస్త్రాలను, చిత్రపటాన్ని అందించారు. డిసెంబర్ 29 న ఉదయం 10.45 గంటలకు శ్రీమల్లికార్జున స్వామి కల్యాణం, జనవరి 19వ తేదీ నుండి 10 (ఆది) వారాలపాటు మార్చి 23వ తేదీ వరకు జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు కొమురవెల్లి ఆలయ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. కల్యాణం, జాతరల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను అధికారులు సిఎంకు వివరించారు. కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై మంత్రి సురేఖ దేవాలయ కార్యనిర్వాహణాధికారి బాలాజీని అడిగి తెలుసుకున్నారు. కల్యాణ వేదికపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. స్వామివారి కల్యాణం, జాతరలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో మౌలిక సౌకర్యాల కల్పనను పకడ్బందీగా చేపట్టాలని మంత్రి సురేఖ ఇఒను ఆదేశించారు. కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించాల్సిందే

**ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ**

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థులు, కాలేజీల యాజమాన్యాలు తీవ్రంగా నష్టపోతున్నారని ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. శాసనసభలో జీరో అవర్ సందర్భంగా అక్బరుద్దీన్ ఓవైసీ ఫీజు రీయంబర్స్‌మెంట్ అంశాన్ని ప్రస్తావించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోతే ఎంఐఎం ఊరుకోదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని బకాయిలను బిఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించిందని, బిఆర్ఎస్ పెట్టిన బకాయిలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిందేనన్నారు. ఈ నిధుల విడుదల చేయకపోవడంతో 7లక్షల మంది విద్యార్థులు ప్రతి ఏడాది నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడం కారణంగా, 20లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కంటున్నారని అన్నారు. 4 లక్షల మంది టీచింగ్ స్టాఫ్ సమయానికి జీతాలు పొందలేకపోతున్నారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడంతో చాలా కాలేజీలు మూతపడుతున్నాయన్నారు. ఏడాది కాలం నుంచి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు.

# విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు

తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు విద్యార్థులను కోరారు. మంగళవారం హైదరాబాద్ లో జరిగిన ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కెజి, నుంచి పిజి వరకు విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీటిపై విద్యార్థులను సమీకరించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురికావడం మరోవైపు ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయకపోవడంతో వేలాదిమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో యూనివర్సిటీల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని శ్రీనివాస్ రావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటిక్యాల రామకృష్ణ, గ్యార నరేష్, గ్యార క్రాంతి,రెహమాన్, రాజు ,సోతుకు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# నల్ల చొక్కాలతో బిఆర్ఎస్ సభ్యుల నిరసన

ప్రజాపక్షం/హైదరాబాద్ : లగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ సభ్యులు నల్ల చొక్కాలను ధరించి శాసనమండలి ప్రాంగణంలో నిరసన తెలిపారు. శాసనమండలి మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశం కాగానే ప్రశ్నోత్తరాలు, ప్రత్యేక ప్రస్తావనల కార్యక్రమాలతో భోజన విరామం వరకు సాఫీగా సాగింది. ఆ తర్వాత తిరిగి సభ ప్రారంభం కావడంతోనే రాష్ట్ర ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ సభ్యులు చైర్మన్ పోడియం ముందు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు బల్మూర్ వెంకట్ పోటీగా నినాదాలు చేశారు. దీంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యవసాయానికి సంబంధించి రైతు భరోసా, బీమా ఇతర అంశాలపై చర్చ ఉంటుందని, అప్పుడు ఈ అంశాన్ని ప్రతిపక్షాలు లేవనెత్తవచ్చని ప్రభుత్వం తప్పకుండా సమాధానం ఇస్తుందని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నల్ల రంగు చొక్కాలు, చేతులకు బేడీలు వేసుకుని ఎంఎల్‌ఎలు అసెంబ్లీకి హాజరయ్యారు. లగచర్ల రైతులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల

# న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

జీవో నెంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లించాలి,పెండింగ్ బకాయిలు ఇవ్వాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ్మ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో 12790 గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న సుమారు 60 వేల మంది గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ్మ డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్క్ వద్ద గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యాడ్, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డ్రైవర్లు,ఆఫీసు నిర్వహణ తదితర పనుల్లో వివిధ కేటగిరీల వారీగా పనులు చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమని వారు విమర్శించారు. గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని జీవో నెంబర్ 60 అమలు చేసి కార్మికుల జీతాలు పెంచాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కార్మికులని 500 మంది జనానికి ఒకరు చొప్పున నియమించటం జరిగిందని..అయితే ప్రస్తుత జనాభా అందుకు అనేక రెట్లు పెరిగినందున కార్మికులపై పని భారం అధికంగా ఉన్నదని ప్రస్తుత జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యని పెంచి కార్మికుల పని భారాన్ని తగ్గించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. పోలీసు అధికారులు ఒక వైపు ధర్నాకు పర్మిషన్ ఇచ్చి మధ్యరాత్రి మరొకమారు పర్మిషన్‌ను రద్దుచేసి కార్మికులపై ప్రభుత్వ వైఖరి ఏమిటన్నది తేట తేలం అయిందని వారు తెలియజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో టంగుటూరి నరసింహారెడ్డి, వెంకటరాజ్యం (ఎఐటియుసి) పొలడుగు భాస్కర్, గ్యార పాండు (సిఐటియు) కే సూర్యం అరుణ్ కుమార్ (టియుసిఐ) శివ బాబు, అరుణ (ఐఎఫ్టియు) మారుతి (కారోబార్ యూనియన్) ఎఐటిసి నాయకులు పి మల్లయ్య, రామచంద్రయ్య, షరీఫ్, రంగారెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ప్రజాపక్షం / హైదరాబాద్ : సర్వశిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంఎల్ఎ చాడ వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో దాదాపు 19,600 మంది సర్వశిక్ష అభియాన్‌లో రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాత పరీక్షల ద్వారా జిల్లా, మండల, స్కూల్ కాంప్లెక్స్, పాఠశాల స్థాయిలలో వివిధ పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో నియమితులై సుమారు 18 సంవత్సరాల నుండి ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ కూడా ఇచ్చిందని ఆయన తెలిపారు. కానీ నేటికీ వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించకపోవడం వల్ల ఉద్యోగులు నిరుత్సాహంలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి విద్యాశాఖలో విలీనం చేయాలని, తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించి వేతన స్కేల్ ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి జీవితబీమా రూ.10లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు కల్పించాలని లేఖలో ముఖ్యమంత్రికి చాడ వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.


తెలంగాణ ప్రభుత్వము – దేవాదాయ ధర్మాదాయ శాఖ

**శ్రీ పోచమ్మ విజయ దుర్గా దేవస్థానము, ఎల్లారెడ్డిగూడ**

బహిరంగ వేలము ప్రకటన

తేది: 17.12.2024

ఇందుమూలముగా సమస్త భక్తజనులకు తెలియజేయునది ఏమనగా ఎల్లారెడ్డి గూడ శ్రీ పోచమ్మ విజయ దుర్గా దేవస్థానము హక్కు భుక్తములోగల ఒక షట్టర్ మరియు ఒక రెసిడెన్షియల్ పోర్షన్ తేది: 06.01.2025 సోమవారం రోజున ఉదయం 10.00 గం.లకు బహిరంగ వేలం నిర్వహించనైనది.

| క్ర.సం. | దుకాణము నెం. | దుకాణము విస్తీర్ణము | ధరావత్తు సొమ్ము | కాలపరిమితి | షరా |
|---|---|---|---|---|---|
| 1. | 5 | 176. చ.అ. | 50,000/- | 3 సం.ములు | యదాస్థితి |
| 2. | దేవస్థాన ఆవరణలో గల రెసిడెన్షియల్ పోర్షన్ | 380 చ.అ. | 50,000/- | 3 సం.ములు | యదాస్థితి వ్యాపారము గురించి గోదాము/టైలర్ |

పై దుకాణముల వేలం పాటలో పాల్గొను అభ్యర్థులు ధరావత్తు (డిపాజిట్) డి.డి. రూపంలోగాని నగదు రూపంలో గాని చెల్లించి పాటలో పాల్గొనవలయును. పాట షరతులు పాట సమయంలో చదివి వినిపించబడును. పై వివరములకు దేవస్థాన కార్యాలయము నందు సంప్రదించగలరు.

చైర్మన్ మరియు ధర్మకర్తలమండలి

సం/-
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 8034-PP/CL/ADVT/1/2024-25, Date: 17-12-2024

ఫోకస్

# మహిళ

# చట్టాలు ఎన్నో... అమలు అంతంత మాత్రమే

మహిళల రక్షణకు, వారి అభ్యున్నతికి ఎన్నో మన దేశంలో లెక్కలేనన్ని చట్టాలు ఉన్నాయి. అయితే, అవి ఎంత వరకూ సమర్థంగా అమలవుతున్నాయన్నదే ప్రశ్న. ఉదాహరణకు వ్యభిచారం.... ప్రపంచమంతటా వేళ్లూనుకున్న అనాచారం. మహిళను కట్టుబానిసగా చూసే దారుణ విధానం. కనీస అవసరాలు కూడా తీరక వ్యభిచార వృత్తిని చేపడుతున్న వారు కోకొల్లలు. ఎవరూ ఇష్టపూర్వకంగా వ్యభిచారం చేయరని, అనేకానేక కారణాలు వారిని ఈ ఊబిలోకి నెట్టేస్తున్నాయని ఢిల్లీ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. వ్యభిచార నిరోధానికి ఎన్ని చట్టాలున్నా.. అవి అమలవుతున్న తీరు పూర్తి నిరాజనకంగానే ఉంది. మన దేశంలోనూ వ్యభిచార నిరోధ చట్టం 1956లోనే వచ్చింది. కానీ, నిరోధమే ఇంత వరకూ జరగలేదు. మహిళలను వ్యభిచార రొంపిలోకి లాగకుండా ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది. ఈ క్రమంలో మరికొన్ని చట్టాలను పరిశీలిద్దాం..

- **మహిళల అసభ్య ప్రదర్శన నిరోధక చట్టం (1986):** మహిళలను కించపరిచేలా అడ్వర్టయిజ్మెంట్, బొమ్మలు, రాతలు, నగ్న చిత్రాలు మొదలైనవి దీని ద్వారా నిరోధించారు.
- **వరకట్న నిషేధ చట్టం (1961):** వివాహానికి ముందుకానీ, వివాహం తర్వాత కానీ వరకట్నం ఇవ్వడం లేదా తీసుకోవడాన్ని ఇది నిషేధిస్తుంది.
- **గర్భ నిరోధక నివారణ చట్టం(1971):** మహిళల ఇష్టానికి వ్యతిరేకంగా గర్భవిచ్ఛిత్తికి ఒత్తిడి చేయకుండా వారికి ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది.
- **ముస్లిం వివాహాల రద్దు చట్టం (1939):** తన వివాహాన్ని రద్దు చేసుకునే హక్కుని ముస్లిం స్త్రీలకు ఈ చట్టం అవకాశం కల్పిస్తుంది.
- **విడాకులు పొందిన ముస్లిం మహిళల రక్షణ చట్టం (1939):** భర్త నుంచి విడాకులు పొందిన ముస్లిం స్త్రీల హక్కులు కాపాడేందుకు ఈ చట్టం చేశారు.
- **కుటుంబ న్యాయ స్థానాల చట్టం (1984):** కుటుంబ తగాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక న్యాయస్థానాలను ఈ చట్టం కింద ఏర్పాటు చేశారు.
- **లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం (1987):** దీని ద్వారా ప్రభుత్వం స్త్రీలకు ఉచిత న్యాయ సలహా అందిస్తుంది.
- **హిందూ వివాహ చట్టం (1955):** ఈ చట్టం ప్రకారం హిందూ మహిళ వివాహం, విడాకుల విషయంలో పురుషుడితో సమాన హక్కులు కలిగి ఉంటుంది. ఈ చట్టం ఏకపత్ని విధానం, కొన్ని సందర్భాల్లో స్త్రీ తన భర్త నుంచి విడాకులు పొందే హక్కు కల్పిస్తుంది.
- **సతి నిరోధక చట్టం (1987):** భర్త మరణిస్తే అతడి భౌతికకాయంతో పాటు భార్యను బలవంతంగా చితిపై దహనం చేసే అనాగరిక చర్య నుంచి మహిళలకు ఇది రక్షణ కల్పిస్తుంది.
- **మహిళలకు కనీస వేతన చట్టం (1948):** లింగ వివక్ష ఆధారంగా స్త్రీలకు కనీస వేతనాన్ని పురుషుడి కంటే తక్కువ నిర్దేశించరాదు.




- **ఫ్యాక్టరీ చట్టం (1948):** గనులు, ఫ్యాక్టరీల్లో పనిచేసే స్త్రీలతో సాయంత్రం 7 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య పని చేయించరాదు.
- **హిందూ వారసత్వ చట్టం (1956):** ఈ చట్టాన్ని 2005లో సవరించారు. ఈ చట్టం ప్రకారం మహిళలకు తమ తండ్రి ఆస్తిలో పురుషుడితో సమాన హక్కు ఉంది.
- **భారతీయ క్రిస్టియన్ వివాహాల చట్టం (1872):** క్రైస్తవ వివాహాలు, విడాకులకు సంబంధించిన అంశాలు ఇందులో పొందుపరిచారు.
- **సమాన వేతన చట్టం (1976):** స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలి. లింగ వివక్ష ఆధారంగా స్త్రీలకు వేతనాలు తగ్గించరాదు.
- **మాతృత్వ ప్రయోజనాల చట్టం (1961):** పనిచేసే మహిళలకు ప్రసూతి ముందు, ప్రసూతి అనంతరం కొన్ని ప్రత్యేక ప్రయోజనాలు కల్పించాలని ఈ చట్టం నిర్దేశిస్తుంది. లైంగిక వేధింపుల నిరోధక చట్టం: మహిళలు, తాము పనిచేస్తున్న చోట లైంగిక వేధింపులకు గురైతే వారి ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినట్లే. కావాలని శరీరాన్ని తాకడం, సైగలు చేయడంతో పాటు మాటలు, పాటలు వంటివి లైంగిక వేధింపుల కిందికి వస్తాయి. వీటిని అరికట్టేందుకు 1997లో సుప్రీంకోర్టు విశాఖ కేసులో కొన్ని సూచనలు చేసింది. (ఏఐ ఆర్ 1997 సుప్రీం కోర్టు 3011) ఈ తీర్పులోని అంశాలను మార్గదర్శక సూత్రాలుగా పాటించడం సంస్థలకు తప్పనిసరైంది.)
- **గృహహింస నిరోధక చట్టం (2005):** ఎవరైనా కుటుంబ సభ్యులు స్త్రీల పట్ల లైంగిక వేధింపులు, శారీరక, మానసిక, మాటలతో వేధిస్తే ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది.
- **నిర్భయ చట్టం (2013):** 2012 డిసెంబర్‌లో ఢిల్లీలో అత్యాచారానికి గురై ఒక మహిళ మృతి చెందినప్పుడు ఈ చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దేశంలో అమ్మాయిలు, మహిళలపై లైంగిక దాడులు ఎక్కువయ్యాయి. యాసిడ్ ఘటనలు పెరిగిపోతున్నాయి. మహిళల రక్షణ కోసం కఠినమైన చట్టాల్ని తీసుకురావాలని గత ప్రభుత్వాలు ఈ చట్టాల్ని తీసుకువచ్చాయి. మహిళలపై జరుగుతున్న దాడులు లైంగిక దాడులు వేధింపులు, కిడ్నాప్, హింస ఈ చట్టం కిందకు వస్తాయి.
- **మహిళా చట్టం (2013):** లైంగిక వేధింపుల నుంచి మహిళల రక్షణకు చట్టసభలు శాసనం చేసేవరకు ఈ మార్గదర్శక సూత్రాలు అమలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం 2013లో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధ, పరిష్కార) చట్టం 2013ను రూపొందించింది.
- **మహిళా కమిషన్:** ప్రభుత్వం మహిళా, శిశురక్షణ, హక్కుల్ని పర్యవేక్షించేందుకు ఒక ఛైర్‌పర్సన్, ఆరుగురు సభ్యులతో కలిసి ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ సమాజంలోని మహిళల సమానత్వం, వారి అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్తుంది. కమిషన్ పరిధిలోకి వచ్చే ఫిర్యాదులపై విచారణ కొనసాగిస్తుంది. మహిళల వేధింపులు, దాడులు, వివక్షలను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం పొందవచ్చు.

## దళిత ఆణిముత్యం శైలజ



అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మాక్ ఆర్థర్ పెలోషిప్ పొందిన తొలి దళిత వ్యక్తిగా నిలిచిన చరిత్రకారిణి శైలజా పైక్ ప్రతిభను వర్ణించడానికి ఎన్ని విశేషణాలు వాడినా తక్కువే. 'జీనియస్ గ్రాంట్' అని పిలిచే మాక్ ఆర్థర్ ఫెలోషిప్ 8,00,000 డాలర్లు (సుమారు 6.5 కోట్ల రూపాయలు) విలువైన నోస్ట్రింగ్స్ అటాచ్డ్ అవార్డుతో లభిస్తుంది. 1981లో ప్రారంభమైన ఈ ఫెలోషిప్‌ను పొందిన 1154వ వ్యక్తి శైలజ. అతి తక్కువ మందికి మాత్రమే లభించే అరుదైన పురస్కారానికి శైలజ అర్హత సంపాదించడం ఓ అద్భుతం. ప్రముఖ సాహిత్య విమర్శకుడు హెన్రీ లూయిస్ గేట్స్ జూనియర్, నోబెల్ గ్రహీత డెరెక్ వాల్కాట్, కవులు ఎకె రామానుజన్, అడ్రియన్ రిచ్, జాన్ ఆష్బెరీ, క్లాడియా రాంకిన్, నవలా రచయిత్రి చిమమండ న్గోజీ అడిచీ, జాజ్ వయోలిన్ విద్వాంసుడు రెజీనా కార్టర్, పాలియోంటాలజిస్ట్ స్టీఫెన్ జే వంటి వారి సరసన చోటు సంపాదించడం ఎంత కష్టమో ఊహించుకోవచ్చు. దళిత కుటుంబంలో పుట్టిన శైలజ బాల్యంలో పేదరికాన్ని అనుభవించింది. పుణేలో, ఒకే గదిలో ఆమె కుటుంబం నివాసం ఉండేది. అడుగడుగునా ఎన్నో సమస్యలు ఎదుర్కొంది. పట్టుదలతో చదువు కొనసాగించింది. అమెరికాలో ఉన్నత చదువు పూర్తి చేసి, సిన్సినాటీ యూనివర్శిటీలో చరిత్ర, మహిళలు.. లింగ వివక్ష.. లైంగికత అధ్యయనాల ప్రొఫెసర్‌గా పని చేస్తున్నది. స్త్రీవాదంతోపాటు దళిత వాదాన్ని కూడా గట్టిగా వినిపించే శైలజ ప్రతిభకు కులమతాలు అడ్డుకావని నిరూపించింది. తన అభిప్రాయాలను, వాదనలను, ఆలోచనలను పుస్తక రూపంలోకి తెచ్చింది. రచయిత్రిగా మంచి పేరు సంపాదించింది. దళిత మహిళల విద్య ఆధునిక భారతదేశంలో ఏ విధంగా ఉందనే విషయాన్ని తన మొదటి పుస్తకంలో 'డబుల్ డిస్క్రిమినేషన్' పేరుతో వివరించింది. మహిళగా ఒక రకమైన వివక్షకు గురైతే, దళిత మహిళగా మరింత దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయన్న ఆమె వాదన అక్షర సత్యం. రెండో రచన 'ది వల్గారిటీ ఆఫ్ కాస్ట్' ప్రకంపనం సృష్టించింది. దళిత మహిళలు లైంగికంగా ఎదుర్కొంటున్న సమస్యలను శైలజ అందులో వివరించింది. సంప్రదాయం ముసుగులో అట్టడుగు కులాలకు చెందిన మహిళలను అంగాంగ ప్రదర్శనలకు, లైంగిక అవసరాలకు వాడుకోవడాన్ని వివరించింది. కుటుంబ పరిస్థితులు... ఆర్థిక అవసరాలు దళిత మహిళలను ఏ విధంగా పతనం అంచుకు లాగుతున్నాయో కళ్లకు కట్టింది. తన రచనలతో దళిత మహిళలకు స్ఫూర్తినిస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేస్తున్న శైలజ అభినందనీయురాలు.

## పుట్టినరోజు నాడే..



అమెరికాలో మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన ఎల్లా జోసెఫీన్ బేకర్‌కు మరో ప్రత్యేకత కూడా ఉంది. ఆమె పుట్టిన రోజు నాడే తుదిశ్వాస తీసుకుంది. వర్జీనియాలోని నార్ఫోక్‌లో 1903, డిసెంబర్ 13న జన్మించిన ఎల్లా బేకర్ 1986, డిసెంబర్ 13న న్యూయార్క్ సిటీలో కన్నుమూసింది. కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా, రాజకీయ కార్యకర్తగా, మహిళా ఉద్యమకర్తగా బహుముఖ పాత్ర పోషించింది. నార్త్ కరోలినా రాష్ట్రం, ర్యాలీ నగరంలోని షా యూనివర్శిటీ నుంచి వాలెడిక్టోరియన్‌గా పట్టా తీసుకుంది. నల్ల జాతీయుల అభ్యున్నతి కోసం ఏర్పడిన నేషనల్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ కలర్డ్ పీపుల్ (ఎన్ఏఏసిపి) తోపాటు సదరన్ క్రిస్టియన్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స (ఎస్‌సిఎల్‌సి)లోనూ ఆమె పని చేసింది. 1955లో 'ఇన్ ఫ్రెండ్‌షిప్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, అమెరికాలో వర్ణ వివక్షకు గురవుతున్న నల్లజాతీయులకు విశేష సేవలు అందించింది. అంతేగాక, మహిళల హక్కుల కోసం నిరంతరం శ్రమించింది. విద్యార్థి అహింసా సహకార కమిటీని స్థాపించింది. విద్యార్థుల్లో అహింసా తత్వాన్ని నింపేందుకు ప్రయత్నించింది. అమెరికా సంస్కృతిలో వేళ్లూనుకున్న జాత్యహంకారాన్ని వ్యతిరేకించింది. పౌర హక్కుల ఉద్యమంలో చురుగ్గా పాల్గొంది. మహిళలపై హింస, అత్యాచారాలు, అణచివేత తదితర అంశాలపై ఆమె తుది వరకూ పోరాటాలు చేసింది. ఆమె స్ఫూర్తివల్లే అమెరికాలో మహిళలు హక్కులు సాధించుకోగలిగారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ ముందంజ వేయగలుగుతున్నారు.

## ఔషధ మొక్కల పెంపకంలో మేటి..



ఒడిశాకు చెందిన సాధారణ గృహిణి యావత్ దేశం గర్వించే స్థాయికి ఎదగడం అనుకున్నంత సులభం కాదు. అసాధ్యంగా తోచే ఈ ఫీట్‌ను సాధించి చూపించింది మమతా బిస్వాల్. చిన్నతనం నుంచి మొక్కల పెంపకంపై ఆసక్తి ఉన్న ఆమె 2011లో ఔషధ మొక్కల పెంపకాన్ని ప్రారంభించింది. ఒకవైపు ఆదాయాన్ని సంపాదించుకుంటూ, మరోవైపు తన హాబీని కొనసాగించింది. ఒకవైపు ఔషధ మొక్కల పెంపకాన్ని సమర్థంగా నిర్వహిస్తూనే, మరోవైపు పాఠశాలలు, కళాశాలలు, దేవాలయాలు, మున్సిపల్ ప్రాంగణాలు.. అనువైన ప్రతి ప్రదేశంలోనూ ఆమె మొక్కలు నాటడాన్ని 2016 నుంచి ఒక ఉద్యమంగా తీసుకుంది. అడవులను పరిరక్షించడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం ఆమె ప్రధాన లక్ష్యాలు. వాసంగా, గుడుచి (గిలోయ్), తులసి, సర్పగంధ, అశ్వగంధ (వితానియా సోమ్నిఫెరా), స్టెవియా, కల్మేఘ్ (ఆండ్రోగ్రాఫిస్ పానిక్యులాటా), వెటివర్ గడ్డి వంటి ఔషధ మొక్కలను పెద్ద సంఖ్యలో పెంచడం ప్రారంభించింది. ఆమె పని త్వరలోనే బహిరంగ ప్రదేశాలకు వ్యాపించడంలో మమత పేరు దేశమంతా మారుమోగింది. వివిధ రకాల ఔషధ మొక్కల గురించి, వాటి పెంపకం... పరిరక్షణ గురించి ఆమె ఎన్నో పుస్తకాలు చదివింది. ఇంటర్నెట్ సాయంతో ఎన్నో విషయాలు నేర్చుకుంది. 'ఔషధ మొక్కలను పెంపకం చేయడం వల్ల మొక్కల జాతులు అంతరించిపోకుండా కాపాడుతుంది. ముఖ్యంగా ఎక్కువ కోత కారణంగా. ఇది మానవ జంతు సంఘర్షణను నివారించడంలో సహాయపడుతుంది. ఎందుకంటే ప్రజలు వాటిని సేకరించడానికి అడవుల్లోకి వెళ్లవలసిన అవసరం లేదు' అని చెప్పే మమతకు సంప్రదాయ వైద్యులు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ప్రసంగించే అవకాశం లభించింది. రాష్ట్ర ఔషధ మొక్కల బోర్డు (ఎస్ఎంపిబి) నుంచి వచ్చిన ఈ ఆహ్వానం ఆమెలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అప్పటి నుంచి ఒడిశా ప్రభుత్వ సహకారంతో ఔషధ మొక్కల రంగాన్ని అభివృద్ధి పరచడంలో కీలక పాత్ర పోషించింది. సంప్రదాయ విధానాలకు, ఆధునిక హంగులు కూడా అద్దడంతో ఆమె అవలంభిస్తున్న విధానాలు లాభసాటి వ్యాపార మార్గాలుగా మారాయి. ఫలితంగా ఎంతో మంది ఆమెను అనుసరించడం మొదలు పెట్టారు. ఔషధ మొక్కలను ఇంట్లోనే పెంచడం ద్వారా ఆదాయాన్ని సంపాదించవచ్చని ఆమె ప్రత్యక్షంగా నిరూపించింది. వేలాది మంది మహిళలకు, ప్రత్యేకించి గృహిణులకు మార్గదర్శకురాలైంది.



## చాలీచాలని వేతనాలతో అవస్థలు

**అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి**

**ప్రజాపక్షం/ మంచిర్యాల :** ప్రభుత్వం అంగన్‌వాడిలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అంగన్‌వాడి టీచర్స్ అండ్ వెల్పర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ముఖ్య కార్యానిర్వాహక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడి టీచర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని, అంగన్వాడి టీచర్లకు,హెల్పర్లకు వేతనాలు చెల్లించాలని, మినీ టీచర్లకు ఇస్తామన్న వేతనాలు, మెనూ వేతనాలు ఇప్పటి వరకు రావడం లేదన్నారు. చాలిచాలనీ వేతనాలతో జీవితాలను వెల్లబోస్తున్నారని, అంతేకాకుండా వెట్టిచాకిరిని చేపిస్తూ పబ్బంగడిస్తుందని ఆరోపించారు. గత ఆరు నెలల క్రితం రిటైర్డ్ అయిన టీచర్లులకు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్ లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. 1 లక్ష ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 3 జి ఫోన్స్ పనిచేయడం లేదని, ట్యాబ్ వచ్చేవరకు టీచర్ల మీద ఒత్తిడి తీసుకురావద్దని కోరారు. ఖాళీగా ఉన్న టీచర్, ఆయాల పోస్టులను భర్తీ చేయాలని, అర్హులైన టీచర్లకు సూపర్వైజర్ టెస్ట్ నిర్వహించి ప్రమోషన్లు, ప్రతినెల 1న వేతనాలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం టీచర్‌కు రూ. 26 వేలు, ఆయాలకు రూ. 18 వేలు చెల్లించాలన్నారు. బొల్లం లక్ష్మి, సునీత, స్వప్నలు ఎఐటియుసిలో యూనియన్‌లో చేరగా వారికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కండువా కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. భూపతిరావు రమాదేవి, వై కుసుమ కుమారి, నేరెళ్ళ అరుణ, తిరుమల, కాంత కృష్ణ, పి శంకరమ్మ, రాజమణి, రేణుక, నస్రీన్ లు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, ఖాలిందర్ ఆలీ ఖాన్ ఉన్నారు.

## 27 'డబుల్' ఇళ్ల పంపిణీ ఎప్పుడు?



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల లో నిర్మించిన 27 డబుల్ బెడ్ రూం ఇండ్లను అర్హులైన పేదలను గుర్తించి పారదర్శకంగా ఇండ్ల పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం డబుల్ బెడ్ రూం ఇండ్లను సిపిఐ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లను పేదలకు అందించకపోతే కమ్యూనిస్టు పార్టీ పేదలను గుర్తించి గృహప్రవేశం చేపిస్తుందన్నారు. ఐదేళ్ల క్రితం బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మాణం చేసిందని, అప్పటి ప్రభుత్వం డబుల్ బెడ్ రూములు పంచడంలో నిర్లక్ష్యం వహించిందన్నారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామంలో పూర్తి స్థాయిలో పేదలను గుర్తించి పంపిణీ చేయాలని కోరారు. సిపిఐ జిల్లా నాయకులు బాచుపల్లి శంకర్, ప్రశాంత్, శంకర్, వంశీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# జమిలి వెనుక బిజెపి కుట్ర

**సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు**




**ప్రజాపక్షం/ఖమ్మం :** జమిలి ఎన్నికల వెనుక బిజెపి కుట్ర దాగి ఉందని నియంతృత్వం వైపు మోడీ ఆలోచనలు సాగుతున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు జమిలి ఎన్నికలలో మతోన్మాదం ద్వారా లబ్ది పొందాలని చూస్తున్నాయని ఇది దేశ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.చింతకాని, కొణిజర్ల మండలాలు, పాలేరు, ఖమ్మం నియోజక వర్గాల సిపిఐ సంయుక్త సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ గడిచిన 11 సంవత్సరాలుగా బిజెపి భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తూనే ఉందని తాము ఈ దేశాన్ని శాశ్వతంగా పాలించాలన్నదే బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల లక్ష్యమని ఆరోపించారు. భారతదేశం సువిశాల ప్రజాస్వామిక దేశమని విభిన్న మతాల, భాషల, సంస్కృతుల సమ్మేళనమని ప్రాంతానికో భావన ఉండే ఈ దేశంలో జమిలి ఎన్నికలు ప్రజాభిప్రాయాన్ని ప్రస్ఫూటింపచేయలేవన్నారు. ఇప్పటికే మత చిచ్చుకు తెరలేపిన బిజెపికి దేశ రాజ్యాంగంపై నమ్మకం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మారిన రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని హేమంతరావు తెలిపారు. దేశంలో పాలన కార్పొరేట్లు, సంపన్న వర్గాల కోసమే సాగుతుందన్నారు. దేశంలో కమ్యూనిస్టులు బలంగా ఉన్నప్పుడు పేదలు, కార్మికులకు అనుకూలమైన చట్టాలు వచ్చాయని ప్రస్తుతం పేదల కోసం ఉన్న పథకాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా వచ్చినవే అన్నారు. పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, నిర్బంధాలు, సంపన్న అనుకూల శాసనాలు, వ్యవసాయ రంగం సంక్షోభం, కార్పొరేటీకరణ కారణంగా ప్రజలు కమ్యూనిస్టులు బలంగా ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్న భావనలో ఉన్నారని హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టులు బలపడటం చారిత్రిక అవసరమన్నారు. 1925 డిసెంబర్ 26న ఆవిర్భావించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతంలోకి అడుగుపెడుతుందని, శత సంవత్సర సంబురాలను ఏడాది పొడవునా నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు, వేలాది మందితో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. వంద సంవత్సరాల పోరాట చరిత్ర, సాధించిన విజయాలు, పోరాట ఘట్టాలను నేటి తరానికి తెలియజేసేందుకు సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించనున్నామన్నారు. నాటి పోరాట ఘట్టాలను తెలియజేసేందుకు సాహిత్య, సంస్కృతిక రంగాలను వినియోగించుకోనున్నామని హేమంతరావు తెలిపారు. డిసెంబర్ 30న నల్లగొండలో శత సంవత్సర ప్రారంభ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ఖమ్మంజిల్లా నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తరలించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జాని మియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు నెరవేర్చాలి

**అర్హులైన పేదవారికి ఇళ్లస్థలాలు కేటాయించాలి**

**సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి**




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి డిమాండ్ చేశారు. సిపిఐ హనుమకొండ మండల కౌన్సిల్ సమావేశం మంగళవారం కండె నర్సయ్య అధ్యక్షతన బాలసముద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పునర్ విభజన హామీలను అమలు చేయక తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని, హైదరాబాద్ తర్వాత పెద్ద నగరంగా వరంగల్ మహానగరం వేగంగా విస్తరించిందని, వరంగల్‌లో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. పేదలు వేసుకున్న గుడిసెలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇండ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలైన అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు తోపాటు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం కృషి చేస్తామని సంవత్సరం గడుస్తున్నా ఇప్పటివరకు అమలు చేయకపోవడం సరికాదని, ఇప్పటికైనా ఇళ్ల స్థలాలు పక్క ఇల్లు నిర్మాణం కోసం నిధులు విడుదల చేసి వారిని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బిక్షపతి డిమాండ్ చేశారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ పట్టున్నవివిధ డివిజన్ లో పోటీచేసి కార్పొరేషన్ లో ప్రాతినిధ్యం వహించేందుకు పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని, ప్రశ్నించే గొంతు గా పనిచేసే సిపిఐ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. నగరంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సిపిఐ మండల కార్యదర్శి యేషబోయిన శ్రీనివాస్, కర్రే లక్ష్మణ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు,కొట్టె పాక రవి,సుదర్శన్, ప్రభాకర్, అరుణ పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులకు ఉపాధి ఏదీ?



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల వ్యవసాయ మార్కెట్‌లో బియ్యం పి డియస్ బియ్యం కొనసాగించి హమాలి కార్మికులకు ఉపాధి కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఎ ఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్‌కోరారు.హనుమకొండజిల్లా కలెక్టరేట్‌లో ఎఐటియుసి హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పరకాల వ్యవసాయ మార్కెట్ లో హమాలి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎఐటియుసిజిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్ మాట్లాడుతూ పరకాల వ్యవసాయ మార్కెట్ యందు సుమారుగా 200 మంది హమాలి కార్మికులు మార్కెట్‌పై ఆధారపడి జీవిస్తున్నారని,2019 నుండి 2022 వరకు రెండు గోదాముల్లో పిడియస్ బియ్యం లోడింగ్, అన్‌లోడింగ్ చేశారని, 2023 నుండి గోదాములు ఖాళీ చేయడంతో ఉపాధి లేక అల్లాడుతున్నారన్నారు. నాయకులు లంక దాసరి అశోక్, కే.శంకర్, కే.యాదగిరి, ఆర్.రాజయ్య, మోరే రవి, సీ.కుమారస్వామి, జే.పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల సర్వే 'ఫార్మెట్' నిబంధనలకు విరుద్ధం : అజయ్‌సారథిధ్వజం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ఇందిరమ్మ ఇండ్ల సర్వేఫార్మెట్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి ఆరోపించారు. రిజిష్ట్రేషన్ డాక్యుమెంట్లు, ప్రభుత్వ ఇంటి పట్టాలు ఉన్నవరిని మాత్రమే ఇందిరమ్మ లబ్దిదారులకు అర్హులుగా గుర్తించాలని ఉన్నతాధికారుల ఆకస్మిక ఆదేశాల పేరుతో చేపట్టిన సర్వే అధికారులను సిపిఐ ఆధ్వర్యంలో నిలదీసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ 22వ వార్డు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారులు ఇంటిపన్ను , కరెంట్ బిల్లు, సాదా బైనామాతో పాటు ఇలాంటి డాక్యుమెంట్లు లేకున్న ప్రభుత్వ స్థలాల్లో ఉన్న అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ పథకానికి అర్హులుగా గుర్తించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు 22వ వార్డులో సర్వేను కొద్దిసేపు నిలిపివేశారు.ఎట్టకేలకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్వహిస్తామని వెల్లడించడంతో 22వ వార్డులో యధావిధిగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగింది. సెల్ ఫోన్ ద్వారా కమీషనర్‌తో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథి రెడ్డి మాట్లాడడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా వార్డు ఆఫీసర్లు సర్వే నిర్వహించాలని, ఎలాంటి కొర్రీలు పెట్టకుండా ఉండాలని, ఇంటి పన్నుల రసీదులు, కరెంట్ బిల్లల రసీదులు అన్ని పరిగణలోకి తీసుకుని లబ్దిదారులను ఎంపిక చేయాలని కోరడంతో స్పందించిన కమీషనర్ ప్రజలకు ఎలాంటి బ్బందులు లేకుండా సర్వే కొనసాగించబడుతుందని తెలిపారు. ఈ ఆందోళనలో సిపిఐ నాయకులు పెరుగు కుమార్, పాండురంగాచారి, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబ లక్ష్మి , ఎండి మహమూద్,కందుకూరి లక్ష్మి నర్సు షరీఫ్, రమేష్,కాలనీ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# మీ చేతుల్లో కీలుబొమ్మనా?

**ఎన్‌సిపి అధినాయకత్వంపై 'భుజ్‌బల్' తీవ్ర అసంతృప్తి**
**పార్టీలో తనను అవమానించారని మండిపాటు**
**నేడు భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి**



**ముంబై:** మహారాష్ట్ర మంత్రివర్గంలో తనకు స్థానం కల్పించకపోవడంతో ఎన్‌సీపీ (అజిత్) సీనియర్ నాయకుడు ఛగన్ భుజ్‌బల్ అసంతృప్తితో రగిలిపోతున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తనను మంత్రివర్గంలోకి తీసుకునేందుకు అనుకూలంగా ఉన్నప్పటికీ పార్టీ అధ్యక్షుడు అజిత్ పవార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్ వైఖరి వల్లే తనకు మంత్రి పదవి లభించలేదన్నారు. వారు (అజిత్, ప్రఫుల్) చెప్పిందల్లా వింటూ గంగిరెద్దులా తల ఊపడానికి, వారి చేతుల్లో కీలుబొమ్మను కాదని మండిపడ్డారు. మంగళవారం ఆయన నాసిక్‌లో తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ....తనకు మంత్రిపదవి రాకుండా అడ్డుకున్న వారిని కచ్చితంగా గుర్తించి తీరుతానన్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా తనను మంత్రి వర్గంలోకి తీసుకునేందుకు ఆసక్తి చూపినప్పటికీ సొంత పార్టీ నేతలే అడ్డుతగిలారన్నారు. '' మంత్రి పదవి గురించి అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ నాతో మాట్లాడతామన్నారు. కానీ, వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. ఈలోగా మంత్రివర్గ విస్తరణ జరిగిపోయింది. ఇప్పుడు నన్ను రాజ్యసభకు వెళ్లమంటున్నారు. అలా చేస్తే.. నన్ను నమ్మి ఓట్లేసిన ప్రజలు ఏమైపోవాలి. నా విజయం కోసం అహర్నిశలూ శ్రమించిన కార్యకర్తల సంగతి ఏంటి? వాళ్లు (అజిత్, ప్రఫుల్) కూర్చోమంటే కూర్చోడానికి, నిల్చోమంటే నిలబడటానికి వాళ్ల చేతిలో కీలుబొమ్మని కాదు. పార్టీ కార్యకర్తలందరితో మాట్లాడి తదుపరి కార్యాచరణ సిద్ధం చేసుకుంటా' అన్నారు. పార్టీ పరంగా అధ్యక్షుడిదే తుది నిర్ణయమని, బీజేపీలో దేవేంద్ర ఫడ్నవీస్‌లా, శివసేనలో ఏక్‌నాథ్ షిండేలా, ఎన్సీపీకి సంబంధించిన అన్ని నిర్ణయాలను అజిత్‌పవార్ తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అలా జరగడం లేదన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో నేను ఉండాలని ఫడ్నవీస్ స్వయంగా చెప్పారు. అందుకే లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్నానన్నారు. 'ఇప్పుడు రాజ్యసభ సీటు ఇస్తామంటున్నారు. పార్టీ కోసం పని చేస్తున్నా. రాష్ట్రంలో మీ సేవలు కావాలని అప్పట్లో పార్టీ కోరింది. అందుకు అంగీకరించే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఇప్పుడు రాజ్యసభ ఇస్తామంటే వెళ్తానా? నన్ను గెలిపించిన ప్రజలు ఏమనుకుంటారు? అందుకే మరీ అవసరమనుకుంటే 2 సంవత్సరాల తర్వాత వెళ్తానని చెప్పాను. అప్పటిలోగా నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు పూర్తి స్థాయిలో కషి చేస్తానని అజిత్, ప్రఫుల్ పటేల్‌కు ఇప్పటికే చెప్పాను. అయితే, దీని గురించి మాట్లాడదామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు'' అని భుజ్‌బల్ అన్నారు. ప్రతి ఒక్క ఎమ్మెల్యే మంత్రి కావాలని కోరుకుంటారని, అయితే, తనను తిరస్కరించిన విధానం సరిగా లేదని ఆయన వాపోయారు. బుధవారం ఎన్‌సీపీ కార్యకర్తలు, యోలా నియోజకవర్గ ప్రజలతో చర్చించిన తర్వాత తాను పూర్తి స్పష్టతతో మాట్లాడతానని వెల్లడించారు. తనకు మంత్రి పదవి రానందుకు నిరాశ చెందలేదని, అయితే తనతో వ్యవహరించిన తీరుకు బాధపడ్డానని ప్రముఖ బీసీ నాయకుడైన భుజ్‌బల్ అన్నారు. ఎనిమిది రోజుల క్రితం నాకు రాజ్యసభ సీటు ఇవ్వగా... దానిని నేను తిరస్కరించానని చెప్పారు. 'అప్పుడు నా మాట వినలేదు, ఇప్పుడు ఇస్తున్నారు (రాజ్యసభ సీటు) నేను మీ చేతుల్లో కీలు బొమ్మనా?'అని అజిత్, ప్రఫుల్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. ఫడ్నవీస్ ఆదివారం నాగ్‌పూర్‌లో మంత్రివర్గాన్ని విస్తరించిన సంగతి విదితమే. తన బందంలో 39 మంది కొత్త వారిని చేర్చుకున్నారు. మహాయుతి కూటమిలో భాగమైన బీజేపీ నుండి 19, షిండే నేతత్వంలోని శివసేన నుండి 11మంది, అజిత్ పవార్ ఎన్‌సీపీ నుండి 9 మందికి మంత్రులుగా అవకాశం కల్పించారు. 16 మంది కొత్త ముఖాలతో కూడిన కొత్త మంత్రి మండలిలో స్థానం దక్కకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలకు హాజరవకుండా నాసిక్ జిల్లాలోని తన నియోజకవర్గం యోలాకు తిరిగి వచ్చారు. బుధవారం కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలతో చర్చించిన తర్వాత దీనిపై మరిన్ని విషయాలు చెబుతానని భుజ్‌బల్ స్పష్టం చేశారు.

## మణిపూర్‌లో రాజ్యాంగ హక్కులు హరించాయ్

**ఈ అంశంపై బిజెపి ఎంపిలు మాటెత్తడం లేదు : ప్రతిపక్షాలు**



**న్యూఢిల్లీ :** మణిపూర్‌లో రాజ్యాంగం కల్పించిన హక్కులు హరించివేయబడ్డాయని టిఎంసి, సిపిఐ(ఎం)కు చెందిన ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. రాజ్యాంగంపై చర్చ సందర్భంగా బిజెపి ఎంపిలు ఈ అంశాన్ని లేవనెత్తలేదని మండిపడ్డారు. 75 సంవత్సరాల భారత రాజ్యాంగం ప్రస్థానంపై చర్చ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సుష్మితా దేవ్ మాట్లాడుతూ మణిపూర్‌లో రాజ్యాంగం ప్రజలకు కల్పించిన అన్ని హక్కులు హరించివేసినందుకు ఈశాన్య ప్రాంత అధికార పార్టీ ఎంపిలు రాజీనామా చేయాలన్నారు. తాను ఇప్పుడు రాజ్యాంగంపై పార్లమెంట్‌లో మాట్లాడుతున్నాను.. అయితే మణిపూర్‌లో స్వేచ్ఛ, అభిప్రాయ వ్యక్తీకరణ వంటి అన్నింటినీ హరించేశారని, రాజ్యాంగం కల్పించిన వాటిలో దేనిని మీరు రద్దు చేయంది అని ఆమె నిలదీశారు. 'నేను ఈశాన్య ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు సభ్యురాలిగా ఇక్కడ నిలబడి ఉన్నాను. ఈశాన్య ప్రాంతానికి చెందిన ప్రతి ఎంపి, సభా నాయకుడి వెనుక ఉండి బల్లలు చర్చే ప్రతి మంత్రీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాను' అని దేవ్ చెప్పారు. ఎన్ఆర్‌సి (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్) నిర్వహించిన విధానంలో సమానత్వం లేదన్నారు. ఈ ప్రభుత్వానికి 'ఒకే ఎన్నికలు, ఒక నాయకుడు, ఒక మతం కావాలి' అని మండిపడ్డారు. ఈ దేశానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కోరుకున్నది ఇది కాదని, ఈ ఫాసిస్ట్ ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. సిపిఐ (ఎం) ఎంపి జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ప్రధానిని మణిపూర్‌కు వెళ్లనివ్వాలని, ఈ దేశ ప్రధానమంత్రిగా ఆయన తన బాధ్యతలు నిర్వర్తించాలని అన్నారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నుంచి ఎలక్షన్ కమిషన్, పార్లమెంట్, మీడియా వరకు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. ఈ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ ఉందని బ్రిట్టాస్ పేర్కొన్నారు. 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అనేది 'ఒకే నాయకుడు, ఒకే దేశం, ఒకే సిద్ధాంతం'కు పొడింపేనన్నారు. హంగేరియన్–అమెరికన్ వ్యాపారవేత్త పెట్టుబడిదారుడు జార్జ్ సోరోస్ డబ్బు ఎక్కడ ఉపయోగించారో దర్యాప్తు చేయడానికి జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)ని నియమించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. రైతులు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతుండగా కార్పొరేట్ రుణాలు మాఫీ అవుతున్నాయని దేవ్ పేర్కొన్నారు. దేశంలోని 'పన్ను భారం వల్ల మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని' ఆమె పేర్కొన్నారు, అయితే ఈ ప్రభుత్వ విధానాల కారణంగా కార్పొరేట్‌లపై పన్నులు తగ్గుతూనే ఉన్నాయని చెప్పారు. కాగా, రాజ్యాంగంలోని సూత్రాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జెడియు నేత, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ అన్నారు. 2023లో మాజీ ప్రధానులు పివి నరసింహారావు, చరణ్‌సింగ్‌లతో పాటు వెనుకబడిన సాధికారత కోసం పోరాడిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోదీని 2023లో అభినందించారు.

## త్వరలో ఢిల్లీ ఎన్నికల తేదీల ప్రకటన..?

**సన్నాహక సమావేశానికి ఇసి పిలుపు**

**న్యూఢిల్లీ :** వచ్చే ఏడాది ఆరంభంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా ఢిల్లీ ఎన్నికలపై సన్నాహక సమావేశానికి పిలుపునిచ్చింది. ఈ వారంలోనే ఎన్నికల నిర్వహణపై అధికారులతో భేటీ కానున్నట్లు తెలిసింది. సమావేశం అయిన వెంటనే ఎన్నికల తేదీలను ప్రకటించనున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఇక ఈ ఎన్నికల కోసం అధికార ఆప్ తన అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ఆప్ ఖరారు చేసింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ స్థానం నుంచి పోటీ చేస్తుండగా ముఖ్యమంత్రి అతిశీ గతంలో పోటీ చేసిన కల్కాజీ స్థానం నుంచే పోటీ చేస్తున్నారు. తమ పార్టీ పూర్తి విశ్వాసంతో, పూర్తి సన్నద్ధతతో ఎన్నికల్లో పోటీ చేస్తోందని కేజ్రీవాల్ తెలిపారు.

## 'బంగ్లా' బ్యాగ్‌తో పార్లమెంట్‌కు ప్రియాంక



**న్యూఢిల్లీ:** పలస్తీనా అని రాసి ఉన్న బ్యాగ్‌తో సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో కనిపించిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ... మంగళవారం కొత్త బ్యాగ్‌తో కనిపించారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులను ఖండిస్తున్న సందేశం గల బ్యాగులను విపక్ష ఎంపీలు వెంట తీసుకువచ్చారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం వేళ... వాటిని ప్రదర్శిస్తూ మైనార్టీలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిన్న ప్రియాంక లోక్‌సభలో మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల మీద భారత్ గళం విప్పాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు అక్కడి ప్రభుత్వంతో మాట్లాడాలని సూచించారు. ఇజ్రాయిల్ దాడులతో దుర్భర పరిస్థితులు అనుభవిస్తోన్న పలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఆమె నిన్న పలస్తీనా అని రాసి ఉన్న బ్యాగ్‌తో పార్లమెంటుకు వచ్చారు. ప్రియాంక ఆ బ్యాగ్ తీసుకురావడం చర్చనీయాంశమైంది. జాతీయ అంశాల కంటే అంతర్జాతీయ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే ప్రయత్నమని బీజేపీ విమర్శించింది. దీనిపై ప్రియాంక స్పందిస్తూ 'నేను ఏమి ధరించాలో ఎవరు నిర్ణయిస్తారు? నేను కోరుకున్నది ధరిస్తా' అని స్పష్టంచేశారు. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై వచ్చిన ఆరోపణల మీద జేపీసీ విచారణ జరపాలని విపక్షాలు డిమాండు చేస్తున్న విషయం తెలిసిందే. దానిలోభాగంగా కొన్ని రోజులుగా ప్రతిపక్ష నేతలు వినూత్న బ్యాగులతో నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. బ్యాగ్‌కి ఒకవైపు ప్రధాని నరేంద్ర మోదీ, గౌతమ్ అదానీ చిత్రం, మరోవైపు 'మోదీ, అదానీ భాయ్ భాయ్' అనే నినాదం ముద్రించి ఉన్న బ్యాగులతో కనిపించారు.

## బోధ్‌గయలోని మహాబోధి ఆలయంలో దిసనాయకే

**గయ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు బీహార్ మంత్రులు, అధికారులు స్వాగతం**



**గయ (బిహార్) :** శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే మంగళవారం బిహార్‌లోని బోధ్‌గయను సందర్శించారు. యునెస్కో ప్రపంచ వారసత్వంగా గుర్తింపు పొందిన మహాబోధి ఆలయంలో ఆయన ఈ సందర్భంగా ప్రార్థనలు చేశారు. గయ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న దిసనాయకే నేరుగా బుద్ధుని జీవితానికి సంబంధించిన నాలుగు పవిత్ర స్థలాలలో ఒకటైన 1,500 సంవత్సరాల నాటి పురాతనమైన మహాబోధి ఆలయాన్ని సందర్శించి అనంతరం జ్ఞానోదయానికి వెళ్లారు. విమానాశ్రయంలో శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకేకు బీహార్ మంత్రులు ప్రేమ్‌కుమార్, సంతోష్‌కుమార్, జిల్లా అధికార యంత్రాంగానికి చెందిన సీనియర్ అధికారులు స్వాగతం పలికారు. మహాబోధి ఆలయానికి వచ్చిన దిసనాయకే వెంట గయ జిల్లా కలెక్టర్ త్యాగరాజన్ ఎస్ఎం ఉన్నారు. బుద్ధగయ ఆలయ నిర్వహణ కమిటీ (బిటిఎంసి)కార్యదర్శి మహాశ్వేత మహారథి, మరి కొందరు ముఖ్యులతో కలిసి ఆలయంలో ప్రార్థనలు చేశారు. పవిత్ర బోధి వృక్షం కింద ప్రార్థనలు చేసిన దిసనాయకే అంగారిక ధర్మపాల విగ్రహానికి పుష్పాలను అర్పించారు. భారతదేశ మహాబోధి సొసైటీ జనరల్ సెక్రటరీ పెల్వట్టే సీవాలీ థెరో, సారనాథ్ కేంద్రం అధిపతి ప్రముఖ రత్మల్‌వాలా సుమిత్తానంద థెరో నుంచి దిసనాయకే ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా బిటిఎంసి కార్యదర్శి మహాశ్వేత మహారథి విలేకరులతో మాట్లాడుతూ 'అధ్యక్షుడు దిసనాయకే ఆలయ గర్భగుడిలో ప్రార్థనలు చేసి పవిత్రమైన బోధి వృక్షాన్ని సందర్శించారు' అని తెలిపారు.ఆలయ సముదాయంలో బుద్ధునికి సంబంధించిన అనేక ఇతర ప్రదేశాలను కూడా ఆయన ఈ సందర్భంగా సందర్శించారు. గయ జిల్లాకు శ్రీలంక అధ్యక్షుడి రాక సందర్భంగా గట్టి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఒక అధికారి తెలియజేశారు.

## కొత్త అధ్యక్షుడి కోసం బిజెపి కసరత్తు

**న్యూఢిల్లీ:** బీజేపీలో సంస్థాగత మార్పులకు రంగం సిద్ధమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పార్టీ జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికి 60 శాతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల పదవీకాలాలు ముగిశాయి. వీటన్నింటికీ జనవరిలో ఎన్నికలు నిర్వహించి... తదుపరి నెలలో జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు పార్టీ ముఖ్య నేతలు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. బీజేపీ రాజ్యాంగం ప్రకారం జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియ ప్రారంభించే ముందు కనీసం సగం రాష్ట్ర శాఖల్లో సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలి. 2019లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో జేపీ నడ్డా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నడ్డా బాధ్యతలు చేపట్టిన తర్వాత వివిధ రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. తాజాగా మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ... నడ్డాను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకొంది. దీంతో పార్టీ అధ్యక్ష బాధ్యతలు సమర్థుడికి అప్పగించే యోచనలో ఉంది. అయితే, నడ్డా వారసుడిగా కొంతమంది నేతల పేర్లు తెరమీదకు వస్తున్నాయి. తొలుత దేవేంద్ర ఫడ్నవీస్ పేరు వినిపించింది. అయితే, మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం సాధించిన కమలం పార్టీ... ముఖ్యమంత్రి పదవిని ఫడ్నవీస్‌కు అప్పగించింది. దీంతో ఆయన జాతీయ అధ్యక్షుడి బరి నుంచి వైదొలగినట్లయింది. ప్రముఖంగా వినిపిస్తున్న మరో పేరు మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. ఒకవేళ ఆయనకు అధ్యక్ష పదవి ఇస్తే... మంత్రివర్గం నుంచి తప్పించే అవకాశం ఉంది. పార్టీ రాజ్యాంగం ప్రకారం ఒకరికి రెండు పదవులు నిషిద్ధం. వీరితోపాటు రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, పార్టీ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, మహారాష్ట్ర బీజేపీ అగ్రనేత వినోద్ తావడే పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. వీరిలోనే ఒకరిని ఎంపిక చేస్తారా లేక అనూహ్యంగా మరొకరిని తెరమీదకు తీసుకొస్తారా అన్నదానిపై ప్రతిష్టంభన నెలకొంది.

## రైతులకు కాంగ్రెస్ చేసిందేమీలేదు: ప్రధాని మోదీ



జైపూర్ : రైతుల పేరుతో పెద్దగా మాట్లాడతారు కానీ వారి కోసం ఏమీ చేయరు, ఇతరులను చేయనివ్వరు అని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం కాంగ్రెస్‌పై మండిపడ్డారు. రాజస్థాన్ ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది పూర్తయిన సందర్భంగా జైపూర్‌లోని దాడియాలో జరిగిన 'ఏక్ వర్ష్ పరిణాం ఉత్కర్ష్'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 46,300 కోట్ల రూపాయల విలువైన ఇంధనం, రోడ్డు, రైల్వేలు, నీటికి సంబంధించిన 24 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ పార్వతి, కలిసింద్, చంబల్ ప్రాజెక్టు ద్వారా రాజస్థాన్‌లోని 21 జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తామని, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ రెండింటి అభివద్ధిని వేగవంతం చేస్తామని చెప్పారు. చర్చలను ప్రోత్సహించడమే బీజేపీ విధానం అయితే, రాష్ట్రాల మధ్య నీటి వివాదాలను కాంగ్రెస్ ప్రోత్సహిస్తోందని ఆయన అన్నారు. 'బీజేపీ విధానం సంభాషణలు కాదు, సంఘర్షణ కాదు. మేము సహకారాన్ని నమ్ముతాం. ప్రతిపక్షాన్ని కాదు. మేము పరిష్కారాలను నమ్ముతాం. అంతరాయం కాదు. అందువల్ల, మా ప్రభుత్వం తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్ట్‌ను ఆమోదించింది... విస్తరించింది. బీజేపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే మధ్య ప్రదేశ్, రాజస్థాన్‌లో పార్వతికలిసింద్‌చంబల్ ప్రాజెక్టుపై ఒప్పందం కుదిరింది' అని ఆయన తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్‌లోని వివిధ ప్రాంతాలకు నర్మదా నది నీటిని తీసుకురావాలని తాను పెద్ద ఎత్తున ప్రచారం చేశానని, దానిని అడ్డుకునేందుకు కాంగ్రెస్, కొన్ని స్వచ్ఛంద సంస్థలు అనేక వ్యూహాలు పన్నాయని ప్రధాని ఆరోపించారు. 'కాంగ్రెస్ ఎప్పుడూ నీటి సమస్యలను తగ్గించాలని కోరుకోదు. ఒకప్పుడు మన నదుల నీ రు సరిహద్దులు దాటి ప్రవహించేది. కానీ మన రైతులకు దాని ప్రయోజనం లేదు. పరిష్కారం కనుగొనడానికి బదులుగా, కాం గ్రెస్ రాష్ట్రాల మధ్య నీటి వివాదాలను ప్రోత్సహిస్తూనే ఉంది' అ ని అన్నారు. నేడు బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు సుపరిపాలనకు ప్రతీకగా మారుతున్నాయని, నేడు దేశ ప్రజలు సుపరిపాలనకు బీజేపీ గ్యారెంటీ అని చెబుతున్నారని ప్రధాని అన్నారు.

## అహంకారం పెరిగితే అగాథంలోకే

**నేతలకు మోహన్ భగవత్ హెచ్చరిక**



**పూణె:** ప్రతి ఒక్కరు అహంకారం పక్కన పెట్టాలని, లేకపోతే అగాథంలో పడిపోతారని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ హితవు పలికారు. శాశ్వతమైన ఆనందాన్ని గుర్తించినప్పుడే నిస్వార్థమైన సేవ చేస్తారని, అదే ఇతరులకు సహాయపడే ధోరణి పెంచుతుం దని అన్నారు. మహారాష్ట్రలో జరిగిన ఓ కార్య క్రమంలో మోహన్ భగవత్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సమాజంలో ప్రతిదీ తప్పు గా జరుగుతోందనే అభిప్రాయం పెరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. 'సమాజంలో ఒక ప్రతికూల అంశం జరిగితే దానికి 40 రెట్లు మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. సానుకూల అంశాల గురించి అవగాహన కల్పించడం అవసరం. సేవ అనేది సమాజంలో శాశ్వతమైన నమ్మకాన్ని పెంచుతుంది. రామకష్ణ పరమహంస అభిప్రాయం ప్రకారం మనలో రెండు 'నేను'లు ఉంటాయి. ఒకటి ముడిపదార్థం కాగా, మరొకటి పరిపక్వత చెందినది. పరిపక్వతతో కాకుండా ముడి పదార్థం(ఇగోతోఉంటే)గానే ఉంటామంటే... అగాథంలో పడిపోతాం' అని అన్నారు. అన్ని వర్గాల సాధికారతే దేశం అభివద్ధిని నిర్ధారిస్తుందని తెలిపారు. దేశ పురోగతికి దోహదపడేలా యువతను తీర్చిదిద్దాలని సూచించారు. గతంలోనూ భగవత్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. 'దేవుళ్లమని మనకు మనం స్వయంగా ప్రకటించుకోకూడదు. ఆ విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారు. కొంతమంది మెరుపులా మెరవాలని కోరుకుంటారు. కానీ, పిడుగు పడిన తర్వాత మరింత చీకటిగా మారుతుందని వారు గుర్తించరు' అని భగవత్ అన్నారు.

## హథ్రాస్ బాధిత కుటుంబానికి న్యాయ నిరాకరణ

**బిజెపి ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీనీ నెరవేర్చలేదు : రాహుల్ ఆగ్రహం**



**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లోని హథ్రాస్ హత్యాచార బాధితురాలు కుటుంబానికి బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ వరకూ నెరవేర్చలేదని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. న్యాయం చేయడంలో జాప్యం జరగడమే కాకుండా అసలు న్యాయం చేసేందుకు నిరాకరిస్తోందని ఆరోపించారు. గత వారం హథ్రాస్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వీడియోను రాహుల్‌గాంధీ షేర్ చేశారు. 'న్యాయం ఆలస్యం, న్యాయం నికారణ' అని పేర్కొంటూ హథ్రాస్‌లో ఏదో జరుగుతోందని, నిందితులు స్వేచ్ఛగా బయట తరుగుతుంటే... బాధిత కుటుంబం మాత్రం బందీగా ఉందని యూ ట్యూబ్‌లో పోస్టు చేసిన వీడియోలో రాహుల్ పేర్కొన్నారు. 2020, సెప్టెంబరు 14వ తేదీన 19 ఏళ్ల దళిత యువతిపై నలుగురు యువకులు సామూహికంగా అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. అనంతరం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి విదితమే. అయితే యువతి కుటుంబాన్ని సంప్రదించకుండా అదే రోజు అర్ధరాత్రి ఉత్తరప్రదేశ్ పోలీసులు బలవంతంగా అంత్యక్రియలు నిర్వహించారని రాహుల్ ఆ వీడియో పేర్కొన్నారు. సుదీర్ఘ దశ సాక్ష్యాలను నాశనం చేసి, న్యాయ వ్యవస్థను తప్పుదోవ పట్టించి నాలుగు సంవత్సరాల తరువాత, ఈ రోజు, నిందితులు అదే స్థలంలో స్వేచ్ఛగా తిరుగుతున్నారని, అయితే బాధిత కుటుంబా న్ని బందీలుగా ఉంచారని, వారు ఇంకా న్యాయం కోసం ఎదురు చూస్తున్నారని గాంధీ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేదని, వారిని వేరే చోటికి మారుస్తామన్న హామీ కూడా నెరవేర్చలేదని రాహుల్ పేర్కొన్నారు. కులతత్వం, అధికారం అనే ఈ చిక్కుముడిలో దళితులకు న్యాయం జరుగుతుందని ఆశించడం కూడా అసాధ్యంగా మారిందన్నారు. 'హథ్రాస్ అత్యాచార బాధితురాలి కుటుంబం బాధలను శ్రద్ధగా విన్నామని, వారు ఇప్పటికీ భయంతో ఉన్నారని, వారి పరిస్థితిని చూసిన తరువాత దళితులకు న్యాయం చేయడం చాలా కష్టంగా మారిందని స్పష్టమవుతోందన్నారు. తాము ఆ ఆ కుటుంబానికి అండగా ఉన్నామని, వారిని మరో ఇంటికి మారుస్తామని, అవసరమైన అన్ని సహాయాలు అందిస్తామన్నారు. 'హథ్రాస్ బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉ ద్యోగం ఇస్తామని యుపి బిజెపి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అది ఇవ్వలేదు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయం ఇంకా పెండింగ్‌లో ఉంది. పైగా గృహ నిర్బం ధం చేశారు. తాము బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం' అని గాంధీ చెప్పారు. వీడియోలో, తమకు న్యాయం నిరాకరించబడిందని, ఇంటి నుండి బయటకు వెళ్లడానికి అనుమతించబడలేదని బాధిత కుటుంబాలు చెబుతున్న మాటలను గాంధీ సావధానంగా వింటున్న దృశ్యాలు కనిపించాయి.

## సిఎం నివాసం వద్ద 'బాంబు' కలకలం

**ఇంఫాల్:** మైతేయికుకీ తెగల మధ్య చెలరేగిన ఘర్షణలతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ ఏడాదిన్నరగా అతలాకుతలమవుతోంది. అనేకచోట్ల హింసాత్మక ఘటనలు, బాంబు దాడులు, ఆందోళనలతో అట్టుడుకుతోంది. దీంతో తాజాగా ముఖ్యమంత్రి నివాసం వద్దే బాంబు కన్పించడం తీవ్ర కలకలం సష్టించింది. మణిపూర్‌లోని కొయిరెంగేయ్ ప్రాంతంలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌కు ప్రైవేటు నివాసం ఉంది. ఈ ఇంటికి కొన్ని మీటర్ల దూరంలో మంగళవారం తెల్లవారుజామున ఓ మోర్టార్ బాంబు గుర్తించారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాంబును నిర్వీర్యం చేశారు. అయితే, ఘటనా సమయంలో సీఎం నివాసంలో లేరని సమాచారం. ఈ రాకెట్ ప్రొపెల్డ్ బాంబును గత రాత్రి ప్రయోగించి ఉంటారని కొంతమంది స్థానికులు చెబుతున్నారు. అది పేలకుండా ఇక్కడ పడిపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఘటన నేపథ్యంలో సీఎం ఇంటి వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాంబు ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరు ప్రయోగించి ఉంటారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## ఒటిటి వేదికలకు కేంద్రం హెచ్చరిక

**న్యూఢిల్లీ:** ఓటీటీ ప్లాట్‌ఫారంలో కంటెంట్‌పై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో సినిమాలు, వెబ్ సిరీస్‌ను తప్పనిసరిగా సెన్సార్ చేయాలనే డిమాండ్లు ఇటీవల పెరిగాయి. దీంతో కేంద్రం ఓటీటీ ప్లాట్‌ఫారాలకు హెచ్చరికలు జారీ చేసింది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఓటీటీ వేదికలకు సూచనలు జారీ చేసింది. డ్రగ్స్ వినియోగాన్ని ప్రోత్సహించడం, గ్లామరైజ్ కంటెంట్ చూపిస్తే... దానిపై దర్యాప్తు చేస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. సిరీస్‌లు, ఇతర కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న సమయంలో డ్రగ్స్‌పై ప్రచారం చేయొద్దని సూచించింది. సినిమాలు, సీరియల్స్‌లో నటులు మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రోత్సహించే సన్నివేశాలను యూజర్ వార్నింగ్ లేకుండా ప్రసారం చేయకూడదని చెప్పింది. డ్రగ్స్ వినియోగాన్ని చూపించడం వల్ల తీవ్ర పరిణామాలు ఉంటాయని చెప్పింది. అలాంటి సున్నితమైన కంటెంట్ ద్వారా యువత ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చింది. డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన సీన్స్ చూపించే సమయంలో తప్పనిసరిగా హెచ్చరికలు ఉండాల్సిందేనని చెప్పింది.

## అదానీ సౌర ఒప్పందం అధికారుల సూచనలకు విరుద్ధం

**• జగన్ ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం • సెకీ ఆశ్రయించిన మరుసటి రోజే ఏపి కేబినెట్ అంగీకారం • 57 రోజుల్లోనే ఏపిఇఆర్‌సి ఆమోదం**

**న్యూఢిల్లీ:** అవినీతి విచారణను ఎదుర్కొంటున్న 'అదానీ సౌర ఒప్పందం' సంబంధిత అధికారుల సూచనలకు విరుద్ధంగా జరిగినట్లు రాయిటర్స్ నివేదిక పేర్కొంది. అదానీ గ్రీన్ ద్వారా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)కి సరఫరా కోసం సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేలా రాష్ట్ర విద్యుత్ సర ఫరా కంపెనీలను ఆదేశించాలంటూ ఆంధ్రప్రదేశ్ అధికారికి 228 మిలియన్ డాలర్ల లంచాన్ని అదానీ ఇచ్చినట్లు అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. విద్యుత్, ఆర్థిక శాఖల సూచనలను తోసిపుచ్చుతూ అదానీ సంస్థతో సౌర ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంతకాలు చేసినట్లు ప్రభుత్వ పత్రాలు పేర్కొ న్నాయి. తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలునకు ఒప్పందాన్ని రాష్ట్రం చేసుకోగలదని ఏపీ ఆర్థిక శాఖ పేర్కొన్నట్లు వెల్లడించాయి. 7,000 మెగావాట్ల ఒప్పందం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సెకీ ఆశ్రయించడం, ఏపీఈఆర్‌సీ ఆమోదించడానికి కేవలం 57 రోజులే తేడా అని, ప్రక్రియ చాలా వేగంగా జరిగిందని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ సంస్థ మాజీ అధికారి, ఇంధన న్యాయ నిపుణులు చెప్పినట్లు పేర్కొంది. ఈ ఒప్పందానికి సంబంధించి 19 ప్రభుత్వ పత్రాలను రాయిటర్స్ సమీక్షించింది. అధికారులనూ ఇంటర్వ్యూ చేసి సమా చారాన్ని సేకరించింది. ఈ క్రమంలో ఆర్థిక, ఇంధన అధికారుల సలహాలను తోసిపుచ్చి అదానీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం స్పష్టమైనట్లు తెలి పింది. అయితే సెకీ 2021 సెప్టెంబరు 15న ప్రవర్తన అసాధారణం. దేశంలోని అతిపెద్ద పునరుత్పాదక ఇంధన ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ సంతకం చేస్తుందా లేదా అని తెలుకునేందుకు ఫెడరల్ సంస్థ యత్నించింది. అయితే రాష్ట్రానికి పదేళ్ల వరకు సౌర విద్యుత్ అవసరం లేదని, 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే పునరుత్పాద కాల పైనే దృష్టి పెట్టాల్సి ఉందని ఆంధ్రప్రదేశ్ ఇం ధన నియంత్రణ సంస్థ రెండేళ్ల కిందటే చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని సెకీ ఆశ్రయించిన మరుసటి రోజు 26 మంది సభ్యుల జగ న్‌మోహన్ రెడ్డి కేబినెట్ ఈ ఒప్పందాన్ని ఆమోదించింది.సెప్టెంబరు 15న రాసిన లేఖలో ఇంధన సరఫరాదారు పేరును సెకీ పేర్కొనలేదు కానీ ఇద్దరు సరఫరాదారులతో సెకీ ఒప్పందం గురించి అందరికీ తెలుసు. ఆ రెండు కంపెనీల్లో ఒకటి అదానీదని బహిర్గతమైంది. ఇదే క్రమంలో నవంబరు 11వ తేదీ నాటికి ఇంధన నియం త్రణ సంస్థ (ఎనర్జీ రెగ్యులేటర్) ఆమోదాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొం దింది. సెకీ తో సేకరణ ఒప్పందంపై రాష్ట్ర అధికారులు డిసెంబరు 1న సంతకాలు చేశారు. దాని వార్షిక విలువ 490 మిలియన్ డాలర్లు కాగా ఒప్పందం ప్రకారం అందులో 97శాతం అదానీ గ్రీన్‌కు వెళుతుందని పత్రాలు చెబుతున్నట్లు రాయిటర్స్ తెలిపింది.


**CHANGE OF NAME**

I, **YADGIRI DEVUNOORI** (Old Name), H. No. 2-4-919, Gokul Nagar, Near Old Bus Depo, Hanumkonda Dist, Pin-506001, Telangana State, India. here by declare that I have changed my name **YADAGIRI DEVUNURI** (New Name) for all purpose.

**SHRIRAM వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS24TA 1308 | SAMBA MURTHI VALLEPU | ITATA SIGNA 2823. K BS6 FBT (PEDDAMBERPET) AUCTION DATE : 19.12.2024 | 2022 |
| 2 | AP09CL 7567 | MAMATHA ONTARI | RENAULT DUSTER 85PS RXL DIESEL | 2012 |
| 3 | AP09CT 2959 | MAMATHA PERUMANDLA | FORD ECOSPORT 1.5D TDCI AMBIENTE MT DIESEL | 2013 |
| 4 | TS05EE 0729 | VEERA BRADHAM KOKKONDA | MARUTHI WSIFT DZIRE VDI DIESEL | 2014 |

**AUCTION DATE:21-12-2024**

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, , Hanamkonda - 506009. Cell : 9849955900

ప్రజాపక్షం
బుధవారం, డిసెంబరు 18

# సంబంధాల మెరుగుదల దిశగా...

భారత్‌–శ్రీలంకలు భౌగోళికంగా సామీప్యతతోపాటు సాంప్రదాయకంగా మిత్రదేశాలు. శతాబ్దాలక్రితం చెరకుతోటల్లో పనుల నిమిత్తం వలస కార్మికులుగా వెళ్లి అక్కడే స్థిరపడిన లక్షలాదిమంది తమిళ సంతతి ప్రజలు ఈ స్నేహ వారధులు. అయితే సిన్హళ జాత్యహంకారులు వారిని రెండవతరగతి పౌరులుగా అణగదొక్కటంవల్ల ఉత్పన్నమైన వైరం, హింస, అంతర్యుద్ధం, అలాగే మత్స్యకారుల సముద్రజలాల హద్దులు ఉల్లంఘించటం, గత దశాబ్దాల్లో శ్రీలంక పాలకులు చైనాతో వ్యూహాత్మక సంబంధాలు ఏర్పరుచుకుని భారత్‌ భద్రతకు ముప్పుతెచ్చే పరిస్థితులు కల్పించటం భారత్‌–శ్రీలంక సంబంధాల్లో చిక్కులకు ప్రధాన కారణాలు. ఇటీవల అధ్యక్ష, పార్లమెంటరీ ఎన్నికల్లో వామపక్ష కూటమి అపూర్వమైన విజయం సాధించటం, దేశాధ్యక్షుడిగా ఎన్నికైన అనురకుమార దిస్సానాయకే పార్టీ జనతా విముక్తి పెరమునకు సైద్ధాంతికంగా చైనా కమ్యూనిస్టు పార్టీతో గతంలో ఉన్న సంబంధాలు భారత ప్రభుత్వంలో సహజంగానే సందేహాలకు తావిచ్చింది. అయితే దిస్సానాయకే తన తొలి విదేశీ పర్యటనకు భారతదేశాన్ని ఎంచుకోవటంలో ఎంతో ఆచరణాత్మకతను ప్రదర్శించారు. న్యూఢిల్లీలో మూడురోజుల పర్యటనలో విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్, భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చివరగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమై ఇరుదేశాల మధ్యనున్న సమస్యలు, సందేహాలపై లోతుగా చర్చించారు. ఉభయులూ ప్రయోజనదాయకమైన కొన్ని నిర్ణయాలకు వచ్చారు. చైనా రీసెర్చి నౌకలను కొలంబో రేవులో లంగరు వేయటానికి శ్రీలంక అనుమతించటంపై తమకున్న అభ్యంతరాన్ని భారత నాయకులు శ్రీలంక అధ్యక్షునికి నిర్మొహమాటంగా స్పష్టం చేశారు. అలాగే తమిళుల సమస్యలకు సత్వర పరిష్కార ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఎల్‌టిటిఇ తిరుగుబాటు రోజుల్లో దిస్సానాయకె కూడా తమిళులను వ్యతిరేకించారు. అధ్యక్ష ఎన్నికల్లో తమిళుల మెజారిటీ రాష్ట్రాల్లో దిస్సానాయకేకు చాలా తక్కువశాతం ఓట్లు వచ్చాయి. అయితే అనంతరం ఆయన ఆ ప్రాంతాల్లో పర్యటించి, వారి భూములు పునరుద్ధరిస్తానని, కేసులు ఎత్తివేస్తామని, ఉపాధులు కల్పిస్తామని హామీలు ఇవ్వటంతో పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక తమిళులు — తమిళ పార్టీల కన్నా పాలక కూటమికి ఎక్కువగా ఓట్లు వేశారు. వారిలో చిగురింపజేసిన ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత దిస్సానాయకేపై ఉంది. సిన్హళ దురభిమానులను, బౌద్ధమతాధికారులను నొప్పించకుండా ఎంతో చాకచక్యంతో తమిళుల సమస్యలకు పరిష్కారాలు అన్వేషించాల్సి ఉంటుంది.

కొవిడ్ సంక్షోభంతో — విదేశీ టూరిస్టులపై ఆధారపడిన శ్రీలంక ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి తీవ్రమైన సంక్షోభం తలెత్తిన సమయంలో భారత్ ఈ పొరుగుదేశాన్ని ఎంతగానో ఆదుకుంది. అనేక ప్రాజెక్టులు మంజూరు చేసింది. శ్రీలంక అధ్యక్షుడి భారత్ పర్యటన సందర్భంగా ప్రభుత్వం మరింత సుహృద్భావం ప్రదర్శించి, గతంలో రుణం ఇచ్చి నిర్మాణం పూర్తి అయిన ప్రాజెక్టులు చెల్లించాల్సిన 20.66 మిలియన్ డాలర్లను గ్రాంటుగా పరిగణిస్తున్నట్లు ప్రకటించింది. ఇంధన ప్రాజెక్టుల్లో సహకారం కొనసాగించటానికి అంగీకరించింది. ప్రాంతీయ భద్రత, డిజిటల్ ప్రాథమిక వసతులు, కమ్యూనికేషన్ సంబంధాలు, ఇంధన ప్రాజెక్టులు, అలాగే తమిళుల సమస్య, మత్స్యకారుల సమస్యలను ఇరుపక్షాలు చర్చించాయి. ''భారతదేశ భద్రతకు, అలాగే ప్రాంతీయ స్థిరత్వానికి చేటు కలిగించే ఎటువంటి చర్యలకూ తమ భూభాగాన్ని వినియోగించుకోవటాన్ని శ్రీలంక అనుమతించబోదని అధ్యక్షుడు దిస్సానాయకే భారత్‌కు హామీయిచ్చారు. తమ రేవుల్లో విదేశీ నౌకలు లంగరు వేయటంపై శ్రీలంక విధించిన ఏడాది మారిటోరియం వచ్చే జనవరిలో ముగియనున్న నేపథ్యంలో చైనా నౌకల లంగరు అంశాన్ని భారత నేతలు లేవనెత్తారు. శ్రీలంక మారిటైం భద్రత, మారిటైం రీసెర్చి తదితర అనేక కార్యకలాపాలకు తోడ్పడటానికి భారత్ సంసిద్ధత తెలిపింది.

శ్రీలంకలో అదానీ గ్రూపు ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను చర్చించినట్లు ఇరుదేశాల ప్రకటనలు ప్రస్తావించకపోవటం విశేషం. సిఐఐ, ఫిక్కి, అసోచం సోమవారం ఢిల్లీలో నిర్వహించిన ''ఇండియా–శ్రీలంక బిజినెస్ ఫోరం'' సమావేశంలో కూడా అదానీ గ్రూపు ప్రతినిధులు ఎవరూ లేరు. శ్రీలంక–భారత్ మధ్య సమస్యలు, సందేహాలు ఒక పర్యటనతో పరిష్కారమయ్యేవి కావు. అయితే సుహృద్భావ పునరుద్ధరణకు, సహకారాభివృద్ధికి అధ్యక్షుడు దిస్సానాయకే పర్యటన బాటవేసిందని భావించుదాం.

# నల్లచట్టాలకు దొడ్డిదారి... కొత్త మార్కెట్ సంస్కరణలు



డా. సోమ మర్ల

ఇటీవల కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ వ్యవసాయ మార్కెటింగ్‌పై వ్యవసాయ మార్కెట్ పాలసీ ముసాయిదాను రూపొందించింది. కేంద్ర వ్యవసాయ అదనపు కార్యదర్శి ఫైజ్ అహ్మద్ కిద్వాయ్, ఈ సంవత్సరం ప్రారంభంలో మంత్రిత్వశాఖ నియమించిన కమిటీ ముసాయిదా మార్కెటింగ్ ఫ్రేమ్‌వర్క్‌ను కమిటీ ప్రతిపాదించింది. ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం దేశవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తులపై సార్వత్రిక (ఒక పన్ను) పన్ను రైతులకు అధిక ఆదాయాన్ని పొందటానికి తోడ్పడుతుంది. ప్రస్తుత ప్రభుత్వ మార్కెట్ యార్డు స్థానంలో వ్యవసాయ మార్కెటింగ్ మెకానిజం యొక్క కొత్త ఫ్రేమ్ వర్క్‌ను కమిటీ సూచించింది, పెద్దమొత్తంలో నిల్వ చేయడం మరియు పెద్ద ప్రైవేట్ పార్టీల ద్వారా నేరుగా కొనుగోలు చేయడంపై చట్టాలు, కేంద్ర ప్రభుత్వం నేరుగా పన్నులు వసూలు చేసేందుకు అధికార జిఎస్‌టి కమిటీ తరహాలో రాష్ట్ర వ్యవసాయ మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. కొత్త ప్రతిపాదనలు ప్రస్తుతం ఉన్న పబ్లిక్ మార్కెట్ యార్డుల ను రద్దుచేసే ప్రయత్నంగా పరిగణించబడుతున్నాయి. ఒక విధంగా ఈ విధానం రైతు వ్యతిరేకమైనది. చారిత్రాత్మకమైన రైతుల ఆందోళన తర్వాత మూడు సంవత్సరాల క్రితం మూడు వ్యవసాయ చట్టాలు రద్దు చేయబడ్డవి. ఇది వాటిని తిరిగి దొడ్డి దారినతీసుకువచ్చే ప్రయత్నం. 2003లో అప్పటి ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సు చేసిన 12 మార్కెట్ సంస్కరణల ఆధారంగా కేంద్రప్రభుత్వం మార్కెటింగ్ ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించింది. 12 సంస్కరణలు ప్రైవేట్ హోల్‌సేల్ మార్కెట్‌ల ఏర్పాటుకు అనుమతించడం, టోకు వ్యాపారులు, వ్యవ సాయ, ఆహార శుద్ధి పరిశ్రమ, ఎగుమతిదారులు, సూపర్ మార్కెట్లు బడా కార్పొరేషన్లు, పొలం వద్దనే పెద్దమొత్తంలో కొనుగోలు చేయుటకు ఆస్కారం కలుగుతుంది. మార్కెట్ యార్డుల స్థానంలో గిడ్డంగి, శీతల గిడ్డంగులను అనుమతించటం మొదలయినవి వున్నాయి.

**డ్రాఫ్ట్ యొక్క ముఖ్య ప్రతిపాదనలు:**

'వ్యవసాయోత్పత్తుల కోసం ఏకీకృత జాతీయ మార్కెట్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రస్తుతం ఉన్న జిఎస్‌టి ప్యానెల్ మాదిరిగానే రాష్ట్ర వ్యవసాయ మంత్రులతో కూడిన అధికార వ్యవసాయ మార్కెటింగ్ పునర్వ్యవస్థీకరణ కమిటీని ఏర్పాటు చేయుటః 'రైతుమార్కెట్ అనుసంధానాన్ని మెరుగు చేయుట: పెద్ద సంఖ్యలో రైతులకు తోడ్పటుతున్న సంఖ్యలో నిలవ గిడ్డంగులు/కోల్ స్టోరేజీని మార్కెట్ యార్డు ల నుండి ప్రైవేట్ కార్పొరేషన్లకు ఇవ్వటం, eNAM ఎలక్ట్రానిక్ మార్కెట్లను ఏకీకృతం చేయటంః 'వ్యవసాయ ఉత్పత్తులు మరియు ఆహార శుద్ధి కార్యకలాపాలు: వాటిని ప్రోత్సహించండి మరియు పన్నులు/ఫీజుల వసూలును జిఎస్‌టి ప్యానెల్ ద్వార కేంద్రానికి జమ చేయుట. **విలువ గొలుసులు** (Value chains): ప్రైవేట్ రంగ భాగస్వామ్యం తో కృత్రిమ మేధా(AI) సాంకేతికత మొదలైన వాటిని ఉపయోగించి వాల్యూ చైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేయండి. 'ధరకు బీమా : విత్తే సమయంలోనే రైతుల ఆదాయం కోసం ధర బీమా పథకాన్ని ప్రారంభించుట.

'**అగ్రి–ట్రేడ్‌ను సులభం చేయుట:** అన్ని మండీ ప్రక్రియలను డిజిటల్ ఆటోమేషన్, లైసెన్స్‌ల డిజిటల్ జారీ, వ్యాపారు మరియు ప్రధాన ప్రైవేట్ ప్లేయర్‌లకు రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించుట. ముసాయిదా వాణిజ్య సంస్కరణలు రైతులకు లభించే మద్దతు ధరల ను నిరాకరించటానికి, APMC (మార్కెట్ కమిటీలు) మార్కెట్ యార్డులను నాశనం చేయడానికి ఉద్దేశించబడ్డాయి, ఇవి ప్రైవేట్ వ్యాపారుల సిండికేట్ ధరల మాయాజాలం కు ముఖ్యంగా చిన్న రైతులను గురిచేస్తాయి ITC, అదానీ, ఎగుమతిదారులు వంటి టోకు కొనుగోలు కార్పొరేట్ మార్కెట్ ప్లేయర్‌లను తిరిగి పరిచయం చేసే ప్రయత్నం. కొత్త ముసాయిదాలో పేర్కొన్న నిబంధనల ప్రకారం, ఈ ప్రైవేట్ ప్లేయర్‌లు మరియు కార్పొరేషన్‌లు నేరుగా రైతుల నుండి పొలం కల్లాల వద్ద కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా, ఇప్పటి వరకు APMC మార్కెట్ యార్డుల నియంత్రణలో ఉన్న ఉత్పత్తుల గిడ్డంగులు మరియు కోల్డ్ స్టోరేజి యూనిట్‌లను ప్రైవేట్ ప్లేయర్‌లకు అప్పగించడం వల్ల ధరల పతనమైనప్పుడు మరియు ఇతర పరిస్థితులలో నిల్వ సదుపాయం తొలగించ (టొమాటోలు, పండ్లు, ఉల్లిపాయలు) బడుతుంది. వ్యవసాయ గేట్ వద్ద కార్పొరేట్ వ్యాపారులు పెద్దమొత్తంలో కొనుగోలు చేసే నిబంధనలను సులభతరం చేయడంతో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలను (MSP) బేర సారాలు చేసే హక్కు రైతులకు నిరాకరించబడుతుంది. బల్క్ కొనుగోళ్ల వల్ల పెద్ద కార్పొరేట్లు నిత్యావసర వస్తువుల చట్టంతో సంబంధం లేకుండా ఉత్పత్తులను నిలవ చేసుకునేందుకు ప్రోత్సహిస్తుంది. ఇప్ప టికే రిలయన్స్, అదానీ మరియు ఇతరులు సిర్సా, హర్యానా, లూథి యానా పంజాబ్‌లలో భారీ గిడ్డంగులు మరియు ప్రైవేట్ రైలు మార్గా లను కూడా నిర్మించారు. ఈ నిబంధనలు సూపర్ మార్కెట్‌లు, బిగ్ బాస్కెట్ లేదా అమెజాన్ వంటి ఇమార్కెట్ వ్యాపారులు రైతుల నుండి నేరుగా కొనుగోలు చేసేలా ప్రోత్సహిస్తాయి, పంట సమయంలో తక్కువ ధరలు ఉంచడం ద్వారా, రైతులకు పంట ఉత్పత్తులపై MSPలను ఎగవేయడం ద్వారా, తరువాతి నెలల్లో వారు ధరను పెంచుతారు మరియు వినియోగదారులకు చాలా ఎక్కువ ధరలకు విక్రయిస్తారు.

మార్కెట్‌లో టమోటాల విషయంలో మనం చూస్తున్న ట్లుగా ధరల హెచ్చుతగ్గులు మరొక ఉదాహరణ. మార్కెట్‌లో నెల క్రితం రూ.60 ధర ఉండగా, పంట చేతికి వచ్చే సమయానికి మార్కె ట్లలో కిలో ధర ఒక్క రూపాయికి పడిపోయింది.. ఇంతకుముందు ప్రవేశపెట్టిన కేంద్రీకృత eNAM ఎలక్ట్రానిక్ మార్కెట్ APMC మార్కెట్ యార్డులలో MSPల చెల్లింపును నిరాకరిస్తూ జాతీయ బహి రంగ మార్కెట్‌లకు రైతులను బహిర్గతం చేసింది. మార్కెట్ యార్డు లలో సాధారణ వేలం ద్వారా రైతులు ఎంఎస్‌పిల కంటే మెరుగైన ధర లను పొందగలుగుతారు. ENAM మరియు డిజిటల్ మార్కెట్లు మరియు బల్క్ కొనుగోళ్లతో రైతులు కార్పొరేట్ కొనుగోలుదారులచే ధర నిర్దేశాలకు లోబడి ఉంటారు. రైతుల నుండి నేరుగా పెద్దమొత్తంలో కొనుగోళ్లను అందించడం వలన ఎంఎస్‌పిలు చెల్లించడం ద్వారా FCI (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సేకరణ గణనీయంగా తగ్గుతుంది మరియు తద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థకి అవసరమైన ఆహార ధాన్యాల నిల్వల నిర్వహణ ప్రమాదంలో పడుతుంది.దీంతో రైతులు, కార్మికులు, సామాన్యులు ఇద్దరూ ఆహార పదార్థాలపై అధిక ధరలు చెల్లించాల్సి వస్తుంది. వ్యవసాయ మార్కెటింగ్ అనేది రాజ్యాంగం లోని ఆర్టికల్ 246 ప్రకారం VII షెడ్యూల్ యొక్క జాబితా IIలోని ఎంట్రీ 28 కింద రాష్ట్ర విషయం.





ప్రభుత్వ మద్దతు ఉన్న APMC మార్కెట్ యార్డుల పాత్ర తగ్గిపోవడం మరియు eNAM మరియు ఇతర డిజిటల్ ఎలక్ట్రానిక్ మార్కెట్‌ల ద్వారా మండి వద్ద అన్ని పన్నుల సేకరణ GST మాదిరిగానే సెంట్రల్ పూల్‌కి నేరుగా పన్నులను వసూలు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి వీలు కల్పిస్తుంది. జిఎస్‌టిని ప్రవేశపెట్టడంతో రాష్ట్రాలు అధిక ఆదాయ వనరులను ఎలా కోల్పోయాయో, ఆర్థిక సహాయం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఆధార పడేటట్లు ఎలా చేశాయో మనకు ఇప్పటికే తెలుసు. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర సబ్జెక్ట్ అయినందున ఇది రాష్ట్ర ప్రభుత్వాలను ఆర్థికంగా బలహీనపరిచే, సమాఖ్య వ్యవస్థ యొక్క స్పష్టమైన ఉల్లం ఘన. మూడు సంవత్సరాల క్రితం దేశవ్యాప్తంగా రైతులు ఢిల్లీ సరిహ ద్దుల్లో 13 నెలల పాటు చారిత్రాత్మకమైన మిలిటెంట్ పోరాటం చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టాలని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారు. రైతులు, కార్మికులు ఇద్దరూ తమ ఉమ్మడి వర్గ శత్రువైన కార్పొరేట్‌కు వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు చేస్తు న్నారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తులను గ్యారెంటీ ధర చట్టపరమైన కొనుగోలు, ఇతర వాగ్దానాలను అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రతిపాదిత ముసాయిదా వ్యవసాయ మార్కెట్ ఫ్రేమ్ వర్క్ అంతకు ముందు తిరస్కరించబడిన మూడు వ్యవసాయ చట్టాలను తీసుకురావడం; మార్కెట్లు, నిల్వ, పంపిణీ రంగాలను పూర్తిగా కొంతమంది కార్పొరేట్స్‌కు అప్పగించే ప్రయత్నం తప్ప మరొకటి కాదు.

రైతులు ఈ ప్రభుత్వ విధానాల గురించి తెలుసుకోవాలి; ఇన్‌పుట్ సరఫరా, మార్కెటింగ్, నిల్వ మరియు సరఫరా విలువ గొలుసు పంపిణీని కొన్ని పెద్ద సంస్థల నుండి నియంత్రించడానికి తిరిగి పోరాడాలి.

# ఆది పురుష్, అంటే దేవుడనే రాముడేనా? ఎలా?



డాక్టర్ దేవరాజు మహారాజు

రామాయణ కావ్యంలో కథానాయకుడు రాముడు. రాముడు కల్పిత పాత్రే అయినా, ఆ కావ్యం రాయబడ్డ కాలం నాటికి లక్షల సంవత్సరాలుగా ఆది మానవ జాతులు ప్రపంచ వ్యాప్తంగా జీవిస్తున్నాయి. అలాంటప్పుడు రాముడు ఆది పురుషుడు ఎలా అవుతాడూ? జీవ పరిణామ రీత్యా రాముడు ఆది పురుషుడు కాదు. అది ఒక భావన అనుకుంటే — ఆ భావనకు స్ఫూర్తి నిచ్చిన గౌతమ బుద్ధుడు ఏం కావాలి? ఖుషీ నగర్ లో పవళించి ఉన్న బుద్ధ విగ్రహ స్ఫూర్తితోనే కదా వైదికులు పాలకడలిలో విష్ణు మూర్తికి రూపకల్పన చేసుకున్నారూ? విష్ణు మూర్తి అవతారాలలో ఒకటిగా చెప్పబడే రామావతారం ఏడవది! మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ అవతారాల్ని తీసేద్దాం. అవి పూర్తి మానవ రూపం దాల్చినవి కావు. మరి వామన, పరుశురామ అవతారాలు పూర్తి మానవ రూపాలే కదా? ఆ పురాణాల ప్రకారం చూసినా కూడా రాముడు ఆది పురుషుడు కాడు. సైన్సు ప్రకారం అసలే నిలవడు. ఎందుకంటే సృష్టి వాదాన్ని, అవతార వాదాన్ని సైన్సు ఒప్పుకోదు — ఇక కొన్నేళ్ళ క్రితం రాముడిపై వచ్చిన వాస్తవ సినిమా గూర్చి చూద్దాం!ఇటీవల విడుదలైన సోది పురుష్ గురించి కాదిది —

రామాయణ కావ్యాన్ని ఆధారం చేసుకుని చాలా చలన చిత్రాలు వచ్చాయి. మళయాళ దర్శకుడు జి.అరవిందన్ 'కాంచన సీత'లో రామాయణ కావ్యాన్ని ఒక కొత్త దృక్పథంతో దర్శించాడు. ప్రఖ్యాత మళయాళ రచయిత సి.ఎన్.శ్రీకాంతన్నాయర్ వాల్మీ కి రామాయణంలోని ఉత్తరకాండతో ప్రభావితుడై రాసిన ఒకానొక నాటికే — మళయాళ చిత్రం 'కాంచన సీత' గా రూపొందించబడింది. ఈ సినిమా పేరు రాముడు అశ్వమేధ యాగంలో తన పక్కన నిలుపుకున్న బంగారు సీత ప్రతిరూపాన్ని సూచిస్తుంది. ఈ యాగంలో అశ్వాన్ని అగ్ని దేవుడికి త్యాగం చేయడం ఒక ఆచారం. సతీసమేతంగా చేయాల్సిన ఈ యాగం చక్రవర్తి ప్రాభవానికి చిహ్నం. రాముడు అప్పటికే పన్నెండు సంవత్సరాలుగా సతీవియోగంలో ఉన్నాడు. అందువల్ల సీతకు బదులుగా సీత ప్రతి రూపాన్ని పక్కన పెట్టుకుని యాగం కొనసాగించవచ్చని కులగురువు వశిష్ఠుడు సలహా ఇస్తాడు. చిత్రానికి శ్రీకాంతన్నాయర్ నాటిక ఆధారమైనప్పటికీ, ఇది దానికి భిన్నంగా రూపొందించబడింది. చిత్రంలో సీత పాత్ర కనిపించదు. అనంతమైన 'ప్రకృతి' సీతగా చిత్రీకరించబడింది. సీత మనః ప్రవృత్తిని, వేర్వేరు మానసిక స్థితులను ప్రకృతిలోని వేర్వేరు ఆకృతుల ద్వారా చూపించడం జరిగింది. రామలక్ష్మణులు శంభూకుడిని చంపేందుకు వెళుతున్నప్పుడు చిత్రం ప్రారంభమౌతుంది. శంభుకుడి భార్య ప్రాధేయపడడంవల్ల వాళ్ళు అతణ్ణి క్షమిస్తారు. రామలక్ష్మణులు తిరిగి అయోధ్య చేరుకుంటారు. అంతకు ముందే రామలక్ష్మణులు ప్రయాణించి వచ్చిన దండకారణ్యంలో సీత ఉంది. అయినా వీరు ఆమెను అక్కడే వదిలేసి వచ్చారని ఊర్మిళ నిందిస్తుంది. అందుకు రాముడు 'సీత భర్త — కేవలం అయోధ్య ప్రజల సేవకుడు మాత్రమే' — అని వివరణ ఇచ్చుకుంటాడు. ఆ మరునాడే అశ్వమేధ యాగం ప్రారంభించమని చెప్పడానికి వశిష్ఠుడు వస్తాడు. కానీ, అర్ధాంగి పక్కన లేనిది యాగం జరపడానికి వీలు లేనందువల్ల — రెండవ వివాహం చేసుకుంటే వీలవుతుందని సలహా ఇస్తాడు. ఈ విషయంలో రాముడు కోపోద్రిక్తుడవుతాడు. ఇంతలో పన్నెండేళ్ళ క్రితం అయోధ్యను వదిలి వెళ్ళిన భరతుడు తిరిగివస్తాడు. సీత లేకుండా యాగం చేయడాన్ని తీవ్రం గా నిరసిస్తాడు. వాదోపవాదాలు మితిమీరి యుద్ధానికి సిద్ధమవుతారు. అప్పుడు ప్రకృతి మధ్యవర్తి అవుతుంది. ఆకాశం తెరుచుకొని భోరుమని కురిసిన వర్షం — వారిద్దరినీ చల్లబరుస్తుంది. యాగాశ్వంతో లక్ష్మణుడు బయలుదేరుతాడు. యాగం మొదలవుతుంది. తిరిగితిరిగి యాగాశ్వం వాల్మికి ఆశ్రమంలో ప్రవేశిస్తుంది. అక్కడ రాముని కుమారులైన లవకుశులు పెరుగుతుంటారు. తను చూసిన దానికి విస్మయానందంలో మునిగిపోయిన వాల్మికి ఉత్తర రామచరిత రాయడానికి ఉపక్రమిస్తాడు. అశ్వాన్ని మళ్ళీ ఆయోధ్యకు తీసుకుపోతారు.

చేయవల్సిన ఆచారం కర్మ కాండ ప్రకారం, యాగం రెండో భాగం మొదలవుతుంది. అదే సమయానికి మళ్ళీ శంభుకుడు విజృంభించాడని సంహరించేందుకు లక్ష్మణుడు వెళ్ళాడని వార్త అందుతుంది. అదే సమయానికి లవకుశులతో వాల్మీకి అక్కడికి చేరుకుంటారు. వాల్మికి యజ్ఞశాలలోకి ప్రవేశించడాన్ని వశిష్టుడు అభ్యంతరం తెలియజేస్తాడు. అతణ్ణి బహిష్కరిస్తాడు. కానీ, రాముడు లవకుశులను తన కుమారులుగా గుర్తించి హృదయానికి హత్తుకుంటాడు. అప్పుడు సీత పొందిన ఆనందం శోభాయమానమైన ప్రకృతి ద్వారా వ్యక్తీకరించబడుతుంది. రాముని మహా ప్రస్థానం చిత్రీకరించడంతో చలనచిత్రం ముగుస్తుంది. రాముడు సరయూ నదిలో మునిగి, సీతతో అంటే — ప్రకృతితో ఐక్యమైపోతాడు.

రాముడు దేవుడనే అభిప్రాయం సన్నగిల్లి — ఈ చిత్రం ద్వారా అతడు ఒక ఆదిమానవుడు అనే అభిప్రాయం బలపడుతుంది! హర్మ్యాలు, ఆభరణాలు, పరిచారికలు వగైరా లేకుండానే రాజసానికి ఒక కొత్తరూపును సంతరించాడు దర్శకుడు. చిత్రకళ, సంగీతం, దర్శకత్వ శాఖలలో సాధికారికంగా కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి గోవిందన్ అరవిందన్. (1935–1991) యాభై యారేళ్ళలోనే ఆయన జీవితం అకస్మాత్తు గా ముగిసిపోయింది. భారతీయ చలన చిత్రరంగం ఒక అత్యంత ప్రతిభాశాలిని పోగొట్టుకుంది. సత్యజిత్ రే తర్వాత ఎవరూ? అనే ప్రశ్న వచ్చినపుడు చాలా మంది విమర్శకులు అరవిందనా పేరు సూచించారు. నిజానికి మళయాళంలోనే ఆదూర్ ఉన్నాడు. బుద్ధదేవ్, శ్యామ్ బెనెగల్, మణికౌల్ వంటివారు ఎందరో ఉన్నారు. వారందరిలో లేనిది అరవిందన్ చేసిన కృషిలో ఏముంది? అంటే, వైవిధ్యం గల సినిమాలు ఎక్కువ సంఖ్య లో తీశాడు.

అరవిందన్‌కు మన తెలంగాణా ప్రాంతానికీ కొంత సంబంధం ఉంది. ఆయన 'కాంచన సీత' తీసింది భద్రాచలం పరిసర ప్రాంతాల్లోనే గోదావరి నదీ తీరంలో. సికింద్రాబాదు రైలు బోగీలో కుంభమేళాకుపోతున్న ఒక సాధువును, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక మైదానంలో గుడిసె వేసుకుని ఉన్న ఇద్దరు కోయ సోదరులను, విజయవాడ లాడ్జిలో పట్టుబడ్డ ఒక అమ్మాయిని 'కాంచన సీత' పాత్రధారులుగా ఎన్నుకున్నాడు. ఆ రోజుల్లో తెలుగు పత్రికలు వీటిని కథనాలుగా ప్రకటించాయి. ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిందేమంటే, సినిమా రంగానికి ఏమాత్రం సంబంధంలేని వ్యక్తుల్ని ఎన్నుకుని సినిమా తీయడమే సాహసం. అదే సినిమాతో ఇక జాతీయ బహుమతి సాధించడమంటే ఏమనాలి? సినిమా మాధ్యమంపై ఎంత అవగాహన, ఎంత ఆత్మస్థైర్యం, ఎంత చొరవ, ఎంత విశ్లేషణా సామర్థ్యం ఉంటేనో గాని — విజయం ఆ స్థాయిలో సాధించలేడు కదా? ''గొప్ప ప్రకృతి సౌందర్యం గల కేరళను వదిలి, ఈ తెలంగాణా బీడు భూముల్లో ఏం ఉందని వచ్చారూ?''— అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఆయన చెప్పిన సమాధానం ఆశ్చర్యాన్ని కలిగించింది.

అరవిందన్ ఉత్తరాయణం, కాంచన సీత, కుమ్మట్టి, పొక్కువేయిల్, ఒరిదత్, చిదంబరం వంటి సినిమాలు; ఎస్తప్పన్, ఉన్ని, వాస్తుహార, థంపూ వంటి చిత్రాల ప్రదర్శనలు అనేకచోట్ల జరుగుతూనే ఉంటాయి. ఆయన సినిమాల మీద చర్చలు పత్రికలలో, సెమినార్లలో కొనసాగుతూనే ఉంటాయి. కానీ, బాధల్లా ఒకటే. కొత్తవేవీ రాకుండా పోయాయి కదా అని! ప్రవాహం ఆగిపోయిందన్న బాధ. సృజనాత్మకత అనే ఒక విద్యుత్ అకస్మాత్తుగా ఆగిపోయిందన్న తల్లడింపు. యాభై ఆరేళ్ళకే ప్రపంచదర్శకుల స్థాయి నందుకున్న ఈ సృజనశీలి మరి కొంతకాలం బతికి ఉంటే, మరిన్ని 'మాస్టర్ పీసెస్' భారతీయ చిత్రసీమకు అందేవి.

హైదరాబాదు సారధి స్టూడియోలో ఆయన సినిమా 'ఒరిదత్' ప్రదర్శించినప్పుడు ఆయన అక్కడికి వచ్చారు (1989). దేశంలోని గొప్ప సినీ దర్శకులలో తాను ఒకడినన్న అహంభావం గానీ గర్వంగానీ లేవు. ఎత్తయిన విగ్రహం. కానీ చాలా సిగ్గుపడుతూ వినయంగా మాట్లాడాడు. ఆయన పత్రికల్లో నిర్వహించిన కార్టూన్ శీర్షిక ''చిన్న మనిషి–పెద్ద ప్రపంచం''— ఆయనపట్ల అక్షరాలా నిజం! ''మీలోని పెద్ద ప్రపంచం మీ సినిమాల్లో ప్రతిఫలిస్తుంది. మేం ఇంకా ఆశిస్తున్నాం''— అని ఇంగ్లీషులో నేను చెప్పినపుడు, చిన్న పిల్లాడిలా వంకర్లు తిరిగిపోయి, ''థాంక్యూ ఫర్ ద ఎక్స్‌పెక్టేషన్స్'' అంటూ సగానికి వంగి నాతో చేయి కలిపాడు. ఆ పూట మరోరకంగా కూడా అనిపించింది. నేనొక చిన్న మనిషినైతే — నేను కలిసిన పెద్ద ప్రపంచం — అరవిందన్ అని!!

**కేంద్ర సాహిత్య అకాడెమీ విజేత,**
**జీవశాస్త్రవేత్త.**

# వలసదారుల హక్కులకు గౌరవం

విశ్వవ్యాప్తంగా అధిక సంఖ్యలో పెరుగుతున్న వలసలను పరిశీలించి ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ, 1990 డిసెంబర్ 18న జరిగిన సమావేశంలో 'వలసకార్మికులు, వారి కుటుంబ సభ్యుల హక్కుల రక్షణ' గురించి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ప్రపంచవ్యాప్తంగా వలస వెళ్తున్న పౌరులందరి కోసం డిసెంబర్ 18ని అంతర్జాతీయ వలసదారుల దినోత్సవంగా ప్రకటించింది. ఆనాటి నుండి ప్రతి సంవత్సరం 'డిసెంబర్ 18 అంతర్జాతీయ వలస దారుల దినోత్సవం'గా జరుపుకుంటున్నారు.

వలస అంటే...... బతుకుదెరువు కోసం, లేదా ఆర్థికాభివృద్ధి కొరకు చేసుకునే 'నివాస మార్పు' గా భావించవచ్చు. వలసల వల్ల ఆటంకాలు ఎదురైన కూడా అభివృద్ధి, మానవ వికాసం జరిగే అవకాశం ఉంది. ప్రజలు వలసలతో పలు అవకాశాలను పొందగలుగుతున్నప్పటికీ కష్టాలను కూడా ఎదుర్కోవలసి వస్తుంది. వలసలు లేకుండా ప్రపంచ అభివృద్ధి లేదేమో అనిపిస్తుంది.

వలసలకు ఎన్నో కారణాలు ఉన్నాయి. వలస అనేది, వెళ్లేలా 'నెట్టివేయబడే' పరిస్థితులు కొన్నైతే, వున్నచోట పరిస్థితులు అనుకూలంగా లేక మరొక చోట 'ఆకర్షణీయంగా' ఉండడం మరొక కారణం. పేదరికం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు ఒక కారణమైతే, అధిక వేతనాలు, మెరుగైన జీవనం, ఇతర ప్రాంతంలోని అనుకూల పరిస్థితులు వలస వెళ్ళడానికి మరొక కారణంగా చెప్పవచ్చు. పనికోసం, బతుకుదెరువుకోసం పల్లెల నుంచి పట్టణాలకు, నగరాలకు గానీ, ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికిగానీ వలస వెళ్లడాన్ని 'అంతర్గత వలసలు' అంటారు. ఒకదేశం నుంచి మరొకదేశానికి వెళ్లడాన్ని 'అంతర్జాతీయ వలసలు' అంటారు. ఉన్న ఊర్లో ఉపాధి కరువై బతుకుదెరువుకోసం వేరే ప్రాంతాలకు, దేశాలకు వెళ్లేవారు కొందరు, మరింత మెరుగైన జీవితం కోసం, అధిక సంపాద న కోసం వెళ్లేవారు మరికొందరు. కొన్ని మిలియన్ల వలసదారులు చేసిన సహకారాన్ని గుర్తుంచుకొని వారిని గౌరవించుకోవలసిన అవసరం ఉంది.

వలసదారుల వల్ల సమాజానికి కలిగే ప్రయోజనం ప్రజలకు తెలిస్తే, వలసదారులను గౌరవిస్తూ వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడవచ్చు.

2011జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో స్వస్థలాల నుంచి వేరేచోటికి తరలివెళ్లే వారి సంఖ్య 45.5 కోట్లు. ఇది క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ప్రతి సంవత్సరం దాదాపు కోటి 40 లక్షలమంది ఒక చోటు నుండి మరో చోటుకు వలస వెళుతున్నారని లెక్కలు తెలుపుతున్నాయి. 1979లో అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం వచ్చింది. వేతనాలు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, పని పరిస్థితులు మెరుగుపరచడం, శ్రమ దోపిడీని నిరోధించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. చట్టం ఉన్నప్పటికీ అమలు అనేది పగడ్బందిగా జరగాలి కదా.

ప్రపంచవ్యాప్తంగా 130కి పైగా దేశాలలో మూడుకోట్ల మంది ప్రవాస భారతీయులు, భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారని ఒక అంచనా. తెలంగాణ ప్రాంతం నుంచి 1970లో వలసలు ప్రారంభమయ్యాయి. అప్పుడే గల్ఫ్ దేశాల్లో పెట్రోల్ నిల్వలు బయటపడటంతో అక్కడ కూలీల అవసరం ఏర్పడింది. ఇక్కడ బతుకు దెరువులేని రైతులకు, వ్యవసాయ కూలీలకు అక్కడ మంచి అవకాశం దొరికింది.

తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులు తమ కుటుంబాల ఆర్థికపరిస్తితి మెరుగయ్యేలా చూస్తున్నారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల జైలు పాలవుచున్న వారిని అదుకోవడంలో ఇంకా ముందుండాలి. ప్రమాదవశాత్తు మరణించిన వలసదారుని మృత దేహం సొంత గ్రామానికి చేర్చడం అనేది ఇప్పుడు కష్టంగా ఉంది. కుటుంబాన్ని వదిలి పొట్టకూటి కోసం వెళ్లిన వలస కార్మికులకు అక్కడి ప్రభుత్వాలు మరియు ఇక్కడి ప్రభుత్వాలు అండగా ఉండి జరగరాని ఘోరం ఏదైనా జరిగితే వెంటనే తగు చర్యలు తీసుకొని లబ్ధి చేయవలసిన బాధ్యత ఇరు దేశాల ప్రభుత్వాలపై ఉంది.

నేడు గ్రామాలను దాటి ఒక జిల్లానుండి మరొక జిల్లా కు, ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రం నకు వలస పోవడం అనేది సర్వసాధారణం అయిందని మనం చూస్తున్నాము. ఇప్పటి అత్యాధునిక కంప్యూటర్ యుగంలో ఒక దేశం నుండి మరో దేశానికి వలసవెళ్లడం అనేది అతి సాధారణం అయిపోయింది. ఒకప్పుడు ప్రవాసులుగా ఉండడం అనేది ఒక హోదాగా భావించేవారు. ఇప్పుడున్న పరిస్థితులలో విదేశాలు వెళ్ళిరావడం అనేది పక్క ఊరికి వెళ్లినంత సులభం అయింది. ఈ మధ్య చదువుల కోసం, కొలువుల కోసం విదేశాల్లో స్థిర నివాసం ఏర్పరచుకుంటున్నారు. కొన్ని దేశాల చట్టాలు కూడా వలస కార్మికులకు బాసట గా నిలవడం వల్ల ఇతర దేశాలకు వెళ్లడం సులభం అయింది. ఐక్యరాజ్య సమితి 1990,డిసెంబర్ 18 న 'అంతర్జాతీయ వలస దారుల హక్కులను' పరిరక్షించడానికి ఒక ఒడంబడికను చేకూర్చింది. విదేశాల్లో గత ఇరవై సంవత్సరాలుగా ముఖ్యంగా కంప్యూటర్‌రంగంలో భారతీయులకు ఎక్కువ అవకాశాలు అందుచున్న విషయాన్ని గుర్తించిన యువత ఆ వైపుగా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఇతర దేశాలలో స్థిరపడి మరికొందరిని అక్కడికి రప్పించుకుంటున్నారు.

మొదట్లో వైద్యం, విద్య, పరిశోధనారంగాల్లోని నిష్ణాతులు మాత్రమే వలసవెళ్ళేవారు. కానీ తదనంతరం ప్రారంభమైన కంప్యూటర్‌రంగ అభివృద్ధి, కంప్యూటర్ నిపుణల తో వలసలు ఎన్నోరెట్లు పెరిగాయి. దానితోపా టు ఆదాయం పెరిగింది. ప్రవాసులుగా వెళ్లినవారు ఇప్పుడిప్పుడే వ్యాపారరంగంలో రాణిస్తున్నారు. రాజకీయరంగంలో కూడా కొంతమంది అడుగుపెట్టి విజయాలు సాధించిన సందర్భాన్ని మనం గుర్తించవచ్చు. తమ ఉనికిని కాపాడుకుంటూ, మాతృదేశంపై మమకారం చూపుతూ మరెందరికో సహకారాన్ని అందిస్తున్న.... ఏ దేశమేగినా ఎందుకాలిడిన పొగడరా నీ తల్లి భూమి భారతిని... అనే మాటను నిజం చేయాల్సిన బాధ్యత కూడా ప్రవాసుల మీద వుంది.



గడప రఘు పతిరావు
9963499282

# ఖచ్చితమైన చికిత్సలేని 'ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్'!

ప్రముఖ తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ మరణానికి కారణమైన వ్యాధి పేరు Idiopathic Pulmonary Fibrosis (IPF). అంటే కారణం తెలియని వ్యాధులు. సైన్స్ ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ కారణం తెలియని వ్యాధులు ఎన్నో ఉన్నాయి. కారణం తెలియనపుడు చికిత్స చాలా కష్టం. IPF వ్యాధిలో ఊపిరితిత్తుల గోడలు మందబడుతాయి. కణజాలాలు అల్లుకుపోయి బిగువుగా మారుతాయి. దీనివల్ల శ్వాసక్రియ చాలా కష్టం అవుతుంది. శ్వాసక్రియ మందగించడం వల్ల శరీరానికి సరిపడా ఆక్సిజన్ లభించదు. ఆక్సిజన్ సరిపడా అందక శరీరంలో వివిధ అవయవాలు తమ విధులు నిర్వర్తించలేవు. ఈ వ్యాధి లక్షలో 20 మందికి వస్తుంది. ఈ వ్యాధిని గుర్తించడం చాలా కష్టం. లక్షణాలు కనిపించినప్పటి నుండి వ్యాధిని గుర్తించేందుకు ఒకటి నుండి మూడు సంవత్సరాలు పడుతుంది. టిబి మరియు IPF లక్షణాలు ఒకేలా ఉండటం వల్ల దీనిని గుర్తించడం కష్టం. సాధారణంగా 60 సంవత్సరాలు పైబడిన వారిలో ఈ వ్యాధి వస్తుంది.

**లక్షణాలుః**

1. శ్వాసలో ఇబ్బంది 2. పొడి దగ్గు
3. ఆయాసం 4. ఆకస్మికంగా బరువు కోల్పోవడం
5. కండరాలు మరియు కీళ్ళ నొప్పులు
6. చేతి మరియు కాలి వేళ్ళు గుండ్రంగా మారడం

ఈ లక్షణాలు క్రమేణా పెరిగి శ్వాస తీసుకోవడం చాలా కష్టం అవుతుంది. చివరికి ప్రాణాంతకంగా మారుతుంది. జన్యుపరమైన లేదా పర్యావరణ కాలుష్యం వల్ల ఈ వ్యాధి వస్తుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ కేసులు పెరుగడం గమనార్హం.

వివిధ రకాల ఔషధాలు ప్రయోగాత్మకంగా వాడుతున్నప్పటికి ఖచ్చితమైన చికిత్సా విధానం అందుబాటులో లేదు. ఆరోగ్యకరమైన జీవన విధానం పాటించడం, పోషక ఆహారం, కాలుష్యం లేని ప్రాంతాల్లో ఉండటం ద్వారా జీవితకాలాన్ని పెంచుకోవచ్చు

డాక్టర్ అనుమాండ్ల వేణు గోపాల రెడ్డి
9948106198

## వ్యసనాలకు బానిసై తల్లిని హత్యచేసిన తనయుడు..?

### వివాహిత హత్యపై అనుమానాలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వివాహిత హత్య పలు అనుమానాలకు దారితీస్తుంది. కన్న కొడుకే గొంతు నులిమి హత్య చేసి దొంగలు బంగారం కోసం హత్య చేసినట్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడన్న ప్రచారం జరుగుతుంది. వివరాల్లోకి వెళితే... ఖమ్మం నగరం ఖానాపురం ప్రాంతంలో కొప్పెర లక్ష్మి నారాయణ వాణి (45) దంపతులు నివసిస్తున్నారు. వీరికి శ్రీనాథ్, గోపీనాథ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మి నారాయణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. గోపీనాథ్ కొంత కాలంగా వ్యసనాలకు బానిసై తిరుగుతుండేవాడు. మంగళవారం ఉదయం తల్లితో ఘర్షణ పడ్డాడు. ఘర్షణ పడిన కొంత సేపటికి తల్లి వాణి మృతి చెందింది. ఇంటిలో నుంచి ఎటువంటి కదలికలు లేకపోవడంతో చుట్టు పక్కల వారు వచ్చి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వాణి మృతికి కుమారుడు గోపీనాథ్ కారణమని ఉదయం తల్లి, కొడుకు ఘర్షణ పడ్డారని స్థానికులు తెలిపారు.ఇదిలా ఉండగా వాణి హత్యను దొంగలు చేసినట్లుగా చిత్రీకరించేందుకు ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు, చెవి దిద్దులను కుమారుడు తీసుకున్నాడని స్థానికులు అంటున్నారు. గోపీనాథ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు గోపీనాథ్ హత్య చేశాడని చెబుతున్నప్పటికీ స్థానిక పోలీసులు పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు. పెద్ద కుమారుడు శ్రీనాథ్, భర్త లక్ష్మి నారాయణ, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వాణి చుట్టు పక్కల వారితో ఎంతో స్నేహంగా ఉండేదని చెబుతూ చుట్టు పక్కల వారు విలపిస్తున్నారు. మృతదేహాన్ని పంచనామ నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రభుత్వ వైఖరికి నిరసనగా బిఆర్ఎస్ ఆందోళన

### అంబేడ్కర్ విగ్రహానికి వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతుల పట్ల కక్ష సాధింపులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పిలుపు మేరకు మంగళవారం బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఏ సండ్ర వెంకట వీరయ్య, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు మాట్లాడుతూ గిరిజన రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని వారు తీవ్రంగా ఖండించారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించారని వారు ఆరోపించారు. రైతులకు బేడీలు వేసి వారి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరిస్తుందన్నారు. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తి వేసి వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని మార్చుకోకపోతే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో గిరిజన రైతుల పక్షాన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాదె అమృతమ్మ, మగ్బూల్, పల్లా రోజ్‌లీనా,వీరునాయక్, గుత్తా రవి, బిచ్చాల తిరుమలరావు, డోకుపర్తి సుబ్బారావు, ,పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 20న 'దుబాయ్‌డెలివరీ బాయ్స్' ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దుబాయ్ (యుఏఈ)లో డెలివరీ బాయ్స్‌గా పనిచేయుటకు బైక్ రైడర్స్ కోసం ఈనెల 20న హైదరాబాద్ లోని విజయనగర్ కాలనీలోని మల్లేపల్లి ఐటిఐ క్యాంపస్‌లో టాం కాం ద్వారా నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తి, అర్హత గల వారు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ , కార్మాగారాల శాఖ క్రింద నమోదు చేయబడిన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ టాం కాం అని దీని ద్వారా తెలంగాణ నుండి అర్హత, నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగాలు కల్పించేందుకు విదేశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ రిజిస్టర్డ్ ఏజెన్సీలతో భాగస్వామ్యం కుదుర్చుకుందని ఆమె తెలిపారు. 21 నుండి 38 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణులై మూడేళ్ల పాత డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఇంటర్వ్యూకు ఒరిజినల్ పాస్ పోర్టు తప్పనిసరిగా తీసుకు రావాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 9440050951, 9440049861, 9440051452 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

## మాజీ హోంగార్డు చారిపై ఛీటింగ్ కేసు నమోదు

**ప్రజాపక్షం/మణుగూరురూరల్:** మణుగూరు రూరల్ ప్రాంతానికి చెందిన మాజీ హోంగార్డు కట్కోజుల శ్రీనివాస చారి పై చీటింగ్ కేసు నమోదైంది. ఈ సందర్భంగా మణుగూరు సిఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దళిత బంధు ఇప్పిస్తానని మణుగూరు సమితి సింగారంకు చెందిన మద్దూరి నవీన్ కుమార్ వద్ద 80 వేల రూపాయలు లంచం తీసుకున్నాడని ఆరోపణ రుజువు కావడంతో అతనిపై సోమవారం రాత్రి చీటింగ్ కేసు నమోదు చేయడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుడు నవీన్ డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే రేపు మాపు అని చెబుతూ కాలయాపన చేయడంతో మద్దూరి నవీన్ కుమార్ పోలీసులకు దరఖాస్తు చేసుకోవడంతో చారి పై చీటింగ్ కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు.

## ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో సిపి తనిఖీ



**ప్రజాపక్షం/ముదిగొండ:** ముదిగొండ పోలీస్ స్టేషన్ ను మంగళవారం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. ఆ తరువాత ఆయన పోలీసులు పనితీరు, జనరల్ డైరీ రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో నమోదు అయిన కేసులు, సెక్టార్ అధికారులు విచారణ నివేదికల గురించి సిబ్బంది తో మాట్లాడారు. అనంతరం డిసి షీట్, డయల్ 100 కాల్స్ ప్రతి స్పందన తదితర అంశాలను చర్చించారు. కాగా స్టేషన్ ను ఆహ్లాదకరమైన వాతావరణం తో పాటు పలు నూతన హంగులు తో తీర్చి దిద్దిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ వడ్డేపల్లి మురళి ని అభినందించారు. క్రైమ్ రేట్, రికార్డులను పరిశీలించి నేరాలు నియంత్రణ కు తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అదే విధంగా ఫిర్యాదులు పెండింగ్ లో లేకుండా ఎప్పటి కప్పుడు తగు చర్యలు తీసుకోవాలని సిఐ వడ్డేపల్లి మురళి కి సిపి సునీల్ దత్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతి రెడ్డి, ఎస్ఐలు నరేష్, అనంత రాములు పాల్గొన్నారు.

# ఎలుక కాటుకు గురై విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

### సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ తీరుపై తీవ్ర విమర్శలు

### మమతలో వైద్య చికిత్స ...

### ఉచితంగా అందిస్తామని పువ్వాడ ప్రకటన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక పక్క విమర్శల వర్షం కురుస్తున్నప్పటికీ దానిని సరిదిద్దే ప్రయత్నంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. పదే పదే వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదు. ఒకే విద్యార్థిని ఎలుక వరుసగా కరవడం, ఎలుక కరిచిన ప్రతిసారి యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ ఇవ్వడం కారణంగా విద్యార్థినికి కాళ్లు చచ్చుపడిపోయి తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ఖమ్మంలో చోటు చేసుకుంది. ఖమ్మం దానవాయి గూడెం గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న లక్ష్మి భవాని కీర్తికి ఇప్పటికీ 10 సార్లు ఎలుక కరిచింది. ఎలుక కరిచిన ప్రతిసారి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లడం వారు యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ ఇవ్వడం జరిగింది. వరుసగా వ్యాక్సిన్ ఇవ్వడంతో అది తీవ్ర అనారోగ్యానికి దారి తీసింది. తండ్రి లేని లక్ష్మి భవాని కీర్తిని నవంబర్ లో తల్లి వరుస ఎలుక కాటుకు గురవ్వడంతో ఇంటికి తీసుకెళ్లింది. కొద్ది రోజుల తర్వాత లక్ష్మి భవాని కీర్తి కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని స్థితికి చేరుకోవడ ంతో మమత జనరల్ ఆసుపత్రికి తీసుకు వచ్చింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూడడంతో రాజకీయ పా ర్టీలు, విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. ప్రజాప్రతినిధు లు సైతం తీవ్రంగానే స్పందించారు. వరుసగా ఎలుకలు విద్యార్థులను కరుస్తున్నా ఎందుకు ఎలుకల నివారణ చ ర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు అధికారులవద్దసమాధానం లేదు.

**ఉంటే ఉండు లేకుంటే టిసి తీసుకుని పో :**

దానవాయిగూడెం గురుకుల పాఠశాలలో కోతులు, కుక్కలతో పాటు ఎలుకలు కూడా విద్యార్థినిలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. మార్చి నుంచి నవంబర్ వరకు పలుమార్లు లక్ష్మి భవాని కీర్తిని ఎలుకలు కరిచాయి. ఎలుక కరిచిందని చెప్పిన ప్రతిసారి ఉంటే ఉండు లేకుంటే టిసి తీసుకుని పో అంటూ పాఠశాల సిబ్బంది బెదిరించే వారని చికిత్స పొందుతున్న లక్ష్మి భవాని తెలిపింది. మార్చి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ ఇచ్చారని దాని కారణంగా క్రమేపి స్పర్శ కోల్పోయి కాళ్లు బలహీన పడ్డాయని ఆమె తెలిపింది. తల్లి బిందు కుమార్తెకు జరిగిన అనారోగ్యం పట్ల తీవ్ర ఆవేదనకు గురైంది. ఇండ్లలో పని చేసుకుంటూ జీవించే బిందు కుమార్తె అనారోగ్యానికి గురవ్వడంతో తీవ్రంగా విలపిస్తుంది.

**ఉచిత వైద్యం :**

లక్ష్మి భవాని కీర్తికి మమత ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్యాన్ని అందించనున్న ట్లు మాజీ మంత్రి, మమత ఛైర్మన్ పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. సం క్షేమ హాస్టళ్ల విద్యార్థుల పట్ల ప్రభుత్వ వైఖరి సరైంది కాదన్నారు. వరుసగా సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. లక్ష్మి భవాని కీర్తి కోలుకునేంత వరకు మమత ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్యాన్ని అందిస్తామని ఆయన తెలిపారు.



**ప్రభుత్వానిదే బాధ్యత : ఎంపి వద్దిరాజు**

ఖమ్మంలోని బిసి గురుకుల పాఠశాల విద్యార్థిని లక్ష్మి భవాని కీర్తి అనారోగ్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. లక్ష్మి భవాని కీర్తి హాస్టల్‌లో ఉంటూ ఎలుక కాటుకు గురై తీవ్ర అనారోగ్యం పాలైందని తెలిసిన వెంటనే ఆయన తీవ్రంగా స్పందించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమెను హైదరాబాద్ తరలించి మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఏడాది కాలంగా సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సరైన ఆహారం, సౌకర్యాలు లేవని వద్దిరాజు తెలిపారు. సౌకర్యాలు కల్పించాలని అడిగితే విపక్షాలను తప్పుబడుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థుల జీవితంతో చెలగాటమాడకుండా సౌకర్యాలు కల్పించాలని, మెరుగైన భోజనం అందించాలని ఆయన కోరారు. మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. వెంకటవీరయ్య మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మి భవాని కీర్తిని పరామర్శించారు.

## పేదవాడు ఉన్నంతవరకూ ఎర్రజెండా పోరాడుతూనే ఉంటుంది

### * సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య



**ప్రజాపక్షం/మణుగూరు :** పేదవాడు ఉన్నంతవరకు ఎర్రజెండా వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటుందని, సిపిఐ పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని, అధికారం వున్నా లేకున్నా పేద ప్రజల పక్షాన సిపిఐ పని చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య అన్నారు. మంగళవారం శివాలింగాపురం గ్రామంలో ఏ.ప్రవీణ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా బి. అయోధ్య హాజరై మాట్లాడుతూ శివలింగపురం 2 శాఖ గ్రామంలో పూర్తిగా పేద, మధ్య తరగతి, పేద ప్రజలు, గిరిజనులు ఎక్కువగా వున్నటువంటి ప్రాంతం, మున్సిపాలిటీ కావడం వలన వంద రోజుల పని లేక మహిళలు, గ్రామ ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మున్సిపాలిటీ గ్రామాల్లో పరిస్థితిలు అధ్వానంగా ఉన్నాయని సైడ్ కాలలు తీయడం లేదని, రోడ్ల వెంట చెత్తాచెదారం పేరుకుపోయిందని, బ్లీచింగ్ పౌడర్ చల్లే పరిస్థితి లేదని, వీధి దీపాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని కొన్ని గ్రామాలను పంచాయతీగా చేయాలని మేము కూడా కోరుతున్నామన్నారు. మున్సిపాలిటీ ప్రజల బాధలను పట్టించుకునే పరిస్థితి లేదని, కేవలం బండారిగూడెం సెంటర్ వరకే పరిమితం అవుతున్నారని శుభ్రం చేస్తున్నారని వారు అన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పేద ప్రజల పక్షాన సిపిఐ పార్టీ నిరంతరం పని చేస్తుందని దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. మున్సిపాలిటీ గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా ఉందని, సంబంధిత మునిసిపల్ శాఖ కనీసం కాలువలు శుభ్రం చేసే పరిస్థితి లేదని, మున్సిపాలిటీ అక్కడక్కడ పోయినటువంటి వీధిలైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా వాడవాడలా పార్టీ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మి కుమారి, పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు తోట రమేష్, ఏఐటియుసి కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, ఆడబాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిపిఐ శివలింగాపురం 2 శాఖ నూతన గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది.

## సరిహద్దుల నుంచి అక్రమ రవాణా నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

### ఖమ్మం సిపి సునీల్‌దత్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రాష్ట్ర సరిహద్దుల నుంచి అక్రమ రవాణాను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తూ...వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని ఖమ్మం సిపి సునీల్‌దత్ సూచించారు. నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. వివిధ రికార్డులను పరిశీలించారు. పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, జనరల్ డైరీ, రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. ..పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతి స్పందన సమయం, డిసిషీట్, సస్పెక్ట్ షీట్‌లు, ఎన్‌డబ్ల్యు అమలు, సిసిసిపిటిషన్‌లు పెండింగ్ అంశాలను పరిశీలించారు . ఇటీవల వృద్ధ దంపతులను పథకం ప్రకారం హత్య చేసిన నిందుతులను పట్టుకునేందుకు కేసును చాలెంజ్ గా తీసుకుని చేధించిన నేలకొండపల్లి పోలీస్ సిబ్బందికి జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..పకడ్బందీ ప్రణాళికలతో అందుబాటులో ఉన్న సాంకేతిక ను వినియోగించి కీలకమైన హత్య కేసు ను అనతి కాలంలోనే చేధించారని కొనియాడారు. అదే విధంగా సరిహద్దుల నుంచి అక్రమ రవాణా ను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ చేయనున్నట్లు తెలిపారు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్‌స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల బాధ్యతలు, రెగ్యులర్ రోల్‌కాల్ విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రోకార్, బీట్ డ్యూటీ సిబ్బందిఏవిధమైనవిధులునిర్వహిస్తున్నారు..పాత నేరస్తుల నివాసాల కదలికల పై ఏ విధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిసి ప్రసాద్‌రావు, ఖమ్మం రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి, సిఐలు సంజీవ్, మురళీ, వివిధ పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు పాల్గొన్నారు.



## సప్తగిరి వెంచర్‌లో విద్యుత్ షాక్‌తో కూలీ మృతి



**ప్రజాపక్షం/తల్లాడ :** సప్తగిరి వెంచర్‌లో విద్యుత్ షాక్‌తో వలస కూలీ మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లాకు చెందిన అలుగు వెంకటేశ్వర్లు (34) మూడు నెలల క్రితం బతుకు దెరువు కోసం తల్లాడ ప్రాంతానికి వచ్చాడు. తల్లాడ కొత్తగూడెం రోడ్డు లోని సప్తగిరి రియల్ వెంచర్‌లో పనికి కుదిరాడు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉండే వెంకటేశ్వర్లు మంగళవారం కాంక్రీట్ పని నిమిత్తం తెచ్చిన వాహనానికి విద్యుత్ తీగలు తగిలి తద్వారా వెంకటేశ్వర్లు షాక్‌కు గురయ్యాడు. పనిచేస్తున్న కూలీలు వెంటనే తల్లాడ ఆసుపత్రికి తీసుకుని రాగా ప్రథమ చికిత్స అందించి 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వెంకటేశ్వర్లు తండ్రి వెంకటస్వామి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బతుకు దెవురు కోసం వచ్చిన వెంకటేశ్వర్లు విద్యుత్ షాక్‌కు గురై మరణించడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. పిల్లలు, భార్య రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

## పనిచేయండి.. లేదంటే సెలవులపై వెళ్లిపోండి

### వైద్యుల గైర్హాజరుపై కలెక్టర్ ఆగ్రహం

### విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### మంచుకొండ పిహెచ్‌సిని కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవులపై వెళ్లాలని అనవసరంగా ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంచుకొండ పిహెచ్‌సిలో వైద్యులు, సిబ్బంది గైర్హాజరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రఘునాథపాలెం మండలం మంచుకొండ పిహెచ్‌సిని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంచుకొండ పిహెచ్‌సిని మధ్యాహ్నం మూడు గంటలకు తనిఖీ చేసిన కలెక్టర్ 15 మంది సిబ్బందికి ముగ్గురు ఉండడాన్ని గమనించారు. విధుల సమయంలో ఇద్దరు వైద్యులు ఆసుపత్రిలో గైర్హాజరు కావడం పట్ల కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ఉండాల్సిన వైద్యులు ఎక్కడ ఉన్నారంటూ సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు. వైద్యులతో చరవాణిలో మాట్లాడిన కలెక్టర్ పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవులపై వెళ్లండి అని అనవసరంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని నమ్మివచ్చే పేదల పరిస్థితి గురించి ఆలోచించకపోవడం విధుల పట్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని కలెక్టర్ తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఎంఅండ్‌హెచ్‌వోను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పిహెచ్‌సిలలో విధుల సమయంలో వైద్యుల హాజరును డిఎంఅండ్‌హెచ్‌వో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆసుపత్రిలో ఔట్ పేషంట్ సేవలు, వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్, ల్యాబ్ పరీక్షల నమూనాల రిజిస్టర్‌ను, మందుల నిల్వలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వార్డులలో రోగుల వివరాలను అడిగారు. ఆసుపత్రిలో ప్రసూతి మహిళా సేవలను, వైద్య సేవలను మెరుగుపర్చాలని వైద్యులు సమయ పాలన పాటించాలని తెలిపారు. రోజుకు ఎన్ని ఓపిలు చూస్తున్నారు, ఎంత మంది ప్రసూతి మహిళలకు ఆరోగ్య బలమైన మందులు అందిస్తున్నారు, నార్మల్ డెలివరీని పెంచుటకు గర్భిణీలను ప్రోత్సహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలోని రోగులతో ఆరోగ్య వివరాలు, ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించే తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించండి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంక్షేమ గురుకుల పాఠశాలలు సంక్షోభంలో కూరుకుపోయాయని తక్షణమే గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని రఘునాథపాలెం గురుకుల బాలికల పాఠశాలతో పాటు మరికొన్ని గురుకుల పాఠశాలలను ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తవుతున్నప్పటికీ గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో, సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం విద్య పట్ల ధ్వంద వైఖరిని ప్రదర్శిస్తుందన్నారు. విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా, విద్యారంగంపై సమీక్ష నిర్వహించకుండా ప్రభుత్వ విద్య ఎలా బలోపేతం అవుతుందని లక్ష్మణ్ ప్రశ్నించారు. పాఠశాలలు, సంక్షేమ గురుకులాలు మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై కొంత మంది విద్యార్థులు మరణిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చలనం లేదన్నారు. ఇంకా ఎంత కాలం పురుగుల అన్నం, నీళ్ల చారు అంటూ విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాటపడుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదన్నారు. వరుస ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని లేని యెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల మీరా, నాయకులు బి.మనోజ్, వంశీ, రోహిత్, రాజు, సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## సోంభాయమ్మకు సిపిఐనేత సాబీర్ పాషా నివాళులు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామంలో చిన్న సోంభాయమ్మ మంగళవారం ఆకస్మిక మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా మండల నాయకులతో కలిసి సోంబాయమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, సంయుక్త కార్యదర్శి కుమారి వీర హనుమంతరావు, సిపిఐ నాయకులు మండే నాగేశ్వరరావు, బాలు లక్ష్మీ నారాయణ, శాఖ సెక్రెటరీ దండు నాగేశ్వర రావు, దండు సురేష్, నాయకులగూడెం సిపిఐ పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు తదితరులు నివాళులర్పించారు.

## పెన్షనర్లు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలు

* ప్రతి శుక్రవారం సీనియర్ సిటీజన్లకు ప్రత్యేక వైద్య శిబిరం
* కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు
* 'జాతీయ పెన్షనర్స్‌డే' కార్యక్రమంలో కలెక్టర్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పెన్షనర్లు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్షనర్స్ డే కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మా కుటుంబం నాలుగు తరాలుగా ప్రభుత్వం తరుపున ప్రజలకు సేవ చేస్తున్నామని, పెన్షనర్లు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని, కష్టాలు ఉన్నప్పుడు, ఆపద సమయంలో పెద్దలు ఇచ్చే సలహాలతోనే వాటి నుంచి బయటపడతామని ఆయన తెలిపారు. గత కొన్నేళ్లుగా వేలాది మంది పడిన శ్రమ ఫలితంగానే నేడు సమాజానికి ఒక చక్కటి వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు. ఒక దరఖాస్తు మన వద్దకు వస్తుందంటే అది పరిష్కారం అవుతుందని గతంలో అధికారులు చూపించిన నమ్మకం మాత్రమే అన్నారు. జిల్లా ఆసుపత్రిలో పెన్షనర్లు, సీనియర్ సిటిజన్లకు వైద్య చికిత్స అందించేందుకు ప్రతి శుక్రవారం ప్రత్యేక విభాగం పని చేస్తుందని సీనియర్ సిటిజన్లకు అవసరమైన ఐదారు రకాల ప్రత్యేక వైద్యులు ఒకే చోట అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తారని దీనిని వినియోగించుకోవాలని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ కోసం జిల్లా కలెక్టరేట్‌లో ర్యాంపు పక్కన ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, కలెక్టరేట్‌లో సీనియర్ సిటిజన్స్‌కు ఏ శాఖతో పని ఉన్నప్పటికీ ఒకే దగ్గర దరఖాస్తులు తీసుకుని వాటిని సంబంధిత శాఖలకు కేటాయించి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. వారం రోజుల వ్యవధిలో ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్ కోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసి అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పెన్షనర్ల అనుభవం ఉపయోగించుకునేందుకు ప్రతి నెల కలెక్టరేట్‌లో సీనియర్ సిటిజన్స్ టాక్ ఏర్పాటు చేస్తున్నామని ఈ కార్యక్రమంలో పెన్షనర్లు వచ్చి నూతన ఉద్యోగులకు తమ అనుభవాలను అందించాలని కలెక్టర్ కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ పెన్షనర్లను సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతి బాయి, జిల్లా కోశాధికారి ఎస్‌విఎస్ నర్సింహా, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, సబ్ ట్రెజరీ అధికారి మోదుగు వేలాద్రి, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు వెలిగేటి చంద్రమోహన్, జిల్లా ఆరోగ్య అధికారి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు తాళ్లూరి వేణు, జనార్ధన్, పాల్గొన్నారు.



## ఊరూరా సిపిఐ జెండా ఆవిష్కరించాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఊరూరా సిపిఐ పార్టీ జెండాను ఆవిష్కరించి ఉత్సవాలు జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహా పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోపాటు గ్రామాల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. వంద సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి సాధించిన ఘనత సిపిఐ అన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, గీత పనివారల సంఘం మండల అధ్యక్షుడు గంగాపురం వెంకటయ్య, పార్టీ సీనియర్ నాయకులు ఉట్కూరి భగవంతు, పల్లె మల్లేశం, మీసం గాలయ్య, కర్రె మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### 100 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ఈనెల 26 నుండి జరిగే సిపిఐ 100 వసంతాల ఉత్సవాలను ప్రతి గ్రామంలో అరుణ పతాకాలు ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 30న నల్లగొండలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. నారాయణపురం పార్టీ నాయకులతో కలిసి విరాళాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సహాయ కార్యదర్శి చిలువేరు అంజయ్య, సిపిఐ సీనియర్ నాయకులు వీరమల్ల యాదయ్య, పల్లె మల్లారెడ్డి, గడ్డం యాదయ్య, చింతకింది ముత్యాలు, సింగ పంగరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## నాటి సుప్రీంకోర్టు తీర్పుతో పెన్షనర్ల జీవితాల్లో వెలుగులు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** 1982 సంవత్సరానికి ముందు ప్రభుత్వ ఉద్యోగులకు నామమాత్రపు పెన్షన తప్ప జీవన వ్యయాలకు సరిపడా పెన్షన్ ఇవ్వని పరిస్థితుల్లో డిఎస్ నకరా సుప్రీంకోర్టులో చేసిన సుదీర్ఘ పోరాటంకు గానూ 1982 డిసెంబర్ 17న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వైవి చంద్రచూడ్ ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి పెన్షన్ ఇవ్వాలని ఇచ్చిన తీర్పు పెన్షనర్ల జీవితాల్లో వెలుగులు నింపిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.సీతారామయ్య అన్నారు. మంగళవారం సూర్యాపేటలో నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 90 మంది సీనియర్ పెన్షనర్లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా డిటివో రవికుమార్, సుధాబ్యాంక్ ఎండి పెద్దిరెడ్డి గణేష్, నాగార్జున డిసిబి బ్యాంకు మేనేజర్ రాంబాబు, కె.రవిచంద్రారెడ్డి, ఎండి దేవదానం తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/ నాంపల్లి :** మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలోనీ రైతుల వివరాలు, రిజిస్టర్లు, వారియొక్క భూమి పాస్ బుక్ వివరాలు పరిశీలించారు. అనంతరం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న అధికారులు ధాన్యం కొనుగోలు ఎటువంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు జరిగేటప్పుడు అన్ని రిజిస్టర్ లను పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి అవకతకాలు జరిగిన సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఏఈఓ ల ధ్రువీకరణ ఉండాలని మరియు త్వరగా సంబందించిన మిల్లుకు పంపించాలని పిఏసిఎస్ ఇంచార్జ్ సీఈవోను ఆదేశించారు. ఈ చర్యలతో వేరే జిల్లా ధాన్యంమన జిల్లాకు వచ్చే అవకాశం లేదని సూచనలు అందరూ అమలు చేయాలని ఆదేశించారు.

## ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించాలి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి ఇంటింటి సర్వే చేపట్టి ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించాలని డి ఎం హెచ్ ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాసు ఆదేశించారు. స్థానిక పి హెచ్ సిలో ఫ్లోరోసిస్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది.అనంతరం స్థానిక పి హెచ్ సిలో త్వరలో ప్రారంభం కానున్నా డైలీసిస్ ఖేద్రనీ సందర్శించారు. ఫార్మసీ నందు లభిస్తున్న మందులని తనిఖీ చేసారు హాస్పిటల్ సిబంది సమయపాలన పాలన పాటించాలి అని ఆదేశించారు ఈ కార్యక్రమం లో. అడిషనల్ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,చండూర్ డిప్యూటీ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, కృష్ణ కుమారి హాస్పిటల్ సూపెర్డింటెంట్ ,డాక్టర్స్ సిబంది, హాస్పిటల్ సిబంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని టీఎస్‌యుటీఎఫ్ మండల కమిటీ నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. పురుగుల అన్నం, నీళ్ల చారు, ఉడకని కూరలను తినడంతో విద్యార్థులు అస్వస్థకు గురవుతున్నారని, ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచి రవికుమార్, అనిల్‌కుమార్, మంకాల కుమారస్వామి, పల్లె మోహన్‌రెడ్డి, సోమిరెడ్డి, కట్టా కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందుల్లేకుండా పత్తి కొనుగోలు

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/వలిగొండ :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు పండించిన పత్తి పంటను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. మంగళవారం వలిగొండ మండలంలోని నెమలి కాలువ గ్రామంలో గల వెంకటేశ్వర శ్రీ సాయి జిన్నింగ్ మిల్లును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిసిఐ సెంటర్ లోనే రైతులు పత్తిని అమ్ముకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు జిల్లా కలెక్టర్. ట్యాబు ఎంట్రీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జన్నింగ్ మిల్లు సిసిఐ ద్వారా ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. రైతులందరూ 8 శాతం తేమ ఉండేలా చూడాలన్నారు. తేమ శాతం మిషన్ ద్వారా తేమ శాతాన్ని స్వయంగా కలెక్టర్ పరిశీలించారు. రైతులకు 48 గంటల్లోపు డబ్బులు చెల్లించాలన్నారు. రైతులు విత్తనాల ఎంపికలో సర్టిఫైడ్ విత్తనాలను మాత్రమే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు కొనుగోలు చేయాలన్నారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

**ప్రజాపక్షం/ రామన్నపేట:** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ హనుమంతరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోజువారి అటెండెన్స్ రిజిస్టర్ రికార్డులను తనిఖీ చేశారు. అన్ని వార్డులు తిరిగి రోగులందరిని కలిసి ఆరోగ్య సమస్యలను, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి మొత్తం పరిశీలించి మంచినీటి సౌకర్యం సరిగా లేకపోవడంతో మిషన్ భగీరథ డీఈతో మాట్లాడి వెంటనే మంచి నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. రోగులకు దుప్పట్లు లేకపోవడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి దుప్పట్లు వెంటనే వచ్చే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా రోగులకు అందుతున్న భోజనం పరిశీలించి నాణ్యమైన కూరగాయలతో రోగులకు భోజనం అం దించాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఈశ్వర్, వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

### మంచినీటి శుద్ధీకరణ యంత్రం ఏర్పాటు చేయాలి

ఆసుపత్రిలో మంచినీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ హనుమంతరావుకు సామాజిక కార్యకర్తలు నోముల యాదగిరి, కురుమెటి నవీన్‌కుమార్, మెడి రాజు, ఎర్ర నరేష్‌లు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులు లీటర్ నీటికి రూ.20కు బయట కొనుగోలు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మిషన్ భగీరథ డిఇకి ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.





## రూ.12వేల పథకాన్ని వెంటనే ప్రారంభించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఎన్నికల సందర్భంగా వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12వేల రూపాయలు ఇస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా ంకేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా అట్టడుగున ఉన్న వ్యవసాయ కార్మికులకు సరైన సహకారం ప్రభుత్వం నుంచి అందాల్సి ఉందని, దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న వారు అనేక మంది వ్యవసాయ కార్మికు కుటుంబాలకు చెందిన వారేనని, నేటికి ఇండ్లులేక సరైన వైద్యం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో వ్యవసాయ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇళ్ల స్థలము లేని వారికి ఇళ్ల నిర్మాణం కోసం 6లక్షలు ఆర్థికసాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెమిడాల రాజు, రావుల సత్యం, ఎండి ఎక్బాల్, స్టాలిన్, జడ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ వెల్లంలలో ‘వెల్‌నెస్ కేంద్రం’

### కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ నల్లగొండ:** బ్రాహ్మణ వెల్లంలలో ఒక వెల్ నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృషి చేస్తున్నారు. మంత్రి ఆదేశాల మేరకు మంగళవారం వెల్‌నెస్ కేంద్రం ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో కలిసి వెల్ నెస్ కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు అన్ని రకాలుగా అనుగుణంగా ఉందని, ఇందుకు అవసరమైన భూమిని ప్రభుత్వం తరపున ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ వెల్ నెస్ కేంద్రం ప్రతినిధులకు తెలిపారు. బ్రాహ్మణ వెల్లంలలో వెల్ నెస్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలం, ప్రభుత్వంతో ఒప్పందం, నియమ, నిబంధనలు ,కావలసిన సౌకర్యాలు, తదితర అంశాలపై వెల్ నెస్ కేంద్రం ప్రతినిధులు రాజేందర్ జిల్లా కలెక్టర్ తో చర్చించారు.అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డిఓ అశోక్ రెడ్డి, ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ ఈ ఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



**దరఖాస్తుల పరిశీలనకు వచ్చే బృందాలకు అందుబాటులో ఉండాలి**

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా జనవరిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనకు వచ్చే బృందాలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. మంగళవారం ఆమె అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్‌తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకొని ఉండి, ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో పేరు ఉన్న దరఖాస్తుదారులు వారి దరఖాస్తుల పరిశీలనకు వచ్చే పరిశీలన బృందాలకు అందుబాటులో ఉండాలని కోరారు. సర్వే బృందాలకు ప్రస్తుతం ఉన్న ఇంటి వివరాలు ఫోటోతో సహా ఇవ్వాలని, అలాగే నూతనంగా ఇల్లు నిర్మించుకునేవారైతే స్థలం వివరాలను సమర్పించాలని తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో గృహ నిర్మాణ శాఖ పీడి రాజకుమార్ ,మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీవోలు , తహశీల్దార్లు,ఎంపీడీవోలు ఉన్నారు.



## ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** ధరణి పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవర్ అన్నారు. మంగళవారం సూర్యాపేట ఆర్డీవో కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని ఎలక్షన్ సెల్‌ని పరిశీలించి సిబ్బందికి ఫారం6,7,8 లపై పలు సూచనలు చేశారు. రికార్డు గదిని పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ధరణి పెండింగ్ సమస్యలు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. తదురపి కేంద్రియ విద్యాలయ కేంద్రం సూర్యాపేట ఏర్పాటుకు తాత్కలికంగా ఎస్వీ డిగ్రీ కళాశాల భవనంను పరిశీలించారు. అనంతరం సఖీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సఖీ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు ఎన్ని గృహహింసకి గురైన మహిళలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు, ఎంతమందికి న్యాయం అందించారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హెల్ప్ లైన్ 181 ద్వారా ఇప్పటి వరకు 1062 కాల్స్ రాగా, 197 కేసులు నమోదు చేయటం జరిగిందని, 148 కేసులు పరిష్కరించామని, మిగిలిన 49 కేసులు వివిధ దశలలో విచారణ జరుగుతుందని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాదవ్, ఎస్వి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేష్, సఖీ కేంద్రం పరిపాలన అధికారి శైలజ, కేస్ వర్కర్ సుజాత, పారామెడికల్ సిబ్బంది మానస తదితరులు పాల్గొన్నారు.

ఆటో దొంగిలించిన ఇద్దరు వ్యక్తుల రిమాండ్

**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలం ఎదులగూడెం సమీపంలో ఈనెల 8వ తేదీన ఆటో దొంగిలించిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించినట్లు వలిగొండ ఎస్సై యుగంధర్ గౌడ్ తెలిపారు. మంగళవారం నాగారం సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా నెంబర్ ప్లేట్ లేని బజాజ్ ఆటో అనుమానాస్పదంగా వస్తుండడంతో వారిని ఆపి విచారించిన పోలీసులకు ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు చెన్న సత్యనారాయణ, చెన్న నరేష్ ఇద్దరు వృత్తిరీత్యా ఆటో డ్రైవర్లు వారిని విచారించగా పొంతనలేని సమాధానం ఇవ్వడంతో పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. వలిగొండ ఎస్సు తెలిపిన వివరాలు ప్రకారం ఈనెల 8న వేములకొండ కు ఆటో కిరాయికి మాట్లాడుకొని వేములకొండ గుట్ట కి వచ్చి, ఆటో డ్రైవర్ కి మద్యం తాగించి, ఆటో డ్రైవర్ మత్తులోకి వెళ్లక వలిగొండ నుండి భువనగిరి వైపు రోడ్డు మార్గ మధ్యలో రోడ్డు పక్కన ఆటో ఆపి ఆటో డ్రైవర్ ను బెదిరించి ఆటో గుంజుకొని పారిపోయారు. దొంగిలించిన ఆటోను ఆంధ్రా లో విక్రయించేందుకు వెళ్తుండగా, నాగారం గ్రామంలోని జంక్షన్ వద్ద వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించినట్టు తెలిపారు.

## వలిగొండ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాల లో సందర్శించిన అఖిల భారత యువజన సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ వలిగొండ మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు గురువారం రోజు ఉదయం రాగిజావ తాగే సమయంలో ఇంకా ఎంతసేపు తాగుతారని విద్యార్థుల పట్ల కిరాతకంగా ప్రవర్తిస్తూ చేతులపై కొట్టడంతో విద్యార్థులకు చేతులు విరగడం జరిగిందని ప్రిన్సిపాల్ పై వెంటనే చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని అన్నారు .అదేవిధంగా విద్యార్థులతో మాట్లాడే సందర్భంలో ఇలాంటి ఘటనలు ఇంతకుముందు కూడా జరిగాయని మాకు తెలిసింది అని విద్యార్థులకు పూర్తిగా నయం అయ్యే వరకు ప్రభుత్వమే చికిత్స అందించాలని కోరారు. ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్ మాట్లాడుతూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందిస్తున్న భోజనంలో నాణ్యత లేని కారణంగా విద్యార్థులు ఇంటి నుంచి లంచ్ బాక్సులు తెచ్చుకుంటున్నారని వాటిపైన కూడా దృష్టి పెట్టి మధ్యాహ్న భోజనం అమలులో నూతన డైట్ అమలు చేయాలని అన్నారు

**వలిగొండ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..** యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వరుణ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అనేక మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్న టీచర్లు చేసే తప్పిదాల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు అనంతరం మండల విద్యాధికారి భాస్కర్ కి విద్యారంగ సమస్యల పై వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు బూడిద సాయి చరణ్, గణేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు బుగ్గ ఉదయ్,ఓర్స్ మనోజ్, అరుణ్, లింగస్వామి, దుర్గ, బాల్ నరసింహ, రవి, మధు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూమి స్వాధీనం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడలో గత ప్రభుత్వ పాలనలో ఆక్రమణకు గురైన లక్షలాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అధికారులు మంగళవారం పోలీసు బందోబస్తు నడుమ స్వాదీనం చేసుకున్నారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలను, ఫెన్సింగ్‌లను తొలగించి ప్రభుత్వ స్థలం పేరిట హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే నార్కట్‌పల్లి అద్దంకి హైవేపై ఉన్న సర్వే నెం.626లోని ప్రభుత్వ భూమిని మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్ సోదరి రాయపూడి భవాని ఆక్రమించినట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదేశాలతో ఫెన్సింగ్‌ను, ఇతర కట్టడాలను తొలగించారు. ఎటువంటి ముందస్తు సమాచారం అందించకుండా ఆక్రమణల పేరిట ఫెన్సింగ్‌ను తొలగించడం, కట్టడాలను కూల్చడం పట్ల మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్ అసహనం వ్యక్తం చేశారు. తనపై రాజకీయ కక్షణ సాధింపులో భాగంగానే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వాస్తవానికి తనకు ఆ సర్వే నెంబర్‌లోని భూమికి ఎటువంటి సంబంధం లేదని స్పష్ట ంచేశారు. తన సోదరి చట్ట ప్రకారం సర్వే నెం.711లో 22గుంటల భూమిని కొనుగోలు చేసిందని, పక్కా డాక్యుమెంట్లు ఉన్నాయన్నారు. ఎలాంటి కొలతలు చేయకుండా కూల్చడమేంటని ప్రశ్నించారు. కాగా సర్వే నెం.626లోని 3గుంటల భూమి ఆక్రమణఖు గురైందని నోటీసులు లేకుండా బౌండరీలు చూపకుండా ఫెన్సింగ్ తొలగించడాన్ని పట్టాదారు రాయపూడి భవాని భర్త ఉమాశేఖర్ తప్పుబట్టారు. సర్వే నెం.626లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని నిర్ధారించిన అనంతరం ఫెన్సింగ్‌ను తొలగించామని తహసీల్దార్ హరిబాబు వివరించారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, సర్వేయర్ ఖదీర్‌లు ఉన్నారు.



# ఉద్యమకారులను విస్మరిస్తే గుణపాఠం చెబుతాం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఎంతోమంది ఉద్యమకారుల త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన కెసిఆర్ తెలంగాణ ఉద్యమకారులు విస్మరించారని, అందుకే ఉద్యమకారులమంతా ఏకమై కెసిఆర్‌ను గద్దె దింపామని, ఉద్యమకారులను విస్మరించే ఏ ప్రభుత్వానికైనా తగిన గుణపాఠం చెబుతామని తెలంగాణ ఉద్యమకారుల జెఎసి రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. మంగళవారం స్థానిక బ్రహ్మణపల్లి ఫంక్షనహల్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 12వందల మంది అమరుల బలిదానాలు చేసుకుంటే ఎవరి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరేందుకు వెళితే తగిన సమయం ఇచ్చే పరిస్థితి లేకుండాపోయిందని, అందుకే కెసిఆర్‌ను ఫాంహౌజ్‌కు పంపించామని అన్నారు. ఉద్యమకారుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం నూతన కమిటిని ఎన్నుకున్నారు. తెలంగాణ ఉద్యమకారుల సూర్యాపేట జిల్లా జెఎసి అధ్యక్షులుగా కోడి సైదులుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె భారీఖాన్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె సయ్యద్, సారగండ్ల వెంకటమ్మ, మామిడిశెట్టి అంజమ్మ, కార్యదర్శిగా జలగం మధుకర్, అధికారి ప్రతినిధిగా రామచంద్రు, కె.గోపితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు ప్రఫుల్ రామిరెడ్డి, బత్తుల సోమయ్య, మంచాల వెంకటస్వామి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు మాదాసు శ్రీనివాసరావు, చంద్రన్నప్రసాద్, కారింగుల వెంకన్న, బొమ్మిడి లక్ష్మి నారాయణ, కోతి మాదవి పాల్గొన్నారు.



## ఆమరణ నిరాహార దీక్ష..

**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రజలకు కావాల్సిన అత్యవసరాలైన విద్య,వైద్యం, ఉపాధి, భూమి,ఇల్లు సాధనకు తన ప్రాణాలను సైతం ఇవ్వడానికి ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు నల్ల నరేందర్ మహారాజ్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. మంగళవారం భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షను సామాజికవేత్త బర్రె సుదర్శన్, కర్తాల శ్రీనివాస్, బట్టు రాంచంద్రయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ మహారాజ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వానికి అనేక రకాల కార్యక్రమాల ద్వారా విన్నవించుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేనందున ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ప్రజలందరికి నాణ్యమైన ఉంచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి, భూమి లేనివారికి ఒక ఎకరం భూమి, ఇల్లు లేనివారికి 200 గజాల ఇంటి స్థలం కేటాయించే వరకు లేదా తన ప్రాణం పోయేంత వరకు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందని అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోద్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ యాదవ్, జిల్లా నాయకులు లింగస్వామి, శాంతి కుమార్, శివ, శ్రీకాంత్, సురేష్, రాకేష్, రవి కుమార్, వివిధ మండలాల నాయకులు శ్రీకాంత్, రాకేష్, సాయి, కృష్ణ, కిషన్, నవీన్ పాల్గొన్నారు.





## లబ్ధిదారుల వివరాలు నమోదు

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఎలాంటి అవాంతరాలకు చోటు లేకుండా పకడ్బందీగా లబ్దిదారుల వివరాల నమోదు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాతారం గ్రామంలో పలు వార్డులో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఇందిరమ్మ పథకం ద్వారా పూర్తి స్థాయి అర్హత గల నిరుపేద కుటుంబాలకు ఇల్లు అందజేసే లక్ష్యం దిశగా సర్వే చేపట్టాలని, అనంతరం లబ్దిదారుల వివరాలను యాప్ ద్వారా పొందుపరుస్తున్న ల్యాండ్ డాక్యుమెంట్ల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈయన వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, హౌసింగ్ ఈఈ రాజేశ్వర్, పిఆర్ ఈఈ రెహమాన్, తహశీల్దార్ వీర్ సింగ్, ఎంపిడివో జగదీష్, మండల స్థాయి అధికారులు ఉన్నారు.

## దివ్యాంగులకు సకల సౌకర్యాలు



**ప్రజాపక్షం /జగిత్యాలరూరల్ :** జిల్లా సంక్షేమ శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జగిత్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జీవితకాల వెన్నుముక వ్యాధులతో బాధపడుతున్న అత్యధిక మద్దతు అవసరం వున్నా 16 మంది దివ్యాంగులకు ప్రత్యేక ఆరోగ్య క్యాంపు నిర్వహించడం జరిగింది. దీని ద్వారా వారికీ కావలసిన వైద్య సేవలు, మద్దతు దినసరి చర్యల మద్దతు మొదలగు అత్యధిక అవసరాల కొరకు ప్రభుత్వం తరపున సహాయం అందించడానికి బెంచ్ మార్క్ వికలాంగత్వం కలిగిన దివ్యంగులకు ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయ్ కుమార్ రెడ్డి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తూ అండగా ఉంటుందని జగిత్యాల జిల్లా సంక్షేమ అధికారి డా. బి.నరేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా సంక్షేమ అధికారి డా. బి.నరేష్, జిల్లా వైద్యాధికారి డా. ప్రమోద్ కుమార్, జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డా.రాములు, ఫీల్డ్ ఆఫీసర్ కొండయ్య, సీనియర్ సహాయకులు చంద్రమోహన్, సదరం కో ఆర్డినేటర్ కుమార్ మరియు దివ్యంగులు, తదితరులు పాల్గొన్నారు.

## కొండచిలువ పట్టివేత



**ప్రజాపక్షం/రామగిరి :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అతిపెద్ద కొండచిలువను పట్టుకున్నారు. కమాన్పూర్ క్రాస్ రోడ్ వద్ద కామెర నరసయ్య ఇంటి వద్ద కొండచిలువ ఉండగా కల్వచర్లకు చెందిన పాములను పట్టే ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యుడు కారంగుల శ్రీనివాస్ కు సమాచారం ఇచ్చారు. దీంతో శ్రీనివాస్ కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద చెట్లలో ఉన్న కొండచిలువను పట్టుకొని సంచిలో వేశాడు. అనంతరం రామగిరి ఖిల్లా ప్రాంతంలో వదిలివేయడం జరుగుతుందని శ్రీనివాస్ తెలిపారు. సుమారు 15 ఫీట్ల పొడవు 15 కిలోల బరువు గల ఈ కొండచిలువను చూసేందుకు ప్రజలు భారీ ఎత్తున గుమికూడారు. ఈ ప్రాంతంలో ఇంత పెద్ద కొండచిలువ కనిపించడం ఇది ప్రథమమని ఈ ప్రాంత వాసులు తెలుపుతున్నారు.

## చదరంగం పోటీలకు 'కాకతీయ' విద్యార్థిని ఎంపిక



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** సియం కప్ అండర్ 15 చదరంగం పోటీలు జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన చదరంగం పోటీలలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కాకతీయలో చదువుతున్న ఐదవ తరగతి విద్యార్థిని ఎం. చరణి చదరంగం పోటీలలో జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయి సియం అండర్ 15 చదరంగం పోటీలకు ఎంపికైనట్లు కాకతీయ విద్యాలయం కరస్పాండెంట్ రాపెల్లి సంజయ్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు జిల్లా నుండి ఎంపికైన ఎం. చరణిని మండలవిద్యాధికారి బండారి మధు, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

## పొరపాట్లకు తావివ్వొద్దు



**ప్రజాపక్షం/రామగిరి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేలు గ్రామాలలో పగడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శైలజరాణి అన్నారు. మంగళవారం రామగిరి మండలంలోని ఆదివారంపేట, రత్నాపూర్, నాగపల్లి గ్రామపంచాయతీలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ను ఆమె పరిశీలించి ఎక్కడ పొరపాట్ల కు తావు లేకుండా సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ దేవరకొండ ఉమేష్ పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/వీణవంక:** వీణవంక మండలంలోని ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స నిమిత్తంప్రభుత్వానికి హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు వద్ద ధరఖాస్తు చేసుకోగా మంత్రి పొన్నం ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రావడం జరిగింది. వీణవంక మండల గన్ముకుల గ్రామానికి చెందిన ఉమ్మెత్తుల లతకు రూ.18 వేలు చెక్కు రాగా మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి సాహెబ్ హుస్సేన్, సమ్మిరెడ్డి చేతుల మీదుగా చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు కట్కూరి ఉపేందర్‌రెడ్డి, కంకణాల జగదీశ్వర్, మాజీ సర్పంచ్ కర్ర తిరుపతిరెడ్డి, రాకేష్ తదితరులున్నారు.

# క్రీడల్లో గెలుపోటములు సహజం

### గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యం వెలికితీసేందుకు సిఎం కప్ క్రీడలు దోహదం

### ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య





**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** గ్రామీణ క్రీడకారుల నైపుణ్యాలను వెలికితీసేందుకు సిఎం కప్ క్రీడలు దోహదం చేస్తాయని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని అందించటంతో పాటు మానసిక చురుకుదనం కలుగచేస్తాయని.. మనస్సుకుఆహ్లాదాన్ని కలిగిస్తాయన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలమైదానంలో క్రీడ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సిఎంకప్ 2024 క్రీడ పోటీలను రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్‌తో కలసి క్రీడ జ్యోతిని వెలిగించారు. జిల్లాలోని వివిధ మండలాలనుండి వచ్చిన క్రీడకారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటమిలు సహజమేనని.. గెలుపు, ఓటమిలు పక్కకు పెట్టి క్రీడస్ఫూర్తితో వ్యవహరించాలని బక్కి వెంకటయ్య సూచించారు. సిఎం కప్ పేరిట క్రీడపోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను బక్కి వెంకటయ్య అభినందించారు. జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని, ఆటల్లో గెలుపు, ఓటమిలు ముఖ్యం కాదన్నారు. సిఎం క్రీడ కప్ క్రీడలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సంబంధిత శాఖలు సమన్వయంతో క్రీడకారులకు అన్ని క్రీడ సౌకర్యాలతో పాటు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడలు క్రీడస్ఫూర్తితో వ్యవహరించి క్రీడల్లో పాల్గొనాలన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జైదేవ్ మాట్లాడుతూ ఖోఖో, కబడ్డి. వాలీబాల్ క్రీడలతో పాటు ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, బాడ్మింటన్, అథ్లేటిక్స్, స్విమ్మింగ్, యోగ, బాక్సింగ్, బేస్‌బాల్, రేజ్లింగ్, నెట్‌బాల్, వుషో, బ్రిలియడ్స్, క్రీడల సెలక్షన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా అధికారులు, వివిధ క్రీడ అసోసియేషన్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, వ్యాయమ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి విద్యార్థినుల సృజన అద్భుతం

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కెజిబివి విద్యార్థినుల సృజనాత్మకత అద్భుతమని, వారు తయారు చేసిన వస్తువులు ఆకట్టుకుంటున్నాయని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ పొందిన కెజిబివి విద్యార్థినులు తయారు చేసిన వస్తువులతో క్రిస్మస్ కార్నివాల్ ఏర్పాటు చేయగా మంగళవారం కార్నివాల్‌ను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థినులు తయారు చేసిన క్రిస్మస్ ట్రీ, శాంత క్లాజ్, డెకరేషన్ హౌజ్, టిష్యూ పేపర్లు తదితర వస్తువులను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన సిబ్బందిని అభినందించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలకు కార్నివాల్ ఏర్పాటు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కుల మతాలకు అతీతంగా అన్ని రకాల పండుగలకు సంబంధించిన వస్తువులు తయారు చేసి ప్రదర్శన ఏర్పాటు చేయాలని జెండర్ ఈక్వాలిటీ కో ఆర్డినేటర్ కృపారాణికి సూచించారు. ఇప్పటికే కరీంనగర్, తిమ్మాపూర్, చొప్పదండి, చిగురుమామిడి, గంగాధర కెజిబివి విద్యార్థులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శనలో ఉంచగా మంగళవారం శంకరపట్నం, మానకొండూర్ కెజిబివి విద్యార్థులు తయారు చేసిన వస్తువులను అందుబాటులో ఉంచారు.

## మరింత మెరుగ్గా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి:** జిల్లాలో ఉన్న అంగన్వాడి కేంద్రాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అంగన్‌వాడి కేంద్రాల పనితీరు, అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు లబ్ధిదారుల వివరాలు, ప్రీ స్కూల్ నిర్వహణ, అనేమియా నివారణ మొదలగు వివరాలను కలెక్టర్ సంక్షేమ అధికారి అడిగి తెలుసుకున్నారు. నెలలో ఎన్ని అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేశారు, అక్కడ గమనించిన పరిస్థితులు మొదలగు వివరాలపై సూపర్వైజర్‌లను ఆరా తీశారు.శ్రీ హర్ష మాట్లాడుతూ, అంగన్‌వాడి కేంద్రాల నిర్వహణ మరింత మెరుగు కావాల్సిన అవసరం ఉందని, పిల్లలకు యూనిఫారమ్ ఎక్కడా కనపడలేదని, అంగన్ వాడి టీచర్లు సమయపాలన పాటించడం లేదని, కేంద్రాల నిర్వహణ శుభ్రం గా లేదని, ఈ పరిస్థితుల్లో వెంటనే మార్పులు రావాలని కలెక్టర్ సూపర్‌వైజర్‌లకు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలను సకాలంలో ఓపెన్ చేయాలని, పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేయాలని, పిల్లలు శుభ్రంగా ఉండాలని, బురద, చెత్త లో ఆడుకుంటున్నట్లు పిల్లలను గమనిస్తే టీచర్ల నుంచి సూపర్ వైజర్, సిడిపిఓ వరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. ప్రీ స్కూల్లో పిల్లల అటెండెన్స్ తగ్గకుండా చూసుకోవాలని, అంగన్ వాడి కేంద్రాలలో పిల్లల ఎదుగుదలను రెగ్యులర్ గా పరీక్షించాలని, పిల్లలకు యూనిఫామ్ సరిగ్గా ఉండాలని, ప్రతి సూపర్ వైజర్ పరిధిలో ఉన్న అంగన్ వాడి కేంద్రాల సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించాలని, అనవసరమైన ధర్నాలకు ఆస్కారం ఇవ్వవద్దని కలెక్టర్ తెలిపారు. సంక్రాంతి నాటికి జిల్లాలో అనాథ శరణాయాలకు, అనాథ పిల్లలకు సంబంధించిన సంపూర్ణ వివరాలను సేకరించి నివేదిక అందించాలని కలెక్టర్ అన్నారు. ఆర్.బి.ఎస్.కే వైద్యుల వచ్చి వైద్య పరీక్షలు నిర్వసిస్తున్నారా, పిల్లలకు ఎవరికైనా గుండె సంబంధిత జబ్బులు మొదలగు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకుని రావాలని పిల్లలకు మెరుగైన వైద్యం తక్షణం అం దేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం రంగంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సఖి కేంద్రం భవనాన్ని కలెక్టర్ సందర్శించి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి, జనవరి 1 నూతన సంవత్సరంలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఈఈ పంచాయతీ రాజ్ ను కలెక్టర్ ఆదేశించారు. ఎస్సీ రెసిడెన్షియల్ హాస్టల్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను పరిశీలించారు. సుల్తానాబాద్‌లో నిర్మాణం అవుతున్న వృద్ధాశ్రమం, బాలల సదనం పనులు పరిశీలించి, త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఇఇ గిరిష్ బాబు, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17న చలో హైదరాబాద్ తలపెట్టిన గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులను తరలివెళ్లకుండా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మద్దతుగా సిపిఐ తిమ్మాపూర్ మండల కార్యదర్శి బోయిని తిరుపతి, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్‌లు సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఒకటో పిఆర్‌సిలో నిర్ణయించిన ప్రకారం బేసిక్ వేతనం రూ.19500 వేతనంగా చెల్లించాలన్నారు. ఆలోపు జీవో నెంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15600, పంప్ ఆపరేటర్లకు, ఎలక్ట్రిషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19500 చెల్లించాలన్నారు. జీవో నెంబర్ 51ని సవరించాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరీలన్నింటినీ యధావిధిగా కొనసాగించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా అవసర ప్రాతిపదికన కార్మికులకు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారందరికీ సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా గ్రావిటీ ప్రభుత్వ గుర్తింపు కార్డులివ్వాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు రూ.30 వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. వారంతపు సెలవు పండుగ సెలవులు జాతీయ ఆర్జిత సెలవు దినాలను అమలు చేయాలన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీ ద్వారానే డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వమే ప్రత్యేక బడ్జెట్ కేటాయించి సబ్ ట్రెజరీ ఆఫీస్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు నారదాసు ఆగం రావు, అధ్యక్షుడు బుడిగె అంజయ్య, ఉపాధ్యక్షులు పప్పు శ్రీనివాస్, కోశాధికారి పాఠకుల అంజయ్య, కార్మికులు గోదారి శ్రీనివాస్, గాజుల కుమారస్వామి, దుర్గం శంకర్, దప్పు రామచంద్రం, ఉప్పులేటి అంజయ్య, బరిగెల మల్లవ్వ, గడ్డం లచ్చవ్వ, స్రవంతి తదితరులున్నారు.

## విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** సిఎం కప్ 2024 క్రీడాపోటీలలో బాగంగా మంగళవారం స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, రెస్లింగ్ పోటీలు నిర్వహించారు. దాదాపు అన్ని మండలాల నుంచి వెయ్యి మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. అందులో భాగంగా బుధవారం గచ్చిబౌలిలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాస్థాయిలో సెలెక్ట్ అయిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో ఖోఖో మానకొండూర్, తిమ్మాపూర్, కబడ్డీలో కరీంనగర్ అర్బన్, చిగురుమామిడి, ఫుట్‌బాల్‌లో హుజురాబాద్, కరీంనగర్, హ్యాండ్‌బాల్(బాలురు)లో రామడుగు, టిఎస్ఎంఎస్, బాలికల విభాగంలో కోర స్కూల్ తిమ్మాపూర్ డైట్ ప్రథమ స్థానంలో నిలిచారు. బేస్‌బాల్ టీం రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు పేరు తేవాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కోరారు.

### 21న వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీలు

కరీంనగర్ జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ సీఎం కప్ పోటీలను ఈ నెల 21న నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు ఇట్టి విషయాన్ని గమనించి ఈ నెల 21న ఉదయం 9 గంటలకు ప్రాంతీయ క్రీడా పాఠశాల కరీంనగర్‌లో పత్రాలతో హాజరు కావాలని కోరారు.



## 'మధ్యాహ్న భోజన' బిల్లులు రాక అప్పుల పాలు

### ఆదర్శ పాఠశాలలో నిలిచిన మధ్యాహ్న భోజనం



**ప్రజాపక్షం/ముత్తారం :** మధ్యాహ్నం భోజనం బిల్లులు చెల్లించడం లేదంటూ తమకు రావలసిన బిల్లులు రాక తమ అప్పుల పాలు అవుతున్నామంటూ మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు మాడల్ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం బంద్ చేసిన సంఘటన చోటుచేసుకుంది.పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్ మోడల్ పాఠశాలలోమధ్యాహ్నభోజనం నిలిచిపోయింది. గత కొన్ని నెలలుగా మధ్యాహ్న భోజన డబ్బులు చెల్లించకపోవడంతో మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు అప్పులు చేసి మరి విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వండి పెడుతున్న వంట కార్మికులకు బిల్లులు రాకపోవడంతో చేసేది ఏమీ లేక గత వారం రోజులుగా పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పూర్తిగా బంద్ చేసినట్లు తెలిసింది. అయితే పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నిలిపివేసిన నిర్వాహకులు తమకు బిల్లులు చెల్లించాకే, వేరే వారితో పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేసుకోండి అంటూ పాఠశాల ప్రిన్సిపాల్‌కి రాతపూర్వకంగా లెటర్ రాసిచ్చినట్లు తెలిసింది.పెరిగిన కూరగాయలు, గుడ్డు ధరలతో నిర్వాహకుల అవస్థలు, నెలనెలా వేతనాలు రాక ఇబ్బంది,పేద విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే 'మధ్యాహ్న భోజనం' నిర్వాహకులకు భారంగా మా రిందని మధ్యాహ్నం భోజనం నిర్వాహకులు అంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలో అప్పులు తెచ్చి విద్యార్థుల నాణ్యమైన భోజనం పెడుతున్నప్పటికీ ప్రతి నెలా మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు రెండు నెలలుగా అందక సతమతమవుతున్నారు. బిల్లులు సకాలంలో అందక అప్పులపాలవుతున్నామని నిర్వాహక మహిళలు వాపోతున్నారు. సకాలంలో ఇవ్వాలని కోరుతున్నారు.

# పరిహారం అందిన తర్వాతే భూములు అప్పగిస్తాం



**ప్రజాపక్షం/ముత్తారం :** పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాకే తమ భూములను అప్పగిస్తామని నేషనల్ హైవే రోడ్ లో భూములు కోల్పోతున్న రైతులు రోడ్డు పనులను అడ్డుకొని తమ నిరసన తెలిపారు.జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో భూములు కోల్పోతున్న తమకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాకే భూములు అప్పగిస్తామని ముత్తారం, లక్కారం, పోతారం రైతులు తేల్చి చెప్పారు. మంగళవారం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా హద్దులు ఏర్పాటు చేసేందుకు వచ్చిన అధికారులను ఆయా గ్రామాల రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంకు సంబందించి భూములు కొల్పోతున్న తమకు జీవనోపాధి పోతుందని, అయితే పూర్తిగా పరిహారం చెల్లించాకే నిర్మాణంకు సంబంధించి పనులు ప్రారంభించాలని, లేకపోతే పనులు చేపట్టేందుకు వచ్చే అధికారులను అడ్డుకుంటామని అన్నారు.

### భూమి, బోర్ డబ్బులు రాలేదు : ఎర్రం సమ్మయ్య

మైదంబండ జాతీయ రహదారి నిర్మాణంలో నాకు సంబంధించి 17.50 గుంటల భూమి, బోర్ పోతుంది. కానీ ఇప్పటి వరకు తాను కొల్పో తున్న భూమికి, బోరుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం అందలేదు. వరిహారం పూర్తిగా చెల్లించాకే పనులు చేపట్టాలి.

### నయా పైసా ఇవ్వలేదు.. : నూనె రాజ్‌కుమార్

మైదంబండజాతీయ రహదారి నిర్మాణంలో 180 సర్వే నెంబర్లో తనకు సంబంధించి 23 గుంటలు పోతుంది. తన భూమిని అధికారులు ఇప్పటికే ఆన్‌లైన్‌లో నుంచి జాతీయ రహదారికి సమర్పించారని, తనకు డబ్బులు వడ్డట్లుగా అధికారులు రిసిప్ట్ ఇచ్చారు. కానీ బ్యాంక్ ఖాతాలో నయా పైసా కూడా జమా కాలేదు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశా. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వెంటనే పరిహారం చెల్లించాలి. లేకపోతే రైతులందరితో కలిసి పనులు అడ్డుకుంటా.

### ఎకరా డబ్బులు కూడా జమ చేయలేదు : జంగ మోహన్‌రెడ్డి

సర్వారం జాతీయ రహదారి నిర్మాణంలో తనకు సంబంధించి 4 ఎకరాల భూమి పోయింది. ఎకరాకు 20లక్షల 13వేల పరిహారం ఒప్పందం జరిగింది. తన ఖాతాలో ఇప్పటి వరకు కనీసం ఎకరాకు సంబంధించిన పూర్తి స్థాయి డబ్బు కూడా జమ కాలేదు. అధికారులు ఇప్పటి వరకు తనకు 16లక్షల రూపాయలు మాత్రమే చెల్లించారు. వెంటనే పూర్తి పరిహారాన్ని అందించాలి. అప్పుడే పూర్తిస్థాయిలో సహకరిస్తాం అని స్పష్టం చేశారు.

## క్రీడ

# ఆదుకున్న టెయిలెండర్స్.. గట్టెక్కిన టీమిండియా!



ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్ట్‌లో టీమిండియా ఓటమిని తప్పించుకుంది. టెయిలెండర్స్ జస్‌ప్రీత్ బుమ్రా(27 బంతుల్లో సిక్స్‌తో 10 బ్యాటింగ్), ఆకాశ్ దీప్(31 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 27 బ్యాటింగ్) అసాధారణ బ్యాటింగ్‌తో టీమిండియాను ఫాలో ఆన్ గండం నుంచి గట్టెక్కించారు. ఆఖరి వికెట్‌కు అజేయంగా 39 పరుగులు జోడించారు. వెలుతురు లేమితో అంపైర్లు నాలుగో రోజు ఆటను ముందుగానే ముగించారు. మ్యాచ్ ఆగిపోయే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 74.5 ఓవర్లలో 9 వికెట్లకు 252 పరుగులు చేసింది తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగులు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం భారత్ ఇంకా 193 పరుగుల వెనుకంజలో ఉంది. బుధవారం చివరి రోజు కావడంతో ఈ మ్యాచ్ డ్రా అయ్యే అవకాశాలు ఉన్నాయి. 51/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే అదృష్టం కలిసొచ్చింది. తొలి బంతికే కేఎల్ రాహుల్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో స్మిత్ నేలపాలు చేశాడు. 35 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద లభించిన ఈ అవకాశాన్ని రాహుల్ సద్వినియోగం చేసుకున్నాడు. ఆ కాసేపటికే కెప్టెన్ రోహిత్ శర్మ(10)ను కమిన్స్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన జడేజా సాయంతో కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో రాహుల్ 85 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరూ ఆచితూచి ఆడటంతో భారత్ 167/6 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. లంచ్ బ్రేక్ అనంతరం కాసేపు వర్షం అంతరాయం కలిగించింది. ఆట తిరిగి ప్రారంభమవ్వగా.. స్మిత్ స్టన్నింగ్ క్యాచ్‌కు కేఎల్ రాహుల్ వెనుదిరిగాడు. క్రీజులోకి వచ్చిన నితీష్ కుమార్ రెడ్డితో జడేజా పోరాడాడు. 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అతను.. భారత జట్టుకు ఫాలో ఆన్ గండం గట్టెక్కించే ప్రయత్నం చేశాడు. నితీష్ కుమార్ రెడ్డి ఔటైనా.. సిరాజ్‌తో కలిసి జట్టు స్కోర్‌ను 200 పరుగుల మార్క్‌ను ధాటించాడు. 201/7 స్కోర్ టీమిండియా టీ బ్రేక్‌కు వెళ్లగా.. మూడో సెషన్ ప్రారంభంలోనే సిరాజ్‌ను మిచెల్ స్టార్క్ ఔట్ చేశాడు. ఆ కాసేపటికే జడేజా కూడా కమిన్స్ బౌలింగ్‌లో వెనుదిరిగడంతో భారత్ ఫాలో ఆన్ ఆడటం తప్పదని అంతా అనుకున్నారు. కానీ బుమ్రాఆకాశ్ దీప్ అసాధారణ బ్యాటింగ్‌తో టీమిండియాను ఆదుకున్నారు. కీలక భాగస్వామ్యంతో ఫాలో ఆన్ గండాన్ని గట్టెక్కించడంతో పాటు ఓటమిని తప్పించారు.

# టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ గుడ్ బై?



టెస్ట్ ఫార్మాట్‌లో పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గబ్బా టెస్ట్ అనంతరం రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లోనూ రోహిత్ శర్మ(10) దారుణంగా విఫలమయ్యాడు.

ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ బౌలింగ్‌లో రోహిత్ కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. గుడ్ లెంగ్త్ బాల్‌ను డ్రైవ్ షాట్ ఆడే ప్రయత్నం చేసి మూల్యం చెల్లించుకున్నాడు. కేఎల్ రాహుల్ కోసం నెంబర్ 6లో బ్యాటింగ్‌కు వచ్చిన రోహిత్.. ఎదుర్కొన్న తొలి బంతి నుంచే చాలా అసౌకర్యంగా కనిపించాడు. ముఖ్యంగా అతని ఫుట్‌వర్క్ చాలా పేలవంగా కనిపించింది. బంతి వచ్చేవరకు ఎదురు చూసేంత ఓపిక అతని ఆటలో కనిపించలేదు. క్రీజులో ఏ మాత్రం కదలకుండా షాట్ ఆడి మూల్యం చెల్లించుకున్నాడు.

**డగౌట్ వద్దే గ్లౌజ్‌లు..**

దాంతో తీవ్ర అసంతృప్తికి గురైన రోహిత్ శర్మ తన గ్లౌజ్‌లను డగౌట్ వద్దే పడేసి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లాడు. ఈ ఘటన అందర్నీ షాక్‌కు గురి చేసింది. వరుసగా విఫలమవుతుండటంతో రోహిత్ భావోద్వేగపూరితమైన నిర్ణయం తీసుకున్నాడా? అనే చర్చ మొదలైంది. గబ్బా టెస్ట్ ముగిసిన తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతాడనే ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. గతంలో మహేంద్ర సింగ్ ధోనీ కూడా ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ధోనీ తరహాలోనే రోహిత్ సైతం సంచలన నిర్ణయం తీసుకుంటాడని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. ఈ సిరీస్‌లో మూడు ఇన్నింగ్స్‌ల్లో 6 స్థానంలో బ్యాటింగ్ చేసిన రోహిత్.. మూడింటిలోనూ విఫలమయ్యాడు.

**రెండేళ్లుగా తడబడుతున్న హిట్ మ్యాన్..**

గత రెండేళ్ల నుంచి సుదీర్ఘ ఫార్మాట్‌లో రోహిత్ ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. మొత్తం 10 టెస్ట్‌లు.. 18 ఇన్నింగ్స్‌ల్లో 621 పరుగులు మాత్రమే చేశాడు.

అతని టెస్ట్ కెరీర్ బ్యాటింగ్ సగటు 45 కాగా.. ఈ 18 ఇన్నింగ్స్‌ల్లో యావరేజ్ 34. ముఖ్యంగా స్వదేశంలో 62 యావరేజ్‌తో ఆడే రోహిత్ శర్మ.. విదేశాల్లో మాత్రం 33 సగటు మాత్రమే నమోదు చేశాడు. ఇప్పటికే టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ.. టెస్ట్, వన్డే ఫార్మాట్‌లోనే కొనసాగుతున్నాడు. టీ20 ప్రపంచ కప్ 2024 విజయానంతరం పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు రోహిత్ శర్మ ప్రకటించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 అనంతరం వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

## రీల్




# 'ముఫాసా'కి కూడా ప్రీమియర్ షోలు!

టాలీవుడ్‌లో స్టార్ హీరో చిత్రాలకు ప్రీమియర్ షోలు పడటం మనం చూశాం. చిన్న హీరోల సినిమాలకు కూడా ఈ మధ్య ప్రీమియర్స్ వేస్తున్నారు. అయితే, డబ్బింగ్ సినిమాలకు, యానిమేటెడ్ సినిమాలకు ప్రీమియర్స్ చాలా అరుదు. కానీ, ఇప్పుడు ఓ యానిమేటెడ్ సినిమాకు తెలుగులో ప్రీమియర్స్ పడుతుండటం టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. హాలీవుడ్ ప్రొడక్షన్ హౌస్ వాల్ట్ డిస్నీ నుంచి వస్తున్న లేటెస్ట్ మూవీ 'ముఫాసా – ది లయన్ కింగ్'కి ఇండియాలో మంచి క్రేజ్ నెలకొంది. ఈ సినిమాను పలు ఇండియన్ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. ఇక తెలుగులో ఈ చిత్రంలో సూపర్ స్టార్ మహేష్ బాబు వాయిస్ ఓవర్ ఇస్తుండటంతో ఈ సినిమాపై సాలిడ్ హైప్ క్రియేట్ అయింది. దీంతో ఈ సినిమాను థియేటర్లలో చూసేందుకు మహేష్ అభిమానులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. ఈ క్రమంలోనే 'ముఫాసా' చిత్రాన్ని డిసెంబర్ 20న గ్రాండ్‌గా రిలీజ్ చేస్తుండగా.. సుదర్శన్ 35 ఎంఎం థియేటర్లో ఈ సినిమా ప్రీమియర్ షో ఉదయం 8 గంటలకు ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రీమియర్ షో టికెట్స్‌కు డిమాండ్ కూడా భారీగా ఉందని అభిమానులు చెబుతున్నారు. దీంతో మహేష్ బాబు వాయిస్ వినేందుకే ఈ సినిమాను చూడాలని కొందరు అభిమానులు ఫిక్స్ అయ్యారని తెలుస్తోంది.

# బఘీర హీరోతో పీపుల్ మీడియా భారీ చిత్రం..




రీసెంట్ గా కన్నడ స్టార్ హీరో రోరింగ్ స్టార్ శ్రీ మురళి హీరోగా నటించిన భారీ చిత్రం బఘీర కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ చిత్రం అనుకున్న రేంజ్ సక్సెస్ అందుకోలేదు కానీ ఇపుడు ఈ తర్వాత మన టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారితో భారీ సినిమా చేస్తున్నట్టుగా ఇపుడు అనౌన్స్ చేశారు. మరి పీపుల్ మీడియా సంస్థలో ఇది 47వ సినిమాగా అనౌన్స్ చేయగా శ్రీమురళిపై క్రేజీ పోస్టర్ తో రివీల్ చేశారు. దీనితో ఇది కూడా ఒక మాస్ అండ యాక్షన్ డ్రామాగా ప్లాన్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. మరి ఈ చిత్రానికి టైటిల్ ఏంటి, దర్శకుడు ఎవరు ఇతర వివరాలు మేకర్స్ త్వరలోనే రివీల్ చేయనున్నారట. మరి నేడు శ్రీమురళి బర్త్ డే కానుకగా అనౌన్స్ చేశారు. దీనితో తన ఫ్యాన్స్ ఎగ్జైట్ అవుతున్నారు. మరి కన్నడ సినిమాలో ఆల్రెడీ ఓ సినిమా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మాణం వహించారు. అదే నెక్స్ట్ సినిమాగా శ్రీమురళితో సినిమా చేస్తున్నారు.




# భారీ రన్ టైం తో 'విడుదల 2'

తమిళ విలక్షణ నటుడు మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా నటించిన రీసెంట్ చిత్రం మహారాజ ఎంత పెద్ద హిట్ అయ్యిందో అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా తర్వాత తాను నటించిన మరో చిత్రం ఈ ఏడాదిలో రిలీజ్ కి రాబోతుంది. మరి ఆ చిత్రమే విడుదల పార్ట్ 2. ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ తెరకెక్కించిన ఈ హై వోల్టేజ్ ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామా చాలా కాలం నుంచి తెరకెక్కిస్తూ ఇపుడు ఎట్టకేలకి రిలీజ్ కి రాబోతుంది. అయితే తమిళ్ లో సహా తెలుగులో ఈ డిసెంబర్ 20న వస్తున్న ఈ సినిమా నిడివి ఇపుడు బయటకి వచ్చింది. మరి ఈ సినిమా ఏకంగా 2 గంటల 52 నిమిషాల పెద్ద నిడివితోనే వస్తుంది అని చెప్పాలి. మొదటి పార్ట్ తో పోలిస్తే పార్ట్ 2 కి మన తెలుగు ఆడియెన్స్ లో మరీ అంత ఎక్కువ బజ్ కనిపించడం లేదు. డెఫినెట్ గా సినిమాలో కంటెంట్ క్లిక్ అయితే తప్ప ఇంత పెద్ద సినిమా అందులోని డబ్బింగ్ మన తెలుగు ఆడియెన్స్ కి ఎక్కుతుందా లేదా అనేది ప్రశ్నే అని చెప్పాలి. ఈ మధ్య వచ్చిన తమిళ ప్రముఖ చిత్రాలు ఇండియన్ 2, కంగువా లు మొదట ఒక రన్ టైం తో వచ్చి తర్వాత ట్రిమ్ చేసుకున్నారు. మరి విడుదల 2 కి కూడా ఇలానే అవుతుందా లేక ఆడియెన్స్ ని ఎంగేజ్ చేస్తుందా అనేది మాత్రం వేచి చూడాలి.

# యుజి అడ్మిషన్లలో 'కల్చరల్ ఎక్సలెన్సీ కోటా'

## దేశంలోనే మొట్టమొదట ప్రవేశపెట్టిన ఘనత ఐఐటి-మద్రాస్ సొంతం ప్రతీ కోర్సులో రెండు సీట్ల కేటాయింపు

**న్యూఢిల్లీ :** అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్లకు 'ఫైన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఎక్సలెన్సీ' (ఎఫ్ఎసిఇ) కోటాను ప్రవేశపెట్టిన ఘనత దేశంలోనే 'ఐఐటిమద్రాస్'కు మాత్రమే దక్కిందని ఐఐటి మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి తెలిపారు. ఎఫ్ఎసిఇ కోటా 2025–2026 అకడమిక్ సెషన్ నుండి ప్రవేశపెడుతున్నారు. లలిత కళలు, సంస్కృతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విదత్యార్థులకు బహుమతులు అందించడం, ప్రోత్సహించడం దీని లక్ష్యం అని కామకోటి చెప్పారు. 2024–2025 అకడమిక్ సెషన్ నుండి అండర్ గ్రాడ్యుయేట్ అడ్మిషన్ల కోసం స్పోర్ట్స్ కోటాను ప్రవేశపెట్టిన మొట్టమొదటి ఐఐటిగా కూడా 'ఐఐటిమద్రాస్' ఘనతను దక్కించుకున్నది. ఈ పథకం కింద ఐఐటి మద్రాస్‌లోని అన్ని బిటెక్, బిఎస్ కోర్సుల్లో ఒక్కో ప్రోగ్రామ్‌కు రెండు సీట్లు కేటాయించబడతాయని కామకోటి వెల్లడించారు. రెండు సీట్లలో ఒకటి మహిళలకు, మరొకటి జెండర్ న్యూట్రల్‌కు కేటాయించబడింది. 'ఐఐటి మద్రాస్ తన ప్రతీ అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఎఫ్ఎసిఇ అడ్మిషన్ల ద్వారా భారతీయ పౌరులు, ఓవర్సీస్ సిటీజన్స్ ఆఫ్ ఇండియా/భారతీయ సంతతికి చెందిన వ్యక్తులు (ఒసిఐ/పిఐఒ) అభ్యర్థులకు ఒక్కో ప్రోగామ్‌కు రెండు సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించడం ద్వారా సీట్లు అందజేస్తుంది. జెఇఇ (అడ్వాన్స్) సమయంలో భారతీయ పౌరులు రిజిస్ట్రేషన్ ఎఫ్ఎసిఇ అడ్మిషన్కు అర్హులు' అని కామకోటి చెప్పారు. ఆసక్తి కలిగిఉన్న అభ్యర్థులు కోటా అడ్మిషన్ పరిశీలన కోసం ఐఐటిమద్రాస్/ ఎఫ్ఎసిఇ అడ్మిషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎఫ్ఎసిఇ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జెఒఎస్ఎఎ) పోర్టల్ ద్వారా కాకుండా ఐఐటి మద్రాస్ ద్వారా నిర్వహించబడే ప్రత్యేక పోర్టల్‌లో ఎఫ్ఎసిఇ ద్వారా సీట్లు అందించడానికిఆసక్తి ఉన్నటువంటి ఇతర ఐఐటిలు కూడా పాల్గొనవచ్చు.'2025–2026విద్యా సంవత్సరానికి ఐఐటి మద్రాస్ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఎక్సలెన్సీ (ఎఫ్ఎసిఇ) అడ్మిషన్ ద్వారా సీట్లు అందిస్తోంది' అని కామకోటి వెల్లడించారు.అర్హత ప్రమాణాల ప్రకారం అభ్యర్థి జెఇఇ (అడ్వాన్స్‌డ్)2025లో అర్హత సాధించి ,కామన్ ర్యాంక్ లిస్ట్ (సిఆర్ఎల్) లేదా కేటగిరీ వారీగా ర్యాంక్ లిస్ట్‌లో స్థానం పొంది ఉండాలి. 'అభ్యర్థులు లలిత కళలు, సాంస్కృతిక కార్యక్రమాలలో వారి నైపుణ్యానికి గుర్తింపుగా ఎంపిక చేసిన కేటగిరీలలో కనీసం ఒకదానిలో గుర్తింపు పొంది ఉండాలి' అని కామకోటి తెలిపారు.




# కొత్తగూడెం అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

20 ఏళ్ల నుంచి పాల్వంచలో ఎన్నికలు జరగడంలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వం అత్యవసరంగా అక్కడ ఎన్నికలు జరపాలని సాంబశివరావు కోరారు. ఎన్నికలు నిర్వహించాలని జిల్లాకు చెందిన మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల సహకారంతో సిఎంను కోరామని ఆయన వివరించారు. జంటనగరాలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరగా, గిరిజన ప్రాంతాలు అని చెబుతున్నారని, వాస్తవంగా 1/70 జిఓ ప్రకారంగా గిరిజన ప్రాంతాలు కానీ ప్రాంతాలను కూడా గిరిజన ప్రాంతాలుగా తప్పుగా చూపడం వల్ల సమస్య వచ్చిందని సాంబశివరావు వివరించారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులలో పేజీ నెంబర్‌లో 4లోని 12వ అంశంలో పేర్కొన్న విధంగా ఇల్లందు, సింగరేణి, సిర్పూర్, కొత్తగూడెం నాలుగు మినహా మిగిలినవన్నీ గిరిజన ప్రాంతాలని పొందుపర్చారని ఆయన వెల్లడించారు. అదే విధంగా మూడవ అంశంలో వరంగల్ జిల్లా పాల్వంచ తాలుకాలోని బుర్గంపాడ్, అశ్వరావ్‌పేట్, దమ్మపేట, కుక్కునూర్, నెల్లిపాక, సంస్థాన పాల్వంచ గ్రామాలు తప్ప మిగిలినవి గిరిజన ప్రాంతాలని అన్నారు. సంబంధిత అధికారులు ఉత్తర్వులను సరిగ్గా చూసారో లేదో తెలియదన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఈంశాలను క్షణ్ణంగా పరిశీలించి కొత్తగూడెం, పాల్వంచను మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

# దుర్గ్యా నాయక్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. దుర్గానాయక్ ఇచ్చిన పోరాట స్ఫూర్తితో నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని వారు తెలిపారు. జనగామ మాజీ ఎంఎల్‌ఎ, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డితో పాటు జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చొప్పరి సోమయ్య, చింతకింది అరుణ, బీడ ఎల్లయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, బెజగం ఎల్లయ్య, భాషపాక సోమయ్య తదితరులు నివాళ్లు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. దుర్గ్యా నాయక్ మృతి పట్ల సిపిఎం సంతాపం ప్రకటించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం భౌతికకాయం వద్ద నివాళి అర్పించారు. ఆయనతో పాటు సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్, ధర్మానాయక్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, ఇర్రి ఆహల్య, బొట్ల శేఖర్, బూడిద గోపి, చిట్యాల సొమన్న, జోగు ప్రకాష్ నివాళి అర్పించారు.

**ఎర్రజెండా కొదమ సింహం దుర్గ్యానాయక్**

దుర్గ్యానాయక్ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో విరోచత పోరాటం చేశారు. నల్ల నర్సింహులు దళ సభ్యుడు. భూమి, భుక్తి, విముక్తి కోసంతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4 వేల మంది ప్రాణాలు కోల్పోగా 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారు. అయితే దర్గ్యా నాయక్ కుటుంబం పూర్తిగా ఎర్రజెండాబాటలోనే నడిచింది. విసునూరు రామచంద్రారెడ్డి ఆగడాలకు అదుపులేని రోజుల్లో ఆయన కొడుకు బాబు దొర సైతం ప్రజల ధన, మాన ప్రాణాలు దోచేవాడు.

దర్గ్యానాయక్ అన్న కూడా హత్యకు గురయ్యారు. చిన్న వయస్సులో ఉన్న దర్గ్యానాయక్, ఉద్యమ బాట పట్టి చివరకు విసునూరు రామచంద్రారెడ్డి కొడుకు బాబుదొరను జనగామ రైల్వే స్టేషన్‌లో నరికి చంపాడు. కాగా, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎనలేని పాత్ర పోషించిన దుర్గ్యానాయక్‌కు సిపిఐ అండగా ఉంది. ఎప్పటకీ ఆయన యోగక్షేమాలు తెలుసుకోవడంతో పాటు గ్రామానికి వెళ్లి ఆయనను పలుకరించేవారు. సెప్టెంబర్ 14 జనగామ మాజీ ఎంఎల్‌ఎ సిహెచ్ రాజారెడ్డితో పాటు విమలక్కలు దుర్గ్యానాయక్‌తో మాట్లాడారు. 107 ఏండ్ల వయస్సులోనూ ఆయన మాట్లాడిన మాటలు ఉత్తేజాన్ని నింపాయని రాజారెడ్డి తెలిపారు. దుర్గ్యానాయక్ పీడిత ప్రజల కోసం పనిచేశాడని, నిత్యం ప్రజల కోసమే ఆరాటపడేవాడన్నారు. చిన్న తనంలోనే ఎర్రజెండా చేబట్టిన దుర్గ్యానాయక్ చివర వరకు ఎర్రజెండా బాటలోనే ఉన్నారు. ప్రజలకు రక్షణగా, విస్నూర్ రామచంత్రారెడ్డి గుండాలకు సింహ స్వప్నమైన దుర్గ్యానాయక్ చనిపోవడం నిజంగా కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటుగా చెప్పాలి.

# నియంతృత్వానికి దారి

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ఇవ్వటంపై ప్రజలకు చంద్రబాబు సమాధానం చెప్పాలని రాజా డిమాండ్ చేశారు. గతంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు చంద్రబాబు కన్వీనర్‌గా ఉన్నారని, తాను కూడా స్టీరింగ్ కమిటీలో సభ్యునిగా ఉన్నట్లు తెలిపారు. లౌకికవాదం, సమాఖ్య విధానంపై చంద్రబాబు వైఖరి స్పష్టం చేయాలన్నారు. రాజకీయ అవకాశవాదంతో సిద్ధాంతాల్ని ప్రక్కన పెట్టారని విమర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని బీజేపీ హామీ ఇచ్చిందనీ; ఏపీకి ప్రత్యేక హోదా ఎప్పుడు తీసుకువస్తారంటూ ప్రశ్నిస్తున్న ఆంధ్రా ప్రజలకు సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. సీపీఐ జాతీయ మహాసభలు 2025 సెప్టెంబరు 21 నుంచి 25వ తేదీ వరకు చండీగఢ్‌లో జరనున్నట్లు వెల్లడిచారు. ఈ నెల 26న కాన్పూర్‌లో సీపీఐ శతవార్షికోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఏడాదిపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో జరిగే కార్యక్రమంతో శతవార్షికోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించిన అనంతరం 2026 అక్టోబరు నాటికి పూర్తి చేస్తామని ప్రకటించటం హర్షణీయం అన్నారు. ముఖ్యమంత్రిగా ఎవరు ఉన్నా కాపర్‌డ్యామ్, డయా ఫ్రం వాల్, స్పిల్‌వే తదితర అంశాలు మాట్లాడుతున్నారేతప్ప పోలవరం నిర్వాసితుల ఊసే ఎత్తటం లేదని ధ్వజమెత్తారు. బుడమేరు వరదలకు విజయవాడ మునిగిపోతే దగ్గరుండి పనులు పర్యవేక్షించిన చంద్రబాబు ప్రతి ఏడాది ముంపుబారిన పడుతున్న పోలవరం వాసుల గురించి పట్టించుకోకపోవటం దారుణమన్నారు. పోలవరం ఎత్తు 41.1 మీటర్ల వరకు మాత్రమే పరిహారం ఇస్తామని మోదీ చెప్పినట్లు వస్తున్న వార్తలపై చంద్రబాబు వాస్తవ సమాచారాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఏలేరుపాడులో లక్షలాది మందికి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జరిరగిన సెకీతో ఒప్పందంపై సీఎం ఎందుకు మాట్లాడటం లేదని సందేహం వెలిబుచ్చారు. అదానీతో గత రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న అంశానికి సంబంధించి తాను, ప్రస్తుత ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ హైకోర్టులో పిటీషన్లు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అదానీ రూ.1750 కోట్లు లంచంగా ఇచ్చినట్లు తేల్చిందన్నారు. దీంతో ఇరవై ఐదేళ్ల పాటు రాష్ట్ర ప్రజలపై లక్షా పది కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల భారం పడుతుందన్నారు. సెకీ ఒప్పందంపై జగన్ తనకు సన్మానం చేయాలంటున్నారని, చంద్రబాబుకు దమ్ముంటే ఒప్పందాన్ని రద్దు చేయాలని విజయసాయిరెడ్డి సవాలు విసురుతున్నారన్నారు. అదానీతో జరిగిన ఒప్పందం సక్రమమో లేక అక్రమమో చంద్రబాబు ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

# పరీక్షలు నిర్వహించదు!

(మొదటి పేజీ తరువాయి)

పరీక్ష(సిబిటి)కి మారాలా అన్న విషయమై విద్యా శాఖ ఆరోగ్య మంత్రిత్వ శాఖతో చర్చిస్తున్నదని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. 'కేంద్ర మంత్రి జెడ్డా నేతృత్వంలో ఆరోగ్య మంత్రిత్వ శాఖతో విద్యా మంత్రిత్వ శాఖ రెండు దఫాలుగా చర్చలు జరిపింది. ప్రస్తుతం నీట్‌యుజి ఆఫ్‌లైన్‌లో పెన్, పేపర్ మోడ్‌లో నిర్వహించబడుతోంది. ఇందులో విద్యార్థులు ఒఎంఆర్ షీట్‌లో బహుళ ఎంపిక ప్రశ్నలను పరిష్కరించాలి. హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య పరంగా చూస్తే దేశంలోనే అతి పెద్ద ప్రవేశ పరీక్ష నీట్‌యుజి. 2024సంవత్సరంలో రికార్డు స్థాయిలో 24లక్షల మంది నీట్ పరీక్షకు హాజరయ్యారు.'నీట్‌కు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ మంత్రిత్వ శాఖ ఆరోగ్య మంత్రిత్వ శాఖ. అందువల్ల మేం నీట్‌ను పెన్, పేపర్ మోడ్‌లో నిర్వహించాలా లేదా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి)కి మారాలా అనే విషయంమై విద్యా శాఖ ఆరోగ్య మంత్రిత్వ శాఖతో చర్చలు జరుపుతున్నాం' అని చెప్పారు. 'మేం జెపి నడ్డా నేతృత్వంలోని ఆరోగ్య మంత్రిత్వ శాఖతో రెండు సార్లు సంప్రదింపులు జరిపాం. పరీక్ష నిర్వహణకు ఏ ఎంపికైనా ఉండవచ్చు. ఏ ఆప్షన్‌ను ఆమోదించినా అత్యంత అనుకూలమైనది మాత్రమే పరిగణింపబడుతుంది. దీనిపై ఎన్‌టిఎ కసరత్తు చేయడానికి సిద్ధంగా ఉంది' అని ఆయన విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలియజేశారు.'నీట్ మెథడాలజీ ఏమిటి? ప్రోటోకాల్ ఏమిటి? త్వరలోనే నిర్ణయించబడుతుంది. మేం దానిని త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం' అని ప్రధాన్‌చెప్పారు.మెడికల్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఎన్‌టిఎ ప్రతీ ఏడాది నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)ను నిర్వహిస్తుంది.ఎంబిబిఎస్ కోర్సుకు 1,08,000 సీట్లు అందుబాటులో ఉన్నాయి.ఎంబిబిఎస్ కోర్సు కోసం అందుబాటులో ఉన్న సీట్లలో సుమారు 56,000సీట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఉండగా, 52,000సీట్లు ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో అందుబాటులో ఉన్నాయి.ప్రైవేట్ కళాశాలలు డెంటిస్ట్రీ, ఆయుర్వేద, యునానీ, సిద్ధ అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులలో ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్లకు నీట్ ప్రవేశ ఫలితాలను ఉపయోగించుకుంటాయి. అయితే నీట్ కోసం కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) మోడ్‌కు మారాలన్నది ఆలోచన కొత్త కాదు. అది ఇంతకుముందు చర్చించబడినదే. అయితే ఈ ఏడాది ప్రారంభంలో పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో పరీక్ష సంస్కరణలకు ఫుల్‌స్టాప్ పడింది. నీట్, పిహెచ్‌డి ప్రవేశ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎన్‌ఇటి)లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టిఎ పరీక్షలను పారదర్శకంగా, సజావుగా, న్యాయంగా నిర్వహించేందుకు కేంద్రం జులైలో ప్యానెల్‌ను నియమించింది.భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మాజీ చీఫ్ ఆర్.రాధాకృష్ణన్ ఉన్నత స్థాయి ప్యానెల్ పరీక్షల ఎండ్‌టూఎండ్ ఆపరేషన్లను నిర్వహించడానికి , అనేక టెస్ట్ ఇండెంట్ ఏజెన్సీల నుంచి వచ్చిన విభిన్న అభ్యర్థనలకు అనుగుణంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)తనను తాను విస్తరించిందని పేర్కొంది.'ఎన్‌టిఎ ప్రాథమికంగా ప్రవేశ పరీక్షలను నిర్వహించాలి. ఇతర పరీక్షలకు దాని పరిధిని పెంచడం, ఎన్‌టిఎ సామర్థ్యాన్ని పెంచిన అనంతరం పరిగణించబడుతుంది' అని ప్యానెల్ తన నివేదికలో పేర్కొంది.

# 'సంధ్య'కు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందని, దీనికి తోడు సంధ్య 70 ఎంఎం, 35 ఎంఎం రెండూ ఒకే కాంపౌండ్లో ఉన్నాయని, సంధ్య 70 ఎంఎం స్క్రీన్‌కు విడిగా ఎంట్రీ, ఎగ్జిట్ లేవని ఆ లేఖలో పోలీసులు పేర్కొన్నారు. సింగిల్ ఎంట్రీ కారణంగా స్పెషల్ షో, న్యూ రిలీజ్ సందర్భంగా ఒకవేళ సెలబ్రిటీలు వస్తే క్రౌడ్ మేనేజ్మెంట్ కష్టమవుతుందని, స్పెషల్ షో కోసం హీరోహీరోయిన్లు, ఇతర టీం రావొద్దని చెప్పాల్సిందిగా ఆ లేఖలో పోలీసులు సూచించినట్టుగా ఉంది. చేతి రాతతో ఉన్న ఈ లేఖలో ఇన్స్పెక్టర్ సంతకంతో పాటు అది తమకు ముట్టినట్టుగా సంధ్య థియేటర్ వేసిన స్టాంప్ కూడా ఉంది. ఈ లేఖ కనుక నిజమైనదే అయితే సంధ్య థియేటర్ చుట్టూ ఉచ్చు మరింత బిగుసుకున్నట్టే. తాము వద్దని లేఖ రాసినా యాజమాన్యం నిర్లక్ష్యంగా నటీనటులను ఆహ్వానించడం పెద్ద తప్పే అవుతుందని చెబుతున్నారు. కాగా, కోర్టులో ఇరు పక్షాల వాదనల సందర్భంగా తాము న్యాయమూర్తి ఎదుట నివేదికను ప్రవేశపెట్టినట్టు చిక్కడపల్లి ఇన్స్పెక్టర్ రాజు నాయక్ తెలిపారు.

**శ్రీతేజ్ మెదడుకు డ్యామేజి జరిగింది: సిపి సివి ఆనంద్**

సంధ్యా థియేటర్ ఘటనలో గాయపడిన శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లు మంగళవారం బులెటిన్ విడుదల చేశారు. ప్రభుత్వం తరపున నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా బాలుడు శ్రీతేజ్ చికిత్స పొందుతున్న కిమ్స్ ఆసుపత్రి వద్దకు వచ్చారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. తొక్కిసలాట ఘటనలో శ్రీతేజ్ మెదడుకు డ్యామేజి జరిగిందని బులెటిన్ లో పేర్కొన్నట్టు సీవీ ఆనంద్ తెలిపారు. కోలుకోవడానికి చాలా సమయం పడుతుందని తెలిపారు. మెదడు దెబ్బతిన్న కారణంగా చికిత్స చాలా కాలం కొనసాగించాల్సి ఉంటుందని డాక్టర్లు చెప్పారని వివరించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com